అక్షర కలం తెలుగు దిన పత్రికలో
పదవి విరమణ, కోర్టు నోటీసులు,
జన్మదిన, వ్యాపార అభివృద్ధి కొరకు
మరియు అన్ని రకాల ప్రకటనలు ప్రచురించబడును.
సంప్రదించండి 93962 18955
aksharakalam@gmail.com
అక్షరకలం తెలుగు దినపత్రిక

epaper. aksharakalam. com

# అక్షరకలం

తెలుగు దినపత్రిక

aksharakalam@gmail.com

అక్షరకలం తెలుగు దినపత్రిక
విలేఖరులు కావలెను
తెలంగాణ రాష్ట్రంలో సంచలనంగా దూసుకెళ్తున్న 'అక్షర కలం'తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు మండలాల వారిగా, నియోకవర్గాలవారిగా,జిల్లాల వారిగా విలేకరులు, యాడ్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను.
గమనిక : డిగ్రీ ఉత్తీర్ణుల మరియు వివిధ పత్రికలలో పని చేసిన అనుభవం ఉన్నవారికి ప్రాముఖ్యత కలదు
epaper.aksharakalam.com
aksharakalam@gmail.com
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 93962 18955

సంపుటి : 17 సంచిక : 252 | 24-10-2025 శుక్రవారం | ఎడిటర్ : పిట్టల రామకృష్ణ | నల్లగొండ | హైదరాబాద్ | వరంగల్ | మహబూబ్‌నగర్ | పేజీలు : 12 వెల : రూ.1.00



## రేవంత్ పాలనలో దర్జాగా సెటిల్‌మెంట్లు

ఎవరికీ వచ్చినట్టు వారు దోచుకుంటున్నారు
కాంగ్రెస్ అవినీతిలో అధికారులు భాగస్వామ్యం కావొద్దు
సీఎం రేవంత్‌రెడ్డిపై కేటీఆర్ ఆగ్రహం

2 లో..

# 'ఇద్దరు పిల్లల నిబంధన' ఎత్తివేత

### తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయం
### గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు ఆర్డినెన్స్ బిల్లు

తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఉన్న 'ఇద్దరు పిల్లల నిబంధన' ఎత్తివేతకు కేబినెట్ ఆమోదం తెలిపింది. పంచాయతీరాజ్ చట్టం 2018లోని సెక్షన్ 21(3) తొలగించాలని కేబినెట్ నిర్ణయించింది. ఇప్పటికే పంచాయతీ రాజ్ చట్టం 2018లోని సెక్షన్ 21(3)ని సవరించే ఆర్డినెన్స్‌పై ఆ శాఖ మంత్రి సీతక్క, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంతకం చేశారు. కేబినెట్ ఆమోదం పొందిన నేపథ్యంలో ఆర్డినెన్స్ బిల్లు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ దగ్గరకు వెళ్లనుంది.



వార్త 2లో



## జూబ్లీహిల్స్ ఎన్నికపై కేసీఆర్ సమావేశం



హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి

హైదరాబాద్ : జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నిక నేపథ్యంలో, బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత గోపీనాథ్ గెలుపు లక్ష్యంగా.. పార్టీ అధినేత కేసీఆర్ అధ్యక్షతన సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సహా పార్టీ సీనియర్ నేతలు, జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధిలోని అన్ని డివిజన్ల, క్లస్టర్ల ఇంచార్జులు మాజీ మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ చైర్మన్లు, పార్టీ సీనియర్ నేతలు, ముఖ్య నేతలు, స్థానిక కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, తదితర పార్టీ కీలక నేతలు హాజరయ్యారు.



2 లో..

## వచ్చే మూడ్రోజుల్లో భారీ వర్షాలు

తెలంగాణలో రాగల మూడురోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది.



## ప్రజలు కోరుకుంటే రాజకీయ పార్టీగా మారొచ్చు

- ప్రజల సమస్యలపై గళమెత్తుతూనే ఉంటాం
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత

యాదగిరిగుట్ట,



రాష్ట్రంలో 19 ఏళ్ల క్రితం ఎన్జీవోగా పుట్టిన తెలంగాణ జాగృతి సంస్థ ప్రజలు కోరుకుంటే రాజకీయ పార్టీగా మారొచ్చని ఆ సంస్థ అధ్యక్షురాలు కల్వ కుంట్ల కవిత అన్నారు. తెలంగాణ జాగృతి కార్యకర్తలతో కలిసి యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీన రసింహస్వామి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వైకుంఠ ద్వారం వద్ద ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. తెలంగాణ జాగృతి సివిల్ సొసైటీ ఆర్గనైజేషన్ గా ఉన్నా ప్రజల సమస్యలపై గళ మెత్తిందన్నారు. ఇకపైనా అదే వైఖరిని కంటిన్యూ చేస్తామని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో ప్రజల తరపున మాట్లాడామని, ఏం చేస్తే ప్రజలకు మంచి జరుగుతుందో తెలంగాణ జాగృతి తన గళాన్ని వినిపించిందని అన్నారు. ప్రజల తరపున పోరాడాలంటే రాజకీయ పార్టే కానవసరం లేదన్న ఆమె.. కానీ ప్రజలు కోరుకుంటే మాత్రం తెలంగాణ జాగృతి రాజకీయ పార్టీగా మారవచ్చని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళలో అనేక ప్రాంతీయ పార్టీలు ఉన్నాయన్నారు. తెలంగాణ జాగృతి కూడా రాజకీయపార్టీగా మారడం కూడా పెద్ద విషయం కాద న్నారు. కానీ సమయం, సందర్భంగా వచ్చిన ప్పుడు జాగృతి సంస్థ కూడా రాజకీయ పార్టీగా ఆవిర్భవించవచ్చని స్పష్టం చేశారు. రాజకీయ పార్టీల వల్ల ప్రజలకు మంచి జరగాలనేది తమ సంకల్పమని పేర్కొన్నారు. ప్రజల సమస్యలు తెలుసుకోవడం కోసమే ఈ నెల 25న నిజామాబాద్ లో తెలంగాణ జాగృతి జనం బాట యాత్రను ప్రారంభించి నాలుగు నెలల పాటు నిర్విరామంగా కొనసాగించనున్నట్లు వెల్లడించారు.



2 లో..

## పోచారం కాల్పుల కేసును 12 గంటల్లోనే ఛేదించాం

పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన కాల్పుల కేసును 12 గంటల్లోనే ఛేదించామని రాచకొండ సీపీ సుధీర్ బాబు తెలిపారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. యమ్నంపేట్ వద్ద అక్టోబర్ 22న సాయంత్రం కాల్పుల్లో గో రక్షక్ కార్యకర్త బిడ్ల ప్రసాంత్ అలియాస్ సోను సింగ్ తీవ్రంగా గాయపడ్డారన్నారు. గో రక్షక్ దళ్ కార్యకర్త ప్రశాంత్‌పై కాల్పులు జరిపిన నిందితులను అరెస్ట్ చేశామని తెలిపారు.

## గ్లోబల్ లైఫ్ సైన్సెస్ హబ్‌గా తెలంగాణ

### తెలంగాణ ఐటి శాఖమంత్రి శ్రీధర్‌బాబు

మెల్‌బోర్న్, అక్షరకలం ప్రతినిధి



తెలంగాణను గ్లోబల్ లైఫ్ సైన్సెస్ హబ్‌గా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ ఐటి శాఖమంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. మెల్‌బోర్న్‌లో ఆస్ట్రేలియా లైఫ్ సైన్సెస్ అత్యున్నత నిర్ణాయక సంస్థ 'ఆస్ బయోటెక్' నిర్వహించిన సదస్సులో శ్రీధర్‌బాబు కీలకోపన్యాసం చేశారు. తెలంగాణ లైఫ్ సైన్సెస్ సాధించిన పురోగతి, భవిష్యత్ ప్రణాళిక, పెట్టుబడులకు ఉన్న అనుకూలతలను వివరించారు. జీడీపీలో తెలంగాణ వాటా 5శాతం, గత ఆర్థిక సంవత్సరంలో జాతీయ సగటు కంటే రాష్ట్ర జీఎస్‌డీపీ ఎక్కువ. ఏడాదిన్నరలో రూ. 3. 2లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చాం. లైఫ్ సైన్సెస్ రంగాన్ని రాబోయే ఐదేళ్లలో 250 మిలియన్ డాలర్లకు చేర్చడమే లక్ష్యం. దీనికి సంబంధించి త్వరలో నూతన పాలసీ తీసుకు రాబోతున్నాం. గ్లోబల్ లైఫ్ సైన్సెస్ అట్లాస్‌లో భారత్ నుంచి హైదరాబాద్‌కు మాత్రమే స్థానం దక్కింది. బయో డిజిటల్ యుగానికి కావాల్సిన అత్యుత్తమ వనరులు అందించేలా యువతను తీర్చిదిద్దుతున్నాం" అని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు.


## ముంబైలో అగ్ని ప్రమాదం

న్యూఢిల్లీ, అక్షరకలం ప్రతినిధి

దేశ ఆర్థిక రాజధాని ముంబైలోని ఓ వాణిజ్య భవనంలో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. జోగేశ్వరి వెస్ట్ ఏరియాలోగల జేఎంఎస్ బిజినెస్ సెంటర్‌లో ఒక్కసారిగా మంటలు ఎగిసిపడ్డాయి. దాంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనా ప్రాంతానికి చేరుకున్నారు. ఫైరింజన్‌ల సాయంతో మంటలను ఆర్పుతున్నారు. భవనం పై అంతస్తులో పలువురు చిక్కుకున్నారు. వారిని కిందకు దించేందుకు రెస్క్యూ టీమ్స్ ప్రయత్నిస్తున్నాయి. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికిగల కారణాలు తెలియాల్సి ఉందన్నారు.

## అధికారులపై ఒత్తిడితోనే వీఆర్ఎస్‌లు : ఎంపీ లక్ష్మణ్

హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి



రేవంత్‌రెడ్డి పాలనలో ఐఏఎస్ అధికారులు భయపడుతూ ఉద్యోగాలు చేస్తున్నారని బీజేపీ రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కే లక్ష్మణ్ ఆరోపించారు. వారి స్వార్థం కోసం అధికారులపై ఒత్తిడి తేస్తున్నారని మండిపడ్డారు. ఇదివరకు ఎప్పుడూ ఇలాంటి పరిస్థితులు లేవని పేర్కొన్నారు. సీనియర్ ఐఏఎస్ అధికారి సయ్యద్ అలీ ముర్తుజా రిజ్వీ వీఆర్ఎస్ తీసుకోవడం రాష్ట్ర ప్రభుత్వ వ్యవహార శైలిపై అనుమానాలకు తావిస్తోందని అన్నారు. రిజ్వీ ఎందుకు వీఆర్ఎస్ తీసుకోవాల్సి వచ్చిందో రాష్ట్ర ప్రభుత్వం జవాబు చెప్పాలని డాక్టర్ లక్ష్మణ్ ప్రశ్నించారు. 'మంత్రులు ఒత్తిడికి లొంగకపోతే వాళ్లని బలి చేస్తారా..?' అని ఆయన దుయ్యబట్టారు. 'మీ స్వార్థం కోసం అధికారులని వేధిస్తారా..?' అని లక్ష్మణ్ ఘాటుగా విమర్శించారు. ఇంకా విచారణ పేరుతో సీనియర్ ఐఏఎస్ అధికారిని వేధించడం తగదని ఆయన హితవు పలికారు. ఒక వేళ తప్పుచేసి ఉంటే ఇన్ని రోజులు ఎందుకు మాట్లాడలేదని రాష్ట్ర ప్రభుత్వాన్ని, మంత్రులను ఆయన నిలదీశారు.

# రేవంత్ పాలనలో దర్జాగా సెటిల్‌మెంట్లు

## ఎవరికీ వచ్చినట్టు వారు దోచుకుంటున్నారు

### కాంగ్రెస్ అవినీతిలో అధికారులు భాగస్వామ్యం కావొద్దు

### సీఎం రేవంత్‌రెడ్డిపై కేటీఆర్ ఆగ్రహం

హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి

సీఎం రేవంత్‌రెడ్డి పాలనలో కేవలం సెటిల్‌మెంట్లు తప్ప ఏమీ నడవడం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ విమర్శించారు. ఒక మంత్రి ఇంటికి టాస్క్ ఫోర్స్ పోలీసులను ముఖ్యమంత్రి పంపడం, నిందితుని స్వయంగా మంత్రి తన కారులో తీసుకొని మాయమైపోవడం ఎప్పుడూ చూడలేదు. స్వయంగా ముఖ్యమంత్రి అనుచరుడు, ఆప్తుడు రోహిన్ రెడ్డి బెదిరించారని, తుపాకీ రేవంత్ రెడ్డే ఇచ్చిండని మంత్రి కుమార్తె చెప్పారన్నారు. ముఖ్యమంత్రే తుపాకీ ఇచ్చి పంపించాడని ఆరోపణ చేసినప్పుడు, సీఎం సిగ్గు లేకుండా మౌనంగా ఉన్నాడని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డికి సిగ్గు ఉంటే కనీసం ఈ అంశంపైన స్పందించాలని డిమాండ్‌చేశారు. రేవంత్ రెడ్డి వంటి బలహీన ముఖ్యమంత్రిని ప్రపంచంలో ఎప్పుడూ చూడలేదని, స్వయంగా నీపైన మంత్రి బిడ్డే ఆరోపణలు చేస్తే ఆ మంత్రిని పక్కకు జరపలేవు. స్వయంగా నీ మంత్రులు మీపై ఆరోపణలు చేస్తున్నా కనీసం వారిని ముట్టుకోలేని బలహీన ముఖ్యమంత్రివి అని ధ్వజమెత్తారు. తన పరిపాలన పైన, మంత్రుల పైన ఎలాంటి పట్టు లేదని తేలిపోయిందన్నారు. దావూద్ ఇబ్రహీం లాంటి ముఖ్యమంత్రిని తరిమేసుకుంటేనే తెలంగాణకు పట్టిన శనిపోతుందన్నారు. కాంగ్రెస్ అవినీతికి ప్రభుత్వ అధికారులు కూడా భయపడుతున్నారని అన్నారు. వీరి వాటాల పంచాయతీలో మాకు భాగస్వామ్యం వద్దు, మాకు సంబంధం లేదంటూ అధికారులు పారిపోతున్నారు. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను తప్పుడు పనులు చేయమని వేధించడం వల్లనే వారు వాలంటరీ తీసుకుంటున్నారని ఆరోపించారు. మంచి అధికారులు కూడా పారిపోయేలా చేసే దండుపాళ్యం ముఠా రాష్ట్రంలో ఉందని హెచ్చరించారు. తను చెప్పిన పని చేయలేదని చెప్పి సీనియర్ ఐఏఎస్ రిజ్వీ వీఆర్ఎస్ తీసుకుంటే కూడా, ఆయన రాజీనామా ఆమోదించవద్దని జూపల్లి కృష్ణారావు కోరారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అరాచకాలకు, అక్రమాలకు భాగస్వాములు అయితే, అధికారులు వత్తాసు పలికితే గతంలో మాదిరి జైలుకు వెళ్లవలసి వస్తుందని హెచ్చరించారు. గతంలో మాదిరి అధికారులకు శిక్ష కూడా పడుతుందని పేర్కొన్నారు. కాబట్టి జాగ్రత్తగా ఉండాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో అవినీతి విలయతాండవం చేస్తున్నదని ఆందోళన వ్యక్తంచేశారు. ముఖ్యమంత్రి వేల కోట్లు సంపాదిస్తుంటే, మేము వందల కోట్లయినా సంపాదించవద్దా అని మంత్రులు పోటీ పడుతున్నారన్నారు.

## పోచారం కాల్పుల కేసును 12 గంటల్లోనే ఛేదించాం

### సీపీ సుధీర్‌బాబు

హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి

పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన కాల్పుల కేసును 12 గంటల్లోనే ఛేదించామని రాచకొండ సీపీ సుధీర్ బాబు తెలిపారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. యమ్నంపేట్ వద్ద అక్టోబర్ 22న సాయంత్రం కాల్పుల్లో గో రక్షక్ కార్యకర్త బిర్ల ప్రశాంత్ అలియాస్ సోను సింగ్ తీవ్రంగా గాయపడ్డారన్నారు. గో రక్షక్ దళ్ కార్యకర్త ప్రశాంత్‌పై కాల్పులు జరిపిన నిందితులను అరెస్ట్ చేశామని తెలిపారు. ప్రధాన నిందితుడు ఏ1 మొహమ్మద్ ఇబ్రాహీం ఖురేషీని అరెస్టు చేశామని... అలాగే సహ నిందితులు ఏ3 కురువ శ్రీనివాస్, ఏ4 హసన్ బిన్ మోసిన్‌లను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. మరో నిందితుడు ఏ2 హనీఫ్ ఖురేషీ పరారీలో ఉన్నాడన్నారు. ఇబ్రాహీం.. పశువుల రవాణా వ్యాపారం చేస్తున్నాడని.. గోవుల అక్రమ రవాణా బయటపెట్టాడని ప్రశాంత్‌పై నిందితులు కక్ష పెట్టుకున్నారన్నారు. నిందితుడు ఇబ్రాహీం, బాధితుడు సోను సింగ్‌కు గతంలో పరిచయం ఉందని చెప్పారు. దీనిపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తున్నామని అన్నారు. ఇబ్రాహీం 12 సంవత్సరాలుగా పశువుల రవాణా వ్యాపారం చేస్తున్నాడని.. ప్రశాంత్ గతంలో 6 సార్లు పశువుల అక్రమ రవాణా అడ్డుకున్నాడని తెలిపారు. దాంతో ఇబ్రాహీంకు 1 కోటి రూపాయల నష్టం వచ్చిందన్నారు. ఈ క్రమంలో సోనూ సింగ్ అలియాస్ ప్రశాంత్‌పై ఇబ్రాహీం కక్ష పెంచుకున్నాడన్నారు సీపీ. పశువులను రవాణా చేసుకోవాలంటే 5 లక్షలు ఇవ్వాలని ప్రశాంత్ డిమాండ్ చేశాడని నిందితులు చెబుతున్నారని.. దీనిపై అన్ని కోణాల్లోనూ దర్యాప్తు చేస్తున్నామని రాచకొండ సీపీ తెలిపారు. నిందితుడు శ్రీనివాస్.. సెటిల్ చేసుకుందాం, మాట్లాడుకుందామని చెప్పి ప్రశాంత్‌ను స్పాట్‌కు రప్పించాడని... మాట్లాడుకుందామని పిలిచి ఫైరింగ్ చేసి పారిపోయారన్నారు. పిస్టల్‌ను ఛత్తీస్‌గఢ్‌లో కొనుగోలు చేసినట్టు తమ దర్యాప్తులో తేలిందన్నారు. నిందితులు వాడిన వెహికల్ సీజ్ చేశామని... ఒక పిస్టల్, మూడు సెల్ ఫోన్స్ సీజ్ చేశామని తెలిపారు. ప్రస్తుతం ప్రశాంత్ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందన్నారు. ఈ ఏడాది రాచకొండ కమిషనరేట్ పరిధిలో 5110 పశువుల్ని ఇప్పటి వరకు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ సంవత్సరం పశువుల అక్రమ రవాణాకు సంబంధించి ఇప్పటి వరకు 288 కేసులు నమోదు చేసినట్లు రాచకొండ సీపీ సుధీర్ బాబు పేర్కొన్నారు.

## వచ్చే మూడ్రోజుల్లో భారీ వర్షాలు

### హెచ్చరించిన వాతావరణశాఖ

హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి

తెలంగాణలో రాగల మూడురోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం రాబోయే 12గంటల్లో ఉత్తర తమిళనాడు, దక్షిణ ఆంధ్రప్రదేశ్ తీరాలను ఆనుకొని ఉన్న పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని వాతావరణశాఖ పేర్కొంది. ఆ తర్వాత 12గంటల్లో ఉత్తర తమిళనాడు, పుదుచ్చేరి, దక్షిణ ఆంధ్రప్రదేశ్ తీరాల మీదుగా కదిలే అవకాశం ఉందని చెప్పింది. గురువారం ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, వికారాబాద్, సంగారెడ్డి, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. వరంగల్, హనుమకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నా గర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిశాయని తెలిపింది. శుక్రవారం ఖమ్మం, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే ఛాన్స్ ఉందని పేర్కొంది. కొత్తగూడెం, వరంగల్, హనుమకొండ, జనగాం, సిద్దిపేట, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వానలు పడే సూచనలున్నాయని తెలిపింది. శనివారం వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో భారీ వర్షాలు.. భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నా రాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వానలు కురిసే ఛాన్స్ ఉందని వివరించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది.

# ఇద్దరు పిల్లల నిబంధన' ఎత్తివేత

## తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయం

### గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు ఆర్డినెన్స్ బిల్లు

హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి

తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఉన్న 'ఇద్దరు పిల్లల నిబంధన' ఎత్తివేతకు కేబినెట్ ఆమోదం తెలిపింది. పంచాయతీరాజ్ చట్టం 2018లోని సెక్షన్ 21(3) తొలగించాలని కేబినెట్ నిర్ణయించింది. ఇప్పటికే పంచాయతీ రాజ్ చట్టం 2018లోని సెక్షన్ 21(3)ని సవరించే ఆర్డినెన్స్‌పై ఆ శాఖ మంత్రి సీతక్క, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంతకం చేశారు. కేబినెట్ ఆమోదం పొందిన నేపథ్యంలో ఆర్డినెన్స్ బిల్లు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ దగ్గరకు వెళ్లనుంది. గవర్నర్ ఈ బిల్లును ఆమోదిస్తే వచ్చే గ్రామీణ స్థానిక ఎన్నికల్లో ఇద్దరికి మించి పిల్లలు ఉన్నవారు కూడా పోటీ చేసేందుకు వీలు కలుగుతుంది. కాగా, 1994లో అప్పటి ప్రభుత్వం కుటుంబ నియంత్రణపై అవగాహన కల్పించడానికి ఇద్దరు పిల్లల నిబంధనను అమల్లోకి తెచ్చింది. 1994 తర్వాత మూడో సంతానం కలిగిన వారు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి అనర్హులుగా మారారు. 1994లో అప్పటి ప్రభుత్వం కుటుంబ నియంత్రణపై అవగాహన కల్పించడంలో భాగంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇద్దరు పిల్లల నిబంధనను అమల్లోకి తెచ్చింది. ఈ చట్టం ప్రకారం 1994 తర్వాత మూడో సంతానం కలిగితే వారు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి అనర్హులు. ఏపీ నుంచి తెలంగాణ విడిపోయాక 2018లో తెలంగాణ పంచాయతీరాజ్ చట్టాన్ని రూపొందించిన కేసీఆర్ ప్రభుత్వం.. ఇద్దరు పిల్లల నిబంధనను టచ్ చేయలేదు. పంచాయతీరాజ్ చట్టం 2018 సెక్షన్ 21(3) ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఇద్దరి కంటే ఎక్కువ పిల్లలున్న వారు అనర్హులు. అయితే.. ప్రస్తుతం కుటుంబ నియంత్రణపై అవగాహన పెరిగినందున పాత నిబంధనను మార్చి ఇద్దరి కంటే ఎక్కువ సంతానం ఉన్న వారికి సైతం పోటీ చేసే అవకాశం ఇవ్వాలని పలు రాజకీయ పార్టీలు కోరాయి. 2024 డిసెంబర్ 20న జరిగిన రాష్ట్ర మంత్రి వర్గ సమావేశంలో ఈ ప్రతిపాదన రాగా మంత్రి వర్గం ఆమోదించలేదు. తాజాగా ఇవాళ జరిగిన కేబినెట్.. పంచాయతీ ఎన్నికల్లో ఇద్దరు పిల్లల నిబంధనను ఎత్తివేతకు ఆమోదం తెలిపింది.

## దీపావళి వారి వెలుగులు తీసేసింది

### వేడుకల్లో పేలుడు వల్ల 125మంది కంటికి గాయాలు

న్యూఢిల్లీ, అక్షరకలం ప్రతినిధి

జీవితాల్లో వెలుగులు నింపే దీపావళి పండుగ మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్ నగరంలోని కొన్ని కుటుంబాల్లో చీకటిని నింపింది. నేటి రోజుల్లో దీపావళి రోజు బాణాసంచా కాల్చడం పతాక స్థాయికి చేరింది. కొత్త కొత్త బాణాసంచా వీధుల్లో అందుబాటులోకి రావడంతో పిల్లలతో సహా పెద్దలు కూడా వాటిని కొనుగోలు చేసి కాల్చుతున్నారు. తాజాగా బాణాసంచా కాలుస్తుండగా అనుకోని ఘటన జరిగింది. తుపాకీ ఆకారంలోనే ఉండే బాణాసంచాను పిల్లలు పేలుస్తుండగా.. అందులోని విషపు రసాయనాలు పిల్లల కంటిపై పడి తీవ్ర ప్రభావం చూపింది. గన్ కాల్చేటప్పుడు.. గొట్టంలో పెట్టి గురి చూసి కాల్చుతారు. అలాగే చిన్నపిల్లలు కూడా కాల్చుతుండగా రసాయనాలు పేలి కళ్లపై పడ్డాయి . కేవలం రూ. 150-200 ఖర్చుతో తయారయ్యే కాల్షియం కార్బైడ్ తుపాకీ, పిల్లల జీవితాల్లో అంధకారం సృష్టించింది. కళ్ళకు గాయాలు కావడంతో పిల్లలందరిని ఆసుపత్రులకు తరలించారు. అయితే కొందరు పెద్దలు కూడా ఈ తుపాకిని పేల్చి తమ ప్రాణాల మీదికి తెచ్చుకున్నారు. ఆసుపత్రులు తెలిపిన వివరాల ప్రకారం ఇప్పటివరకు 125 మందికి పైగా ఈ పేలుడు బారిన పడ్డారు. ఈ గ్యాస్ లైటర్, ప్లాస్టిక్ పైపు, సులభంగా దొరికే కాల్షియం కార్బైడ్‌తో ఈ బొమ్మ తుపాకిని తయారు చేస్తారు. పైపులో ఉన్న కార్బైడ్ నీటితో కలిసినప్పుడు ఆసిటైలిన్ వాయువు ఉత్పత్తి అవుతుంది. ఆ సమయంలో చిన్న చిమ్మటి చిమ్మరుతో భారీ పేలుడు సంభవిస్తుంది. పైపు పగిలిపోతే ప్లాస్టిక్ ముక్కలు కళ్లలోకి, ముఖంపైకి దూసుకెళ్లి తీవ్రమైన గాయాలు కలిగిస్తాయి. చాలా సార్లు పిల్లలు ఆసక్తిగా పైపులోకి చూడగానే పేలుడు జరిగి కళ్లకు, ముఖానికి, కార్నియాకు గాయాలయ్యాయి. భోపాల్ ఆసుపత్రుల నివేదికల ప్రకారం, వందకు పైగా బాధితుల్లో 20-30 శాతం మందికి తీవ్రమైన డ్యామేజ్ అయిందని పేర్కొంది. కొందరికి వెంటనే శస్త్రచికిత్స చేయాల్సి వచ్చిందని.. కొంతమందికి కార్నియా ట్రాన్స్‌ప్లాంట్ చేయాల్సి వచ్చిందని వైద్యులు తెలిపారు.

## మహాకూటమి పోస్టర్ నుంచి రాహుల్ ఫొటో అవుట్

న్యూఢిల్లీ, అక్షరకలం ప్రతినిధి

కూటమి తరఫున సీఎం అభ్యర్థి ప్రకటన కోసం ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్ పోస్టర్ల నుంచి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఫొటో మాయమవడం రాజకీయంగా తీవ్ర చర్చనీయాంశమవుతోంది. వచ్చే నెల బీహార్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా నేడు ప్రతిపక్ష కూటమి పార్టీలు పాట్నాలోని ఓ హోటల్‌లో ప్రెస్‌మీట్ ఏర్పాటు చేశాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పోస్టర్లలో ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ ఫొటోను మాత్రమే ప్రముఖంగా ప్రదర్శించారు. మిగతా భాగస్వామ్య పార్టీల నేతల చిన్న ఫొటోలను పోస్టర్లలో ఏర్పాటు చేశారు. అయితే, అందులో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ ఫొటో మాత్రం ఎక్కడా కనిపించలేదు. ఈ వ్యవహారం ప్రస్తుతం రాజకీయంగా తీవ్ర చర్చనీయాంశమైంది. ఇందుకు సంబంధించిన పోస్టర్లు కూడా నెట్టింట వైరల్‌గా మారాయి. దీనిపై బీజేపీ తీవ్రంగా స్పందించింది. ఈ మేరకు విమర్శలకు ఎక్కుపెట్టింది. తేజస్వి యాదవ్, ఆయన మద్దతుదారులు.. రాహుల్ నాయకత్వాన్ని అవమానించారంటూ వ్యాఖ్యానించింది. తాజా పరిణామాలపై బీజేపీ నేత షెహజాద్ పూనవాలా ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. 'నిన్నటి వరకూ రాహుల్ గాంధీయే కూటమి ముఖచిత్రంగా చెప్పుకున్నారు. కానీ ఇప్పుడు కాంగ్రెస్ పార్టీకి ఏ మాత్రం గౌరవం లేదని స్పష్టమవుతోంది. ఈ కూటమికి గందరగోళం, విభజన, పదవుల కోసం ఆశ తప్ప.. ఒక లక్ష్యం గానీ, దార్శనికత గానీ లేవు' అంటూ ఎద్దేవా చేశారు.

## బిజీబిజీగా చంద్రబాబు రెండోరోజు పర్యటన

### అబుదాబిలో పలువురు పారిశాపారిశ్రామికవేత్తలతో భేటీ

అమరావతి, అక్షరకలం ప్రతినిధి

రాష్ట్ర అభివృద్ధి, పెట్టుబడులే లక్ష్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విదేశీ పర్యటనను కొనసాగిస్తున్నారు. రెండో రోజు పర్యటనలో భాగంగా గురువారం అబుదాబీలో పర్యటించారు. అబుదాబీలోని పారిశ్రామికవేత్తలు, ప్రభుత్వ విభాగాల ప్రతినిధులతో సీఎం నారా చంద్రబాబు నాయుడు భేటీ అయ్యారు. మొత్తం తొమ్మిది కీలక మీటింగ్‌లు, విజిట్‌లలో సీఎం చంద్రబాబు బృందం పాల్గొనుంది. ముఖ్యంగా పెట్టుబడులపై స్థానిక పారిశ్రామికవేత్తలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నారు. అబుదాబీ నేషనల్ ఆయిల్ కంపెనీల ప్రతినిధులు, అబుదాబీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్ అహ్మద్ జైసిమ్ అల్ జాబీ, జీ 42 సీఈఓ మన్సూర్ అల్ మన్సూరీ, అబుదాబీ ఇన్వెస్ట్‌మెంట్ విభాగం చైర్మన్ ఖలీఫా ఖౌరీతో చంద్రబాబు భేటీ కానున్నారు. ఈ సమావేశాల్లో ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు, పారిశ్రామిక భాగస్వామ్యాలు, టెక్నాలజీ సహకారం వంటి అంశాలపై చర్చలు జరగనున్నాయి. అదే విధంగా లులూ గ్రూప్ సీఎండీ యూసఫ్ అలీ, అగితా గ్రూప్ సీఈఓ సల్మీన్ అల్ మెరీ, మస్దార్ సిటీ సీఈఓ మహ్మద్ జమీల్ అల్ రమాహిలతో సీఎం చంద్రబాబు ప్రత్యేక సమావేశాలు జరపనున్నారు. ఈ సమావేశాల్లో ఆంధ్రప్రదేశ్‌లో రిటైల్, ఇంధనం, పర్యావరణ అనుకూల ప్రాజెక్టులలో పెట్టుబడులపై చర్చ జరగనుంది. అబుదాబీలోని యాస్ ఐల్యాండ్ పర్యాటక ప్రాజెక్టులను సందర్శించి, ఆంధ్రప్రదేశ్‌లో పర్యాటక రంగ అభివృద్ధి దిశగా ఆలోచనలు పంచుకోనున్నారు. చివరిగా, భారత కౌన్సిల్ జనరల్ నివాసంలో ముఖ్యమంత్రి గౌరవార్థం ఏర్పాటు చేసిన విందుకు చంద్రబాబు హాజరుకానున్నారు.

## సీఎం అభ్యర్థిగా తేజస్వీయాదవ్

న్యూఢిల్లీ,

బిహార్ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు సమయం సమీపిస్తుంది. అలాంటి వేళలో సైతం విపక్ష కూటమి మహాగఠ్‌బంధన్‌లో సీట్ల సర్దుబాటు ఒక్క కొలిక్కి రావడం లేదు. అయితే ఈ కూటమి ముఖ్యమంత్రి అభ్యర్థిపై మాత్రం ఏకాభిప్రాయానికి వచ్చినట్లు మీడియా కథనాల ద్వారా వెల్లడి అవుతోంది. సీఎం అభ్యర్థిగా ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ తనయుడు తేజస్వీ యాదవ్‌ను ఎంపిక చేసినట్లు ఆ కథనాల సారాంశం. దీనిపై ఈ రోజు అంటే.. గురువారం సాయంత్రం మహాగఠ్‌బంధన్‌లోని పార్టీలన్నీ కలిసి ప్రకటిస్తాయని సమాచారం. 243 స్థానాలున్న బిహార్ అసెంబ్లీకి రెండు దశల్లో.. అంటే నవంబర్ 6, 11 తేదీల్లో ఎన్నికల పోలింగ్ జరగనుంది. ఈ నేపథ్యంలో ఆర్జేడీ 143 మంది అభ్యర్థుల జాబితాను ప్రకటించింది. ఇక కాంగ్రెస్ పార్టీ 61 స్థానాల్లో అభ్యర్థులను నిలిపింది. సీపీఐ 9, సీపీఐ (ఎం) 4 స్థానాల్లో అభ్యర్థులను రంగంలోకి దింపింది. మరో ఎనిమిది స్థానాల్లో మాత్రం ఆర్జేడీ, కాంగ్రెస్, వామపక్ష పార్టీలు.. ఎవరికి వారు తమ అభ్యర్థులను రంగంలోకి దింపాయి. అంటే మహాగఠ్‌బంధన్‌లోని పార్టీల అభ్యర్థుల మధ్య తీవ్ర పోటీ నెలకొందని దీనిని బట్ట అర్థమవుతుంది. అయితే ఈ కూటమిలో చీలక ఏర్పడిందంటూ ఇప్పటికే పుకార్లు షికారు చేస్తున్నాయి. ఈ ఎన్నికల ఫలితాలు నవంబర్ 14వ తేదీన వెలువడనున్నాయి. దీంతో ఏ పార్టీకి ఓటరు పట్టం కట్టాడనేది ఆ రోజు సుస్పష్టం కానుంది.

## హైదరాబాద్‌లో భారీగా గంజాయి పట్టివేత

హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి

నగరంలోని బండ్లగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో భారీగా గంజాయి పట్టుబడింది. గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురు వ్యక్తులను సౌత్ ఈస్ట్ జోన్ టాస్క్ ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.2.7 కోట్ల విలువైన 908 కిలోల డ్రై గంజాయిని స్వాధీనం చేశారు. ఈ వ్యవహారంపై సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ చైతన్య కుమార్ మీడియాతో మాట్లాడుతూ వివరాలను వెల్లడించారు. గంజాయి సరఫరా చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠాను అరెస్టు చేశామన్నారు. బండ్లగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో మహారాష్ట్రకు గంజాయి తరలిస్తున్న నిందితుల్ని అరెస్టు చేశామని.. సుమారు 908 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నామని.. బహిరంగ మార్కెట్లో దీని ధర రెండు కోట్ల 70 లక్షల రూపాయలు ఉంటుందని తెలిపారు. ఒడిశాలోని మల్కన్‌గిరి ప్రాంతం నుంచి హైదరాబాద్ మీదుగా మహారాష్ట్ర నాసిక్ వైపు రవాణా చేస్తున్నట్లు గుర్తించామన్నారు. ఏ1 మొహమ్మద్ కలీం ఉద్దీన్ డ్రైవర్ / గంజాయి ట్రాన్స్‌పోర్టర్, ఏ2 షేక్ సోహైల్, ఏ3 మొహమ్మద్ అఫ్జల్ ఏ అబ్బులను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన రహమాన్, ఒడిస్సాకు చెందిన జిథు , శ్రీకాకుళానికి చెందిన సురేష్, మహారాష్ట్రకు చెందిన మహేష్ ప్రస్తుతం పరారీలో ఉన్నట్లు చెప్పారు. పరారీలో ఉన్న నిందితుల కోసం గాలింపు కొనసాగుతోందన్నారు. మహారాష్ట్రకు చెందిన మహేష్ గంజాయిని కొనుగోలు చేస్తున్నాడని తెలిపారు. ఒడిశా రాష్ట్రంలోని మల్కనగిరిలో మారుమూల అటవీ ప్రాంతంలో సురేష్ , జిథు గంజాయిని కొనుగోలు చేసి మహారాష్ట్రలో వివిధ ప్రాంతాలకు సరఫరా చేయడానికి ప్లాన్ చేశారని.. గంజాయి సరఫరాలో రెహమాన్ ప్రధాన రవాణాదారుడుగా వ్యవహరిస్తున్నాడని చెప్పారు. రిసీవర్ మహేష్ ఒడిశాలోని జిథు, సురేష్ వద్ద గంజాయి సేకరించారన్నారు. ఐషర్ డీసీఎం ట్రాన్స్‌పోర్ట్ వాహనం, నాలుగు మొబైల్ ఫోన్లను సీజ్ చేశామని చెప్పారు. గంజాయిని (28) హెచ్‌డీపీఈ సంచుల్లో నింపి, వాటిని జీడిపప్పు కింద దాచిపెట్టి టార్పాలిన్‌తో కప్పి రవాణా చేస్తున్నారని వివరించారు. హైదరాబాద్ మీదుగా నాసిక్, మహారాష్ట్ర వైపు రవాణా చేస్తున్నారన్నారు. పక్కా సమాచారంతో బండ్లగూడ వద్ద సోదాలు చేయగా గంజాయి పట్టుబడిందన్నారు. ప్రధాన నిందితుడు సురేష్ ఒక్క ట్రిప్‌కు రూ. 3 నుంచి 5 లక్షల పారితోషికం ఇస్తానని రెహమాన్‌కు ఆఫర్ చేశాడని.. అందుకే గంజాయి సరఫరాకి దాంతో రెహమాన్ అంగీకరించాడన్నారు. నిందితులంతా చిన్ననాటి స్నేహితులుగా దర్యాప్తులో తేలిందని సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ చైతన్య కుమార్ పేర్కొన్నారు.

## వర్ష ప్రభావ పరిస్థితులపై చంద్రబాబునాయుడు ఆరా

దుబాయయ్ నుంచి మరోమారు సీఎం టెలికాన్ఫరెన్స్

జిల్లాలకు రూ.1 కోటి చొప్పున అత్యవసర నిధుల మంజూరు

అమరావతి,

దుబాయ్ పర్యటనలో బిజీబిజీగా ఉన్నప్పటికీ రాష్ట్రంలో వర్ష ప్రభావ పరిస్థితులపై ఎప్పటికప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆరా తీస్తున్నారు తాజాగా రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలపై దుబాయ్ నుంచి అధికారులతో మరోమారు సీఎం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. తీసుకోవాల్సిన చర్యలపై మంత్రులు, సీఎస్, జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో మాట్లాడారు. వర్ష ప్రభావిత నెల్లూరు, ప్రకాశం, కడప, తిరుపతి, అన్నమయ్య జిల్లాల పరిస్థితిపై ఆయా జిల్లాల కలెక్టర్లు, ఆర్టీజీఎస్ అధికారులతో ముఖ్యమంత్రి చర్చించారు. నెల్లూరు, చిత్తూరు, ప్రకాశం జిల్లాలకు రూ.2 కోట్ల చొప్పున, మిగతా వర్ష ప్రభావిత జిల్లాలకు రూ.1 కోటి చొప్పున అత్యవసర నిధుల మంజూరుకు సీఎం ఆదేశాలు జారీ చేశారు. వర్ష ప్రభావిత ప్రాంతాల్లో ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను పంపాలని సూచనలు చేశారు. ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. రెవెన్యూ, డిజాస్టర్, పోలీస్, ఇరిగేషన్, మున్సిపల్, ఆర్ అండ్ బి విద్యుత్ శాఖలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు సీఎం. లోతట్టు ప్రాంతాల్లోని వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. రిలీఫ్ కేంద్రాల్లో బాధితులకు నాణ్యమైన ఆహారం, పిల్లలకు పాలు అందించాలని అధికారులకు సీఎం చంద్రబాబు సూచించారు. దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో ఇప్పటికే కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసినట్టు సీఎంకు కలెక్టర్లు వివరించారు. కాలువ, చెరువు గట్లకు గండ్లు పడకుండా బలహీనంగా ఉన్న చోట్ల పటిష్ట పరచాలని.. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగకుండా చూడాలని సీఎం ఆదేశించారు. పంట నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించారు.

# కార్తీక మాసం ప్రారంభం

## విశేషంగా శివకేశవ పూజలు

## వ్రతాలు నోములకు ప్రత్యేకం

**తిరుమల,**

హిందువులు ఎంతో పవిత్రంగా భావించే కార్తీకమాసం అక్టోబర్ 22 బుధవారం నుంచి ప్రారంభమైంది. ఈ మాసంలో వ్రతాలు, నోములకు ప్రత్యేక ప్రాధన్యం ఉంది. కార్తీక మాసం తదుపరి వచ్చే అమావాస్య వరకు అంటే నవంబర్ 20 వరకు కొనసాగుతుంది. శివకేశవులకు అత్యంత ప్రీతి పాత్రంగా ఈ మాసాన్ని చెబుతారు. ఎంతో పవిత్రమైన కార్తీకమాసంలో పండుగులకు కూడా విశేష స్థానం ఉంది. కార్తీకమాసంలో సూర్యోదయానికి ముందే నదీస్నానం చేసి శివకేశవ పూజలు చేస్తారు. ఈ మాసంలో శివుడికి దీపారాధన చేసి పూజలు చేసిన వారికి విశేషమైన పుణ్యం లభిస్తుందిని.. తద్వారా ఈతి బాధలు తొలగిపోతాయని విశ్వాసం. అందుకే



చాలా మంది శివ భక్తులు సాయంత్రం వేళ గుడిలో దీపారాధన చేస్తారు. ఇలా చేయడం వల్ల జన్మజన్మల పాపాలు తొలగిపోతాయని పండితులు చెబుతున్నారు. కార్తీకమాసంలో పండుగల వివరాలు ఇలా ఉన్నాయి. అక్టోబర్25 శుక్రవారం నాగుల చవితితో పాటు ..మాసిక వినాయక చతుర్థి వ్రతం ఆచరిస్తారు. మరుసటి రోజును లాభ పంచమిగా ఆచరిస్తారు. ఇకపోతే అక్టోబర్27 న తొలి కార్తీక సోమవార , స్కంద షష్ఠి, ఛత్ పూజ నిర్వహిస్తారు. 29న బుధ అష్టమి వ్రతం, 30న గోపాష్టమి, మాసిక్ దుర్గా అష్టమిగా భావిస్తారు. 31న అక్షయ నవమి, జగద్ధాత్రి పూజ చేపడతారు. నవంబర్ 1శనివారం ప్రబోధిని ఏకాదశి, కంస వధ, భీష్మ పంచకంగా ఆచరిస్తారు.నవంబర్ 2 ఆదివారం తులసీ వివాహం, వైష్ణవ దేవుత్థాన ఏకాదశి, యోగేశ్వర ద్వాదశిగాను 3న కార్తీక సోమ ప్రదోష వ్రతం, వైకుంఠ ,విశ్వేశ్వర వ్రతం,చతుర్దశి పూజలు నిర్వహిస్తారు. నవంబర్4న మణికర్ణిక స్నానం, నవంబర్5 కార్తీక పూర్ణిమ,దేవ్ దీపావళి, భీష్మపంచకం ముగింపు, గురునానక్ జయంతి,పుష్కర స్నానం ఆచరిస్తారు. నవంబర్ 8 : సంకష్టహర చతుర్థి, సౌభాగ్య సుందరి తీజ్? నవంబర్ 10: కార్తీక సోమవారం కానుంది. 17న కార్తీక సోమవారం ప్రదోష వ్రతం చేపడతారు. నవంబర్ 20తో కార్తీక మాసం ముగుస్తుంది.

# హైదరాబాద్ అభివృద్ధికి చంద్రబాబుకు సంబంధమే లేదు

## ఏపీ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి

**అమరావతి,**

హైదరాబాద్‌ను అభివృద్ధి చేసింది ఏపీ సీఎం చంద్రబాబు కాదని, అది ఆయన భ్రమేనని ఏపీ మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి అన్నారు. 20 ఏళ్లపాటు హైదరాబాద్‌తో చంద్రబాబుకు సంబంధమే లేదని విమర్శించారు. హైటెక్ సిటీకి నాటి ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్ శంకుస్థాపన చేయగా హైటెక్ సిటీ అభివృద్ధి తన వల్లేనంటూ బీరాలు పలుకుతున్నారని పేర్కొన్నారు. తాడేపల్లి నివాసంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కూటమి పాలన, చంద్రబాబు వ్యవహారశైలీపై విరుచుకుపడ్డారు. 2003-04లో వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాం నుంచే హైదరాబాద్‌లో నిజమైన అభివృద్ధి మొదలైందని పేర్కొన్నారు. కేసీఆర్ రెండుసార్లు ముఖ్యమంత్రిగా



పనిచేయడంతో హైదరాబాద్ నగరం శరవేగంగా అభివృద్ధి చెందిందని ప్రశంసించారు. కానీ చంద్రబాబు నిజాలను ఎప్పుడు అంగీకరించరని తెలిపారు. ఏపీ ఉద్యోగులకు బాబు అరచేతిలో వైకుంఠం చూపిస్తున్నారని ఎద్దేవా చేశారు. ఎన్నికలయ్యాక, ఉద్యోగులకు మెరుగైన పీఆర్సీ, ఐఆర్ గురించి, అనేక వాగ్దానాలు చేశారని గుర్తు చేశారు. ఉద్యోగులకు జీపీఎస్ లేదు. ఓపీఎస్ లేదని, ఉద్యోగులను మోసం చేసి వికృత ఆనందం పొందుతున్నారని ఆరోపించారు. ప్రతినెలా ఒకటో తేదీన ఉద్యోగులకు జీతాలు రావడం లేదని పేర్కొన్నారు. వైసీపీ హయాంలో ఉద్యోగులకు 11 డీఏలు ఇచ్చిన ఘనత తమదేననని అన్నారు.

# శ్రీవారికి దర్శనానికి 18 గంటలు



**తిరుమల**

భక్తగ్రేసరుడు వేంకటేశ్వరస్వామి కొలువుదీరిన తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతుంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారి దర్శనానికి 21 కంపార్టుమెంట్లలో వేచియున్నారు. టోకెన్లు లేని భక్తులకు 18 గంటల్లో సర్వదర్శనం అవుతుందని టీటీడీ అధదికారులు వివరించారు. నిన్న స్వామివారిని 73,853 మంది భక్తులు దర్శించుకోగా 22,551 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించుకున్న కానుకల వల్ల హుండీకి రూ. 3.47 కోట్లు ఆదాయం వచ్చిందన్నారు.

# డీజీపీ కార్యాలయం వద్ద ఉద్రిక్తత

**హైదరాబాద్,**

గోరక్ష సభ్యుడు సోనూసింగ్‌పై బుధవారం జరిగిన కాల్పులను నిరసిస్తూ బీజేపీ కార్యకర్తలు ఆందోళనకు పిలుపునిచ్చారు. దీంతో డీజీపీ ఆఫీసు వద్ద తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. జరిగిన సోనూ సింగ్ పై కాల్పులను నిరసిస్తూ ధర్నాకు దిగారు. పోలీసులు వారిని అడ్డుకోవడంతో అక్కడ టెన్షన్ వాతావరణం నెలకొంది. పలువురిని అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ లకు తరలిస్తున్నారు. దశలవారీగా వస్తున్న బీజేపీ సభ్యులను అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్లకు తరలించారు. డీజీపీ ఆఫీసులు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామ్ చందర్‌రావు చేరుకున్నారు. గోరక్షకు కాల్పుల అంశంపై డీజీపీకి మెమొరాండం ఇచ్చారు. అటు కార్యాలయం వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. రవీంద్ర భారతి, అసెంబ్లీ ఏరియాల్లో భారీగా పోలీసులు మోహరించారు.

# చిత్తశుద్ధితోనే గాజాలో శాంతి

## పరస్పర విశ్వాసం కూడా ముఖ్యం

**గాజా,**

కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి వచ్చి పది రోజులు గడిచినా తమ జీవితాల్లో చెప్పుకోదగ్గ మార్పులేమీ కనిపించడం లేదని అటు పాలస్తీనియన్లు, ఇటు ఇజ్రాయిల్స్ వాపోతున్నారు. ఇజ్రాయిల్ బలగాలు చెదురుమదురుగా కాల్పులు జరుపుతునే వున్నాయని, ఆహార ట్రక్కులు రాకుండా అడ్డుకుంటునే వున్నాయని, దాంతో తమకు పాట్లు తప్పడం లేదని వారు పేర్కొం టున్నారు. గాజాలోకి ప్రవేశించేందుకు ఆరు వేలకు పైగా ట్రక్కులు వేచి వున్నాయని యుఎన్‌ఆర్‌డబ్ల్యుఎ తెలిపింది. ఇదిలావుండగా, దాడుల సమయంలో శిథిలాల గుట్టల కింద చిక్కుకునిపోయి మరణించిన తమ వారి మృతదేహాలను వెలికి తీయడం రోజురోజుకు సవాలుగా మారుతోంది. ఇంకా వేలాది మృతదేహాలు అక్కడే వున్నాయని గాజా పౌర రక్షణ దళ సభ్యులు తెలిపారు. పరిమితమైన పరికరాలు వుండడంతో పని సాగడం లేదని చెప్పారు. హమాస్ తన వద్ద గల మరో ఇద్దరు బందీల మృతదేహాలను ఇజ్రాయిల్‌కు గత రాత్రి అప్పగించింది. వీరిలో ఒకరు సైనికుడు కాగా, మరొకరు సామాన్య పౌరుడు. మరోవైపు ఇజ్రాయిల్ కూడా మరో



30మంది పాలస్తీనియన్ల మృతదేహాలను అప్పగించింది. వారి శరీరాలపై వేధించిన, కొట్టిన గుర్తులు కనిపిస్తున్నాయని గాజా ఆరోగ్యశాఖ వర్గాలు తెలిపాయి. కళ్లకు గంతలు కట్టేసి, చేతులకు సంకెళ్లు వేసి కూడా వున్నాయని పేర్కొన్నారు. గాజాలో టుఫా ప్రాంతంలో ఇజ్రాయిల్ బలగాలు జరిపిన కాల్పుల్లో ఒకరు మరణించారు. ఇదిలావుంటే కాల్పుల విరమణ ఒప్పందాన్ని సజావుగా అమలు చేయడం అంత సులభం కాదని అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్ వ్యాఖ్యానించారు. ఈ ఒప్పందాన్ని ఇజ్రాయిల్ నిలబెట్టుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. హమాస్ ఆయుధాలన్నింటినీ అప్పగించాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరించారు. ఇకపోతే ఇజ్రాయెల్‌పై హమాస్ చేసిన దాడి, నాజీ పాలన తర్వాత జరిగిన అతి పెద్ద మానవ ఊచకోతగా చూడాలి. ఈ దాడి ప్రధానంగా జరిగింది మిలిటరీ మీద కాదు. ఐక్యరాజ్యసమితి నివేదిక ప్రకారం చనిపోయిన వారిలో సుమారు 850మంది పౌరులు ఉండగా 350మంది మిలిటరీ పోలీసులు ఉన్నారు. ఈ దాడిలో సేఫ్ హౌస్‌లో దాక్కోడానికి ప్రయత్నించిన సాధారణ పౌరులను, వారు పిల్లలా, వృద్ధులా అన్నదానితో సంబంధం లేకుండా మంటల్లో తగలబెట్టారని ఐక్యరాజ్యసమితి నిర్ధారించింది. లూటీలు జరిగాయని, తలలు నరికివేయడం కూడా జరిగిందని ఆ నివేదిక తేల్చిచెప్పింది. అంతేగాక సెక్సువల్ వయెలెన్స్ మీద ఐరాస సెక్రెటరీ జనరల్ జరిపిన ప్రత్యేక పరిశోధనలో కిబ్బుట్జ్ ప్రాంతంలో రేప్‌లు, గ్యాంగ్ రేప్‌లు జరిగాయని తేలింది. ఎన్నోచోట్ల స్త్రీల అర్ధనగ్న, నగ్న దేహాలు పడివున్నాయని, మర్మాంగాల ఛేదనం జరిగిందని ఆ ఐరాస బృందం కనుగొన్నది. ఈ బృందం సుమారు 5000 ఫొటోలు, 50 గంటల నిడివి ఉన్న ట్రాఫిక్ కెమెరాలతో సహా అన్ని రకాల ఆడియో, వీడియో ఫైళ్లనూ పరిశీలించి, ప్రత్యక్ష సాక్షులను విచారించి ఈ నివేదికను రూపొందించింది. మొత్తంగా ఇప్పుడు ట్రంప్ ఆదేశాలతో శాంతి ఒప్పందం కుదిరినా హమాస్ దీనికి ఎంతవరకు కట్టుబడి ఉంటుందన్నది అనుమానమే.

# రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి చరమగీతం పడేనా

## రష్యాపై ఒత్తిడి పెంచే యత్నంలో ట్రంప్

## చమురు సంస్థలపై నిషేధంతో చర్యలు

**వాషింగ్టన్,**

:రష్యా అధ్యక్షుడు పుతిన్ , ట్రంప్‌ల భేటీ వాయిదా పడిన నేపథ్యంలో అనేక వార్తలు ప్రచారంలోకి వస్తున్నాయి. అలాగే రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ముగించే విషయంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా తాజాగా రష్యాకు చెందిన రెండు అతిపెద్ద చమురు సంస్థలపై ఆయన ఆంక్షలు విధించారు. రష్యాపై ఒత్తిడి పెంచడమే లక్ష్యంగా పావులు కదుపుతున్నారు. యూఎస్ ట్రెజరీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫారిన్ అసెట్స్ కంట్రోల్ ఆఫీస్ ఓ ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించింది. ఉక్రెయిన్‌తో యుద్ధం ముగించడమే కాకుండా శాంతి పక్రియపై



రష్యాకు నిబద్ధత లేకపోవడం వల్లే ఈ ఆంక్షలు విధించినట్లు తెలిపింది. తమ నిర్ణయం ఆ దేశ చమురు రంగంపై ఒత్తిడి పెంచుతుందని, దీనివల్ల రష్యా ఆర్థికవ్యవస్థపై కూడా ప్రభావం పడుతుందని వ్యాఖ్యానించింది. శాశ్వత శాంతి పూర్తిగా రష్యా చర్చలు జరపడానికి రావడంపై ఆధారపడి ఉందని వెల్లడించింది. ట్రంప్ మాట్లాడుతూ.. ఇవి అపారమైన ఆంక్షలన్నారు. అయితే, ఇవి ఎక్కువకాలం ఉండవని, ఈలోపు యుద్ధ సమస్య పరిష్కారమవుతుందని వ్యాఖ్యానించారు. ఈ చర్యకు ఇదే సరైన సమయం అని తాను భావిస్తున్నట్లు కూడా తెలిపారు. ఈ ఆంక్షలతో యుద్ధం కారణంగా జరుగుతున్న హత్యలను ఆపడంతో పాటు తక్షణ కాల్పుల విరమణకు సమయం ఆసన్నమైందని ట్రెజరీ కార్యదర్శి స్కాట్ బెసెంట్ పేర్కొన్నారు. అమెరికా మిత్ర దేశాలు తమతో కలవాలని, ఆంక్షలకు కట్టుబడి ఉండాలని పిలుపునిచ్చారు. ట్రెజరీ ప్రకారం.. ఈ చర్య రష్యా తన సైనిక కార్యకలాపాలకు నిధులు సమకూర్చే సామర్థ్యం తగ్గుతుంది. దీంతో పాటు దాని చమురు ఆధారిత ఆర్థిక వ్యవస్థ బలహీన పడుతుంది. ఇక, ఈయూ కూడా రష్యాపై ఒత్తిడి తెచ్చేందుకు గాను 19 ఆంక్షల ప్యాకేజీకి ఆమోదం తెలిపింది. రష్యా ఎల్‌ఎన్‌జీపై నిషేధం విధించడం కూడా ఇందులో ఉంది. ఇదిలాఉండగా.. రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు చేసే విషయంపై ట్రంప్ మరోసారి మాట్లాడారు. ఈ ఏడాది చివరి నాటికి భారత్ రష్యా నుంచి చమురు దిగుమతులను భారీగా తగ్గిస్తుందన్నారు. తగ్గింపు క్రమంగా ఉంటుందని, ఇది మంచి చర్య అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ మేరకు భారత్ నుంచి తనకు హామీ వచ్చిందని కూడా తెలిపారు. ఈ విషయంపై ట్రంప్ గత కొన్ని రోజులుగా సొంత ప్రకటనలు చేస్తూ వస్తుండగా.. భారత్ వాటిని ఖండిస్తుంది. అయినా, అగ్రరాజ్యం అధ్యక్షుడు మళ్లీ మళ్లీ ఇలాంటి ప్రకటనలే చేయడం గమనార్హం. అయితే ట్రంప్ ఎత్తుగడలు ఇతరదేశాలకు కంటగింపుగా మారాయి. ఎప్పుడు ఎలా వ్యవహరిస్తారో తెలియని దుస్థితి నెలకొంది.

# దరఖాస్తులు తగ్గినా.. ఆదాయం తగ్గలే

## నల్గొండ జిల్లాలో 154 మద్యం షాపులకు 4905 దరఖాస్తులు

## గతంలో 151 దుకాణాలకు 7057 దరఖాస్తులు

## 27న లక్ష్మీ గార్డెన్ లో లక్కీడ్రా

**అక్షరకలం నల్గొండ**

ఎక్సైజ్ టెండర్ల ప్రక్రియ గురువారం ముగిసింది. జిల్లాలో 2023-25 మద్యం పాలసీతో పోల్చితే ఈ సారి 2025-27కి సంబంధించి దరఖాస్తులు తక్కువగా వచ్చాయి. అయినప్పటికీ ప్రభుత్వ ఆదాయానికి గండిపడలేదు. గతంలో దరఖాస్తు ఫీజు రూ.2లక్షలు ఉండగా.. ఈ సారి రూ.3లక్షలకు పెంచారు. దీంతో టెండర్దారులు అంతగా ఆసక్తి కనబర్చినట్లు స్పష్టమవుతుంది. గురువారం రాత్రి వరకు ఈ ప్రక్రియ కొనసాగింది. ఎక్సైజ్ ఆదాయం పెంచేందుకు ఆ శాఖ అధికారులు తీవ్రంగా శ్రమించారు. గతంలో మద్యం షాపులకు టెండర్లు వేసిన వారిని, ప్రస్తుతం షాపులు నడుపుతున్న వారిని రండి బాబు.. రండి... దరఖాస్తు చేసుకోండని కోరడం గమనార్హం. ఈనెల 18వ తేదీన గడువు ముగిసినప్పటికీ



సెలవుల కారణంగా రాష్ట్ర ప్రభుత్వం 23 సాయంత్రం 5 గంటల వరకు గడువును పెంచింది.కాగా సాయంత్రం ఐదు గంటలకే గడువు ముగియాల్సి ఉండగా ఆలస్యమైనా స్వీకరించేలా కార్యాలయంలోనే ఎక్సైజ్ సిబ్బంది వేచి చూశారు. అయితే దరఖాస్తుల స్వీకరణ మొదలైనప్పటి నుంచి మందకొడిగా సాగిన ప్రక్రియ చివరి రెండు రోజుల్లో పుంజుకుంది. దీంతో ఆ శాఖ అధికారులు, ఉద్యోగులు ఊపిరి పీల్చుకున్నట్లుగా కనిపించింది. ఈ నెల 27న నల్లగొండ జిల్లా కేంద్రంలోని లక్ష్మీ గార్డెన్ లో జిల్లా కలెక్టర్ త్రిపాఠి ఆధ్వర్యంలో షాపుల కేటాయింపునకు లక్కీ డ్రా నిర్వహించనున్నారు. ఇందులో అదృష్టం ఎవరిని వరించనుందనే దానిపై సర్వత్ర ఆసక్తి నెలకొంది.

### ఆదాయం తగ్గలే..

మద్యం షాపులకు గతంతో పోల్చితే దరఖాస్తులు తగ్గినప్పటికీ ప్రభుత్వ ఆదాయంలో మాత్రం అంతగా మార్పేమి రాలేదు. జిల్లాలో 151 షాపులకు గాను 2023లో 7057 దరఖాస్తులు వచ్చాయి. వీటి ద్వారా ప్రభుత్వానికి రూ.141 కోట్ల 14 ఆదాయం సమకూరింది. అయితే ఈసారి దరఖాస్తు ఫీజు రూ.3లక్ష లకు పెంచింది. దీంతో దరఖాస్తులు వచ్చాయి. 2025 లో మద్యం టెండర్లకు 4905 దరఖాస్తులు రాగా 147 కోట్ల 15 లక్షల ఆదాయం వచ్చింది. గతం తో పోల్చితే 6 కోట్ల 1 లక్ష వరకు అదనపు ఆదాయం చేకూరింది. ప్రభుత్వం గడువు పెంచడంతో దరఖాస్తులు తగ్గిన ఆదాయం పెరిగింది.

### 27న తేలనున్న అదృష్టం..

దరఖాస్తుదారుల్లో అదృష్టం ఎవరిని వరించనుందో ఈనెల 27న తేలనుంది. అనంతరం షాపులు దక్కించుకున్న వారు 1/6వ వంతు ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఏడాది 3 స్లాబుల్లో ఫీజు చెల్లించాలి. జిల్లాలో రూ.65 లక్షలు, రూ.55 లక్షలు, రూ.50 లక్షల స్లాబులుగా ఫీజు నిర్ణయించారు.

అక్షరకలం
తెలుగు దినపత్రిక

సంపాదకీయం...

# కాలుష్యం గురించి పాలకులు పట్టించుకోవడం లేదు.

పరిశ్రమలు పెట్టుబడుల వేటలో కాలుష్యం గురించి పాలకులు పట్టించుకోవడం లేదు. పెట్టుబడులు వస్తున్నాయని, ఉపాధి,ఉద్యోగాలు దక్కుతున్నాయని ఊదరగొడుతున్నారు. దీపావళి టపాసులకే వాయు కాలుష్యం తట్టుకోలేక పోతున్నాం. ఈక్రమంలో కాలుష్యకారక పరిశ్రమల స్థాపనలో ఆలోచన చేయాల్సి ఉంది. రాష్ట్రంలో తీరప్రాంతం, సెజ్‌లో ఏర్పాటైన ఔషధ, రసాయన పరిశ్రమలతో ఆ పరిసర ప్రాంత ప్రజలకు పీల్చే గాలి, తాగే నీరు ప్రమాదకరంగా మారాయి. ప్రాణాంతక వ్యాధులకు అవి కేంద్రంగా వున్నాయి. పర్యావరణ పరిరక్షణ బాధ్యతను అటు ప్రభుత్వమూ, ఇటు పరిశ్రమాధిపతులు పూర్తిగా వదిలేశారు. కోట్ల విలువైన రాయితీలు, సదుపాయాలు కల్పించి పరిశ్రమాధిపతులకు లాభాలు సమ కూర్చడం పైనే ప్రభుత్వాలు శ్రద్ధ చూపుతున్నాయి. ఆ పరిశ్రమలకు భూములిచ్చిన రైతులు, ఉపాధి కోల్పోయిన పేదలు, వృత్తిదారులను విస్మరించాయి. ఇప్పటికే ఉప్పాడ కార్మికులు సముద్రంలో కలుస్తున్న కాలుష్యాన్ని నిలిపివేయాలంటూ పాలకులను నిలదీసారు. చేపలవేట సాగడం లేదని అంటున్నారు. దీనిపై డిప్యూటి సిఎం పవన్ కళ్యాణం చొరవ తీసుకుని సమస్య పరిస్కారం కోసం ప్రయత్నిస్తున్నారు. ఇప్పుడు తాజాగా అనకాపల్లి సెజ్ ఏర్పాటుపై మత్స్యకారులు ఆందోళనకు దిగారు. ప్రభుత్వం ఉంది ప్రజల ప్రాణాలను కాపాడడానికే గానీ తీయడానికి కాదని వారు అంటున్నారు. బల్క్ డ్రగ్ పార్క్‌ను వ్యతిరేకిస్తూ మత్స్యకారులు చేపట్టిన దీక్ష 39వ రోజుకి చేరుకుంది. నిజానికి ప్రభుత్వాలు ప్రజల ప్రాణాలను కాపాడాలి అంతేగానీ తీయకూడదు. ఎన్నికలకు ముందు బల్క్ డ్రగ్ పార్క్‌తో క్యాన్సర్, పిల్లలకు వైకల్యం వస్తుందని మంత్రి అనిత చెప్పారు. ఇప్పుడేమో ఇలా చేస్తున్నారు. అనితకు ఇది న్యాయమా?. చేతకాకపోతే రాజకీయాల నుంచి తప్పుకోండి..అంటూ మత్స్యకారులు డిమాండ్ చేస్తున్న తీరును ఆలోచించాలి. మా జీవితాలు నాశనం అవుతున్నాయి. ప్రాణాలు పోయినా ఫర్వాలేదు. కానీ, బల్క్ డ్రగ్ పార్క్‌ను కట్టనివ్వం అన్న మాటకు కట్టుబడి దీక్షలు చేస్తున్నారు. రాష్ట్రంలో లక్షల కోట్ల పెట్టుబడులతో వచ్చే పరిశ్రమల్లో వేలాది మందికి ఉపాధి కలగనుందని ప్రభుత్వం చెబుతున్న మాటలను ప్రజలు విశ్వసించడం లేదనడానికి ఇదో నిదర్శనం మాత్రమే. పైగా ఆ పరిశ్రమల ఏర్పాటు కోసం జరిగే ప్రజాభిప్రాయ సేకరణను రద్దు చేయాలన్న డిమాండ్‌పై ఏకమవడం నూతన పరిణామం. ఉపాధి పేరుతో మోసగించి కార్పొరేట్లు, పెట్టుబడిదారులకు లబ్ధి చేకూర్చాలన్న ప్రభుత్వ పెద్దల ఆరాటానికి ప్రజా పోరాటాలు బ్రేకులు వేస్తున్నాయి. పోలీసు బలగాలతో ప్రజలను భయపెట్టేందుకు యత్నించినా చాలా ప్రాంతాల్లో తిరగబడుతున్నారు.ప్రజల ఆగ్రహం ముందు అణచివేత, నిర్బంధ చర్యలు సాగవని జన సమూహాలు పాలకులను హెచ్చరిస్తున్నాయి. బల్క్ డ్రగ్ ఒక్కటే కాదు ఎక్కడ భూ సేకరణ జరిగినా రైతులు తిరగబడుతున్నారు. పరిశ్రమలకు ఒకనాడు భూములిచ్చిన రైతులు ఇపుడు అడుక్కు తింటున్నారు. భూములిచ్చి, ఉపాధి లేక బతుకు తెరువుకు ఊరూవాడా తిరుగుతున్న రైతులు, పేదలు, మత్స్యకారులు, చేతివృత్తిదారులకు అనేక చేదు



అనుభవాలున్నాయి. తెలంగాణ, ఆంధ్రా అన్న తేడా లేకుండా పరిశ్రముల, రోడ్లు, ప్రాజెక్టులకు భూములు లాక్కోవడం వారిని వదిలివేయడం ప్రభుత్వాలకు అలవాటుగా మారింది. పోలవం బాధితులు, మల్లన్నసాగర్ బాధితులు ఇదే కోవలోకి వస్తారు. ఈ క్రమంలోనే ప్రైవేటు పరిశ్రమల ఏర్పాటుకు వ్యతిరేకంగా నిరసన రూపంలో ప్రజాభిప్రాయ సేకరణలో తెలియ జేస్తున్నారు. అనకాపల్లి జిల్లాలోని సక్కపల్లి మండలంలో బల్క్ డ్రగ్ పార్కు వద్దంటే వద్దని ప్రజలు భీష్మించుకున్నారు. అయినా ప్రభుత్వం పెడచెవిన పెడుతోంది. ప్రజలు కాలుష్య నియంత్రణ మండలి ఏర్పాటు చేసిన ప్రజాభిప్రాయ సేకరణ సదస్సులో తమ అభ్యంతరం తెలిపారు. రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత ప్రాతినిధ్యం వహిస్తున్న పాయకరావుపేట నియోజకవర్గంలోని నక్కపల్లి ప్రాంతంలో ఏర్పాటు కానున్న ఈ పరిశ్రమలను ప్రజలు వ్యతిరేకిస్తుంటే, పెట్టి తీరాలని ప్రభుత్వం మొండిగా వుంది. ఆ ఆలోచన విరమించుకొనేలా ఒత్తిడి పెంచాలని నిర్వాసితులు, బాధిత మత్స్యకారులు ఆందోళనలు కొనసాగిస్తున్నారు. కొద్ది రోజుల క్రితం ఆ ప్రాంత పర్యటనకు వెళ్లిన మంత్రి వాహనం ముందు తాటిచెట్టు అడ్డంపెట్టి మరీ పోరాడారు. ప్రజాపోరాటంతో తాత్కాలికంగా పనులు నిలిపివేస్తున్నట్టు మంత్రి ప్రకటించాల్సి వచ్చింది. ఇదే క్రమంలో ఆదానీకి చెందిన గంగవరం పోర్టు ధూళి, దుమ్ముతో భరించలేని కాలుష్యంతో బాధపడుతున్న ప్రజల్లో అంబూజా సిమెంట్ పరిశ్రమ ఏర్పాటుపై ఆగ్రహం వెల్లువెత్తింది. గాలిని, నీటిని కలుషితం చేస్తున్నా పట్టించుకోవడం మానేశాయి. చివరకు కాలుష్య నియంత్రణ మండలి, ఫ్యాక్టరీల అధికారుల తనిఖీలపై ఆంక్షలు విధించి విచ్చలవిడితనానికి అవకాశం కల్పించాయి. విశాఖ నగర వాసుల ఆరోగ్యాలను కాలుష్యంతో దెబ్బ తీస్తున్న విశాఖపట్నం పోర్టు ట్రస్ట్, గంగవరం పోర్టును పర్యావరణ ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవడం లేదు. ఎన్టీపిసి కాలుష్యంతో మూల స్వయంవరం, సోమినాయుడుపాలెం ప్రజలు తీవ్ర అనారోగ్యాలకు గురవుతున్నారు. పరవాడ ఫార్మా సిటీకి అనుకొనివున్న గ్రామాలు వాయు కాలుష్యంతో తల్లడిల్లుతున్నాయి. పరిశ్రమలు వ్యర్థ రసాయన జలాలను శుద్ధి చేయకుండా చెరువుల్లోకి విడిచిపెడుతున్నాయి. ర్యాంకీ యాజమాన్యానికి కాలుష్య నియంత్రణ అధికారులు నోటీసులు జారీ చేసినా? చర్యలేమీ తీసుకోలేదు. ముత్యాలమ్మపాలెం ఉప్పుటేరు కాలుష్యమయమైంది. అచ్యుతాపురం సెజ్ లోని వ్యర్థాలను శుద్ధి చేయకుండా పూడిమడక వాగులోకి వదిలేయడంతో చేపలు చనిపోయి మత్స్యకారులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. విచారణలో వ్యర్థాలను శుద్ధి చేయడంలేదని తేలడంతో నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకున్నారు. ప్రజలకు హానికరంగా నిబంధనలు సవరించి కార్పొరేట్లకు ప్రయోజనం చేకూర్చడానికి సిద్ధపడింది. ప్రజల ఆరోగ్యాలు దెబ్బ తినకుండా వుండాలంటే పర్యావరణ ప్రమాణాలను పరిశ్రమలు పాటించేలా నిబంధనలు కఠినతరం చేయాలి. అలాగే కాలుష్యకారక పరిశ్రమలతో పర్యావరణాన్ని దెబ్బతీసే పరిశ్రమలను దూరం పెట్టడమే మంచిది.

## 24న ఇబ్రహీంపట్నం మండలంలో క్షేత్రస్థాయి సందర్శనలు

**విజయవాడ,**

జిల్లాలోని ఆకాంక్షిత బ్లాక్ కార్యక్రమం (ఏబీపీ) కింద ఉన్న పెనుగంచిప్రోలు, ఇబ్రహీంపట్నం మండలాల్లో పర్యటించి.. లక్ష్యాల సాధనలో పురోగతిని స్వయంగా తెలుసుకునేందుకు కేంద్ర ప్రభారీ అధికారి / నేషనల్ వాటర్ మిషన్ డైరెక్టర్ నేలపట్ల అశోక్‌బాబు ఈ నెల 23వ తేదీ నుంచి మూడు రోజుల పాటు జిల్లాలో పర్యటించనున్నారు. నెల 23వ తేదీన పెనుగంచిప్రోలు మండలంలో పెనుగంచిప్రోలుతో పాటు ముండ్లపాడు గ్రామాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పర్యటించనుండగా.. 24వ తేదీన ఇబ్రహీంపట్నం మండలంలో ఇబ్రహీంపట్నంతో పాటు కాచవరం, కేతనకొండ, కొండపల్లి, జూపూడి, గుంటుపల్లి గ్రామాల్లో రోజంతా క్షేత్రస్థాయిలో పర్యటిస్తారు. ఈ నెల 25న జిల్లా కలెక్టరేట్‌లో సమన్వయ శాఖల అధికారులతో సమావేశం నిర్వహిస్తారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా ఆయుష్మాన్ ఆరోగ్యమందిర్‌లు, అంగన్వాడీ కేంద్రాలు, చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాలు (ఎస్‌డబ్ల్యూపీసీ), ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, రైతు సేవా కేంద్రాలు (ఆర్ఎస్‌కే), ఉన్నత పాఠశాలలను సందర్శిస్తారు. అదేవిధంగా మండలస్థాయి అధికారులతో సమావేశాలు నిర్వహిస్తారు. ఆరోగ్యం, పోషణ, విద్య, వ్యవసాయం, మౌలిక వసతులు తదితర అంశాలకు సంబంధించిన కీలక సామాజిక, ఆర్థిక సూచికల్లో పురోగతిపై చర్చించి అధికారులకు దిశానిర్దేశర చేస్తారు. పర్యటనలో భాగంగా ఆయా గ్రామాల ప్రజలతోనూ ప్రభారీ అధికారి అశోక్‌బాబు మమేకమవుతారు.

## ప్రజాసమస్యల పరిష్కరించాలి

**విజయవాడ**

:ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. పి జి ఆర్ ఎస్, అందరికీ ఇళ్లు అంశాలపై భూ పరిపాలన శాఖ ప్రధాన కమిషనర్ జి. జయలక్ష్మి బుధవారం నిర్వహించిన దృశ్య మాధ్యమ సమావేశంలో సంయుక్త కలెక్టర్ ఇళక్కియ తో కలసి ఆయన పాల్గొన్నారు. సమావేశం అనంతరం కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ మాట్లాడుతూ... పిజిఆర్ఎస్ అర్జీలలో అపరిష్కృతం గా ఉన్నవాటి వివరాలు శాఖల వారీగా, మండలాల వారీగా తెలియజేయాలన్నారు. అర్జీల పరిష్కార విషయంలో అలసత్వం చూపరాదని, త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. భూ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించ ాలన్నారు. కీలక ప్రగతి సూచికల్లో (కె పి ఐ) ఐసిడిఎస్, పోలీస్ శాఖల అంశాలలో పురోగతి ఉండాలన్నారు. ఈ క్రాప్ నమోదు ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ లక్ష్మీ నరసింహం, కె ఆర్ ఆర్ సి ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ ఏ.పోసి బాబు, జిల్లా వ్యవసాయ అధికారి విజయ కుమారి, గ్రామ,వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జి. జ్యోతి, డి ఎస్ ఎల్ ఓ వై.మోహన్ రావు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

## మనస్తాపంతో భార్య, బాధతో భర్త ఆత్మహత్య

**హైదరాబాద్,**

ఆరేళ్లుగా ప్రేమించి పెద్దలను ఒప్పించి మరీ పెళ్లి చేసుకున్నారు. కానీ చిన్న చిన్న విషయాలకే మనస్తాపానికి గురై ఇద్దరు ఆత్మహత్యకు పాల్పడ్డారు. దసరా రోజు భర్త తిట్టాడనే మనస్తాపంతో పెళ్లయిన వారం రోజులకే క్షణికావేశంలో భార్య బలవన్మరణానికి పాల్పడింది. తన వల్లే తన అర్ధాంగి చనిపోయిందనే మనస్తాపంతో దీపావళి నాడు భర్త కూడా తనువు చాలించాడు. అలా సక్సెస్ అయ్యిందనుకున్న వారి లవ్‌స్టోరీ.. పెళ్లయిన నెలలోపే విషాదాంతంగా మారింది. వివరాల్లోకి వెళ్తే.. జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం ఎర్దండి గ్రామంలోని వడ్డెర కాలనీలో ఎదురెదురు ఇండ్లలో ఉండే సంతోష్, గంగోత్రి ఆరేళ్లుగా ప్రేమించుకున్నారు. తమ ప్రేమను పెద్దలకు చెప్పి ఒప్పించి సెప్టెంబర్ 26న పెళ్లి కూడా చేసుకున్నారు. దసరా పండుగ కావడంతో ఈ నెల 2వ తేదీ న దంపతులిద్దరూ గంగోత్రి ఇంటికి వెళ్లారు. అక్కడ మాంసం కూరలో కారం ఎక్కువైందని గంగోత్రిని సంతోష్ మందలించాడు. దీంతో మనస్తాపం చెందిన గంగోత్రి.. అదే రోజు రాత్రి అత్తారింటికి వెళ్లాక దూలానికి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ప్రేమించి పెళ్లిచేసుకున్న అమ్మాయి తన కారణంగానే తనువు చాలించిందని సంతోష్ తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. మనసు బాగోలేకపోవడంతో దీపావళి పండక్కి ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో నివాసం ఉండే తన అక్క దగ్గరకు వెళ్లాడు. అక్కడే మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకున్నాడు. ఇలా భార్యాభర్తలిద్దరూ కూడా నెలలోపే మరణించడంతో ఆ గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది.

## ఐదేండ్లలో మెడికల్ కాలేజీ నిర్మాణం జరగలేదు

**అమరావతి,**

మెడికల్ కళాశాలల నిర్మాణం పీపీపీ మోడల్‌లోనే జరుగుతుందని మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. గత ఐదేళ్లలో జగన్ ప్రభుత్వం మెడికల్ కాలేజ్‌ల నిర్మాణం చేపట్టలేదని విమర్శించారు. ఐదు వేలకోట్లు పనులకు ఐదు వందలకోట్ల పనులు చేశారన్నారు. పులివెందులలో మాత్రమే జగన్.. మెడికల్ కళాశాలను పూర్తి చేశారని చెప్పుకొచ్చారు. కూటమి ప్రభుత్వంలో పది మెడికల్ కళాశాలలు పీపీపీ విధానంలో పూర్తి చేస్తామని ప్రకటించారు. జగన్ బెదిరింపులకు ఎవరూ తగ్గేది లేదన్నారు. ఆయన వచ్చి కట్టే వరకు విద్యార్థులు నష్టపోయారని.. అయినా జగన్ మళ్లీ అధికారంలోకి రావడం కల్ల అని అన్నారు. వైసీపీ వచ్చేది లేదు.. చచ్చేది లేదంటూ వ్యాఖ్యలు చేశారు. పది మెడికల్ కళాశాలు పూర్తి అయితే డెబ్బై శాతం పేద విద్యార్థులకు మేలు జరుగుతుందన్నారు. యాజమాన్య హక్కులు, నిర్వహణ మొత్తం ప్రభుత్వం చేతిలోనే ఉంటాయని వెల్లడించారు. గత ప్రభుత్వం నిర్వాకం వల్లే నేడు పీపీపీ విధానంలో తాము నిర్మిస్తున్నామని చెప్పారు. వైసీపీ ప్రభుత్వంలో నిర్మాణం చేయకుండా గాడిదలను కాశారా అంటూ ఫైర్ అయ్యారు. ఇంకా అబద్ధాలు, అసత్యాలతో ప్రజలను మోసం చేస్తున్నారన్నారని మంత్రి మండిపడ్డారు. ఉద్దానం విషయంలో కూడా రాద్ధాంతం చేస్తున్నారని.. ఇలా చేస్తే 11 సీట్లు కూడా ఈసారి రావన్నారు. ప్రజలు చిత్తుగా ఓడించారని జగన్ కక్ష కట్టారని ఆరోపించారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం జరగకుండా అడ్డు పడుతున్నారన్నారు. అన్ని విషయాలు ప్రజలు గమనిస్తున్నారని.. వాళ్లకి తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఎన్టీఆర్ వైద్య సేవలపై చర్చిస్తున్నామని.. అన్నీ సర్దుకుంటాయని మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు.

## తుని గురుకుల పాఠశాలలో దారుణం

**అమరావతి,**

బాలికకు మాయమాటలు చెప్పి పాఠశాల నుంచి బయటకు తీసుకెళ్లి ఓ కామాంధుడు అత్యాచారయత్నానికి పాల్పడిన ఘటన తుని బాలికల గురుకుల పాఠశాలలో చోటుచేస ుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. ఎనిమిదో తరగతి చదు వు తున్న మైనర్ బాలికకు మాయ మాటలు చెప్పి స్కూల్ నుంచి నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లిన నిందితుడు.. ఈ అఘాయిత్యానికి ఒడిగట్టాడు. విషయం తెలిసిన బాలిక బంధువులు తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నారాయణరావు అనే వ్యక్తి.. తరచూ గురుకుల పాఠశాలకు వెళ్లి బాలిక బంధువును అని చెప్పి ఆమెను తీసుకెళ్లేవాడని తెల ుస్తోంది. కూడా గురుకుల పాఠశాలకు వచ్చిన నారా యణ... బాలికను ఎవరూ లేని ప్రాంతానికి తీసుకెళ్లాడు. ఆపై బాలికపై అత్యాచారం చేసేందుకు యత్నించాడు. స్థానికులు గమనించి నిలదీయగా అక్కడి నుంచి పరారయ్యాడు నిందితుడు. విషయం తెలిసిన బాలిక తల్లిదండ్రులు గురుకుల పాఠశాల ముందు ఆందోళనకు దిగారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## వాయుగుండంపై ఏపీ సర్కారు అలర్ట్

**అమరావతి,**

బంగాళాఖాతంలోని తీవ్ర అల్పపీడనం రాబోయే 12 గంటల్లోపు వాయుగుండంగా బలపడనున్న నేపథ్యంలో ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తమైంది. ఉత్తర తమిళనాడు, పుదుచ్చేరి, దక్షిణకోస్తా తీరాల వైపు కదులుతూ ఆ తదుపరి 12 గంటల్లో మరింత బలపడే అవకాశం ఉంది. దీని ప్రభావంతో దక్షిణ కోస్తా, రాయలసీమలో అతిభారీ వర్షాల నేపథ్యంలో విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులతో హోం మంత్రి అనిత బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని.. అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు చేయరాదని సూచించారు. సహాయక చర్యలకు ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, పోలీస్, ఫైర్ సిబ్బంది సిద్ధంగా ఉండాలని హోంమంత్రి ఆదేశించారు. జిల్లాల్లో కంట్రోల్ రూమ్స్ 24/7 అలెర్ట్‌గా ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రాణనష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని.. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం లేకుండా చూడాలని స్పష్టం చేశారు. వాతావరణ పరిస్థితులపై ప్రజలకు ఎప్పటికప్పుడు హెచ్చరిక మెసేజ్లు పంపాలని అధికారులకు తెలియజేశారు. సహాయం కోసం 24 గంటలు అందు బాటులో ఉండే టోల్ ఫ్రీ నెంబర్లు 112, 1070, 1800425 0101 సంప్రదించాలన్నారు. ప్రజలు సురక్షితమైన భవనాల్లో ఉండాలని హోంమంత్రి అనిత వినతి చేశారు.

## ఏపీ అందుతున్న కేంద్ర సాయం

### లక్షా 80వేల కోట్ల పెట్టుబడితో గ్రీన్ హైడ్రోజన్ హబ్ పనులు

### బీజేపీ ఏపీ అధ్యక్షులు మాధవ్

**అమరావతి,**

): ఏపీకి కేంద్రం నుంచి లక్షన్నర కోట్ల సాయం అందిందని బీజేపీ ఏపీ అధ్యక్షులు మాధవ్ తెలిపారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. లక్షా 80వేల కోట్ల పెట్టుబడితో గ్రీన్ హైడ్రోజన్ హబ్ పనులు శరవేగంగా సాగుతున్నాయన్నారు. రూ.11,444 కోట్లతో విశాఖ స్టీల్ ప్లాంట్ అభివృద్ధికి నిధులు కేటాయించారని చెప్పారు. గూగుల్ డేటా సెంటర్ ద్వారా 15 బిలియన్ డాలర్ల ఒక లక్షా 25వేల కోట్లతో విశాఖకు రావడం డబుల్ ఇంజన్ గ్రోత్‌కు ఒక చిహ్నమని పేర్కొన్నారు. విశాఖను గ్లోబల్ గ్రోత్ సెంటర్‌గా మార్చేలా అనేక కంపెనీలు, ఐటీ సంస్థలు వస్తున్నాయని వెల్లడించారు మాధవ్. ప్రధాని మోడీ నేతృత్వంలో ఈ ప్రాజెక్టులన్నీ ముందుకు తీసుకురావడం, సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ ఆధ్వర్యంలో విశాఖలో గూగుల్ డేటా సెంటర్ రావడం వల్ల ఏపీకి ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు వచ్చిందని తెలిపారు. కర్ణాటక వంటి పక్క రాష్ట్రాలకు కంటగింపుగా మారిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాలు దగా కోరు రాజకీయాలు చేస్తూ.. వారి వైఫల్యాలను వారే బయట పెట్టుకుంటున్నారని విమర్శించారు. కర్ణాటకలో ఫెయిల్ గవర్నమెంట్ ఉంది కాబట్టే.. ఆ పార్టీ తరపున వారు ఆక్రోశం వెలిబుచ్చుతున్నారని వ్యాఖ్యలు చేశారు. మోడీ, చంద్రబాబులు అసాధ్యమైన అంశాన్ని సాధించి.. ప్రపంచ వ్యాప్తంగా ఏపీ గురించి చర్చించుకునేలా చేశారని ఏపీ బీజేపీ చీఫ్ తెలిపారు కృత్రిమ మేధస్సుతో అనేక ప్రయోగాలకు విశాఖ వేదిక కాబోతుందన్నారు. ఎనర్జీ సోర్స్ కింద సోలార్, విండ్, హై ఎనర్జీలను వాడేందుకు గ్రీన్ ఎనర్జీ తయారవుతుందన్నారు. టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాన్ ఫ్యాక్చరింగ్‌లో యువత ప్రతిభకు చైనా తర్వాత ఏపీకే అవకాశాలు ఉన్నాయని చెప్పుకొచ్చారు. అమెరికాలో ఆంక్షలు ఉండటంతో భారత దేశంలోనే వీరంతా ఉండబోతున్నారని అన్నారు. ఐదేళ్లల్లో ఐదు లక్షల ఉద్యోగాలు యువతకు వస్తాయని ప్రకటించారు. నరేంద్ర మోడీ, రాష్ట్ర ప్రభుత్వం సారథ్యంలో ఏపీకి పెద్ద ఎత్తున పెట్టుబడులు వస్తున్నాయని తెలిపారు. వైజాగ్ – చెన్నై కారిడార్, బెంగుళూరు – చెన్నై కారిడార్, రాయలసీమ వైపు మరో కారిడార్‌లు రాబోతున్నాయని మాధవ్ అన్నారు. డిపెన్స్ క్రస్టల్స్, అతిపెద్ద రిఫైనరీ, జాతీయ రహదారుల కనెక్టివిటీ అన్ని ప్రాంతాలకు పెరగడం ద్వారా అభివృద్ధి మరింత పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. ఎలక్ట్రానిక్ వెహికల్ తయారు చేసే కంపెనీలు, జిందాల్ సంస్థలు, పవర్ హౌస్‌లు ఏపీకి రాబోతున్నాయని.. డబుల్ ఇంజన్ సర్కార్ ఆధ్వర్యంలో రాయలసీమ అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందన్నారు. మన రాజధాని అమరావతిలో గత ప్రభుత్వంలో అభివృద్ధి ఆగిపోయిందని... అమరావతితో వారంతా ఆటలాడుకుని నాశనం చేశారని మండిపడ్డారు. మోడీ సారథ్యంలో ఇప్పుడు అమరావతి నిర్మాణానికి 15వేల కోట్లు కేటాయించారన్నారు. అమరావతి నుంచి అనంతపురం వరకు జాతీయ రహదారుల అనుసంధానం కాబోతున్నాయని తెలిపారు. ఏపీ జీవనాడి పోలవరం నిర్మాణం కోసం కేంద్రం ఐదు వేల కోట్లు కేటాయించిందని అన్నారు. కుడి, ఎడమ కాలువ పనులు పూర్తి చేసి త్వరలోనే ప్రాజెక్టు పూర్తి చేస్తారని వెల్లడించారు. ఏపీని అన్ని విభాగాల్లో అబివృద్ధి చేసేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి అడుగులు వేస్తున్నాయన్నారు. ఓకల్ ఫర్ లోకల్ నినాదంతో.. ప్రతిఒక్కరూ స్వదేశీ వస్తువులను కొనుగోలు చేయాలని పిలుపునిచ్చారు. భారత దేశ ఆర్థికాభివృద్ధికి దేశ ప్రజలంతా సహకారం అందించాలని ఏపీ బీజేపీ చీఫ్ మాధవ్ కోరారు.

## కడుపు నొప్పితో వెళితే.. డెలివరీ అయింది

**అమరావతి,**

: శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణంలో దారుణ ఘటన చోటు చేసుకుంది. మార్కెట్ వీధికి చెందిన మైనర్ బాలికపై.. ఆమె పెద్దమ్మ కొడుకైన చిరంజీవి అనే వ్యక్తి లైంగిక దాడి చేశాడు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన స్థానికంగా సంచలనం రేపింది. సదరు బాలిక తల్లి పనికి వెళ్లిన సమయంలో ఆమెకు మాయమాటలు చెప్పి అత్యాచారం చేశాడు చిరంజీవి. దీంతో మైనర్ బాలిక గర్భవతి అయింది. తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతున్న ఆమెను.. తల్లి ధర్మవరం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా.. ఆ కాసేపటికే మగబిడ్డకు జన్మనిచ్చింది. పుట్టిన వెంటనే ఆ శిశు వు మరణించింది. కాగా, ఈ ఘటనపై పోలీసులు పోక్స్ చట్టం కింద కేసు నమోదు చేశారు. బాలిక నుంచి వాంగ్మూలం నమోదు చేసి.. నిందితుడిని చిరంజీవిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

## బంగాళా ఖాతంలో అల్పపీడనం

**హైదరాబాద్**

నైరుతి బంగాళాఖాతంలో బుధవారం అల్పపీడనం ఏర్పడింది. పశ్చిమ వాయువ్య దిశగా కదులుతూ గురువారం మధ్యాహ్నం నాటికి ఉత్తర తమిళనాడు, దక్షిణ ఆంధ్రప్రదేశ్ తీరాలకు ఆనుకొని ఉన్న నైరుతి, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా మారుతుందని వాతావరణశాఖ పేర్కొంది. ఆ తర్వాత పశ్చిమ–వాయువ్య దిశగా ఉత్తర తమిళనాడు, పుదుచ్చేరి, దక్షిణ కోస్తాంధ్ర వైపు కదులుతూ రాబోయే 24గంటల్లో మరింత బలపడే అవకాశాలున్నాయని తెలిపింది. ఈ క్రమంలో తెలంగాణలో నాలుగు రోజుల పాటు తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. బుధవారం ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వాతావరణశాఖ పేర్కొంది. గురువారం కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. శుక్రవారం వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేసింది. నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, రంగారెడ్డి, మేడ్చల్, వికారాబాద్, నాగర్ కర్నూల్, నారాయణపేట జిల్లాలో అక్కడక్కడ మోస్తరు వర్షాలు పడే సూచనలున్నాయని చెప్పింది. శనివారం వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పింది. భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, గద్వాల జిల్లాల్లో ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వానలు పడే అవకాశం ఉందని చెప్పింది. ఆదివారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న ఈ చేసింది.

అక్షరకలం
తెలుగు దినపత్రిక

# స్పోర్ట్స్



# నేడు న్యూజిలాండ్‌తో టీమిండియా కీలక పోరు

## అమీతుమీ తేల్చుకోనున్న భారత మహిళల జట్టు

## ఎక్స్‌ట్రా బ్యాటర్‌తో బరిలోకి దిగే ఛాన్స్

## రేణుక సింగ్ పై వేటు వేసే అవకాశం!!

మహిళల వన్డే ప్రపంచకప్ 2025 టోర్నీలో టీమిండియా కీలక పోరుకు సిద్దమైంది. గురువారం న్యూజిలాండ్‌తో జరిగే లీగ్ మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని భారత మహిళల జట్టు అమీతుమీ తేల్చుకోనుంది. వరుసగా మూడు పరాజయాలతో చతికిలపడిన భారత మహిళల జట్టు.. న్యూజిలాండ్‌ను ఓడించి మళ్లీ విజయాల బాట పట్టాలనుకుంటుంది. ఈ మ్యాచ్ గెలిస్తేనే హర్మన్‌సేన సెమీస్ అవకాశాలు సజీవంగా ఉండనున్నాయి.ఓడితే సెమీస్ సమీకరణాలు మరింత సంక్లిష్టంగా మారుతాయి. ఇప్పటికే టాప్-3లో నిలిచి ఆస్ట్రేలియా, సౌతాఫ్రికా, ఇంగ్లండ్ సెమీస్ బెర్త్‌లు ఖరారు చేసుకోగా.. నాలుగో స్థానం కోసం భారత్, న్యూజిలాండ్ పోటీ పడుతున్నాయి. ఈ క్రమంలోనే ఈ మ్యాచ్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది.గత మూడు మ్యాచ్‌ల్లో టీమిండియా విజయం ముంగిట బొక్కాబోర్లా పడింది. ముఖ్యంగా ఇంగ్లండ్‌తో జరిగిన మ్యాచ్‌ను ఒత్తిడి తట్టుకోలేక చేజేతులా చేజార్చుకుంది. చావో రేవో మ్యాచ్‌లో ఎలాగైనా గెలవాలనే పట్టుదలతో



టీమిండియా ఉంది. టీమ్ కాంబినేషన్‌లో స్వల్ప మార్పులు చేసే అవకాశం ఉంది. ఇంగ్లండ్‌తో మ్యాచ్‌లో ఎక్స్‌ట్రా బౌలర్‌ను తీసుకున్న టీమిండియా.. బ్యాటర్ జెమీమా రోడ్రిగ్స్‌పై వేటు వేసింది. ఆమె స్థానంలో రేణుకా సింగ్‌ను తీసుకుంది. ఆరంభంలో భారత బౌలర్లు విఫలమైనా.. చివర్లో చెలరేగి ఇంగ్లండ్‌ను కట్టడి చేశారు.ఈ క్రమంలోనే న్యూజిలాండ్‌తో మ్యాచ్‌లో టీమిండియా ఇదే కాంబినేషన్‌ను కొనసాగిస్తుందా? లేక ఎక్స్‌ట్రా బ్యాటర్‌గా జెమీమాను ఆడిస్తుందా? అనేది చూడాలి. జెమీమాను ఆడించే అవకాశాలే ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది.



ఈ మ్యాచ్ జరిగే నవీ ముంబై పిచ్.. బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉండనుంది. డ్యూ ప్రభావం చూపనుంది. ఈ క్రమంలోనే టీమిండియా ఎక్స్‌ట్రా బ్యాటర్‌తో బరిలోకి దిగే ఛాన్స్ ఉంది. అయితే ఈ మ్యాచ్‌కు వర్షం ముప్పు పొంచి ఉంది. మిగతా కాంబినేషన్‌లో పెద్దగా మార్పులు జరిగే అవకాశం లేదు.ఓపెనర్ స్మృతి మంధాన సూపర్ ఫామ్‌లో ఉండగా.. ప్రతికా రావల్ మెరుపులు మెరిపించాల్సి ఉంది. హర్లీన్ డియోల్ కూడా చెలరేగితే భారత్‌కు తిరుగుండదు. హర్మన్‌ప్రీత్ కౌర్ కూడా ఫామ్‌లోకి వచ్చింది. రిచా ఘోష్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. అమన్‌జోత్ కౌర్, దీప్తి శర్మ కూడా మెరుగ్గానే రాణిస్తున్నారు. ఛేజింగ్‌లో సెటిల్ అయిన బ్యాటర్ మ్యాచ్ ముగిసే వరకు క్రీజులో ఉండాల్సిన అవసరం ఉంది. ఈ విషయంపై టీమిండియా వర్క్ చేయాల్సి ఉంది. బౌలర్లుగా క్రాంతి గౌడ్, శ్రీచరణి, దీప్తి శర్మ, స్నేహ్ రాణా పర్వాలేదనిపిస్తున్నారు. సమష్టి ప్రదర్శన కనబరిస్తేనే టీమిండియాకు విజయం దక్కనుంది. మధ్యాహ్నం 3 గంటలకు ఈ మ్యాచ్ ప్రారంభం కానుండగా.. జియో హాట్‌స్టార్, స్టార్ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం కానుంది.

భారత తుది జట్టు(అంచనా):

స్మృతి మంధాన, ప్రతికా రావల్, హర్లీన్ డియోల్, హర్మన్‌ప్రీత్ కౌర్, రిచా ఘోష్, అమన్‌జోత్ కౌర్, స్నేహ్ రాణా, దీప్తి శర్మ, రేణుక సింగ్/జెమీమా రోడ్రిగ్స్, క్రాంతి గౌడ్, శ్రీ చరణి.



# చరిత్ర సృష్టించిన వెస్టిండీస్

ఒకప్పుడు ఫాస్ట్ బౌలింగ్‌కు మారుపేరుగా నిలిచిన వెస్టిండీస్ క్రికెట్ జట్టు వన్డే క్రికెట్ చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా స్పిన్ బౌలింగ్‌తో చరిత్ర సృష్టించింది. బంగ్లాదేశ్‌లోని ఢాకా వేదికగా జరిగిన రెండో వన్డే మ్యాచ్‌లో వెస్టిండీస్ జట్టు తమ ఇన్నింగ్స్ లోని మొత్తం 50 ఓవర్లను కేవలం స్పిన్ బౌలర్ల చేత మాత్రమే వేయించి ప్రపంచ రికార్డును నెలకొల్పింది. పూర్తి స్థాయి సభ్యదేశం ఈ అద్భుతమైన ఫీట్‌ను సాధించడం ఇదే మొదటిసారి. తొలి వన్డేలో బంగ్లాదేశ్ స్పిన్నర్ రిషాద్ హుస్సేన్(6 వికెట్లు) దెబ్బకు వెస్టిండీస్ స్వల్ప స్కోరుకే కుప్పకూలిన నేపథ్యంలో వెస్టిండీస్ కెప్టెన్ షాయ్ హోప్, టీమ్ యాజమాన్యం వ్యూహాత్మకంగా ఆలోచించారు. రెండో వన్డేకు ఉపయోగించిన ఢాకా పిచ్ పూర్తిగా పొడిగా, పగుళ్లతో స్పిన్‌కు అత్యంత అనుకూలంగా ఉండటంతో పేస్ బౌలర్లను పక్కనపెట్టి ఆల్-స్పిన్ దాడికి దిగాలని నిర్ణయించుకున్నారు. ఇది



కరేబియన్ క్రికెట్ సంప్రదాయానికి పూర్తి విరుద్ధమైన నిర్ణయమైనా.. పిచ్ కండిషన్స్‌కు తగ్గట్టుగా తీసుకున్న సరైన నిర్ణయంగా నిరూపించబడింది.వెస్టిండీస్ జట్టు ఐదుగురు స్పిన్ బౌలర్లను (అకీల్ హొసేన్, రోస్టన్ ఛేజ్, ఖారీ పియెర్రీ, గుడకేశ్ మోటీ, అలిక్ అథనాజ్) ఉపయోగించింది. వీరిలో ప్రతి ఒక్కరూ తమ కోటా 10 ఓవర్లను పూర్తి చేశారు. ఈ సమష్టి దాడి బంగ్లాదేశ్ బ్యాటర్లనున తీవ్రంగా ఇబ్బంది పెట్టింది.గుడకేశ్ మోటీ (3/65) ప్రధాన స్పిన్నర్‌గా మోటీ 3 కీలక వికెట్లు పడగొట్టి తన పాత్రను సమర్థంగా పోషించాడు. పార్ట్‌టైమ్ స్పిన్నర్‌గా జట్టులోకి వచ్చిన అలిక్ అథనాజ్ (2/14) అద్భుతమైన ప్రదర్శన కనబరిచాడు. తన 10 ఓవర్లలో కేవలం 14 పరుగులను మాత్రమే ఇచ్చి 2 కీలక వికెట్లు పడగొట్టడం విశేషం.పవర్ ప్లేతో సహా కీలక సమయాల్లో అకీల్ హొసేన్ (2/41) రెండు వికెట్లు తీసి జట్టుకు బ్రేక్‌త్రూలు అందించాడు.ఈ



ఐదుగురు స్పిన్నర్ల ధాటికి బంగ్లాదేశ్ నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 213 పరుగులు మాత్రమే చేయగలిగింది. చివర్లో రిషాద్ హొస్సేన్ 14 బంతుల్లో 39 పరుగుల మెరుపు ఇన్నింగ్స్‌తో బంగ్లా గౌరవప్రదమైన స్కోరు చేయగలిగింది. 214 పరుగుల లక్ష్యాన్ని ఛేదించిన వెస్టిండీస్ జట్టు కూడా చివరి బంతికి 213 పరుగులకే పరిమితం కావడంతో మ్యాచ్ టై అయ్యింది. కెప్టెన్ షాయ్ హోప్ (53 నాటౌట్) అద్భుతంగా రాణించినప్పటికీ, బంగ్లా స్పిన్నర్ల ధాటికి విండీస్ తడబడింది. దీంతో విజేతను నిర్ణయించడానికి సూపర్ ఓవర్ అనివార్యమైంది. సూపర్ ఓవర్‌లో వెస్టిండీస్ బౌలర్ అకీల్ హుసేన్ మరోసారి తన స్పిన్‌తో మాయ చేసి బంగ్లాదేశ్‌ను ఒక్క పరుగు తేడాతో ఓడించాడు. ఈ విజయంతో వెస్టిండీస్ సిరీస్‌ను 1-1తో



సమం చేసి కీలకమైన విజయాన్ని నమోదు చేసింది. 50 ఓవర్ల స్పిన్ బౌలింగ్: వన్డే చరిత్రలో 50 ఓవర్లు స్పిన్నర్లతో బౌలింగ్ వేసిన తొలి జట్టుగా వెస్టిండీస్ నిలిచింది. అంతకుముందు శ్రీలంక 1996లో వెస్టిండీస్‌పై మూడు సార్లు 44 ఓవర్లు స్పిన్ బౌలింగ్ వేసిన రికార్డును బద్దలు కొట్టింది. అత్యధిక స్పిన్ ఓవర్లు: ఈ మ్యాచ్‌లో వెస్టిండీస్ 50 ఓవర్లు, బంగ్లాదేశ్ 42 ఓవర్లు (ముస్తాఫిజుర్ రెహమాన్ ఒక్కడే పేసర్) స్పిన్ బౌలింగ్ వేయడంతో, ఇరు జట్లు కలిపి మొత్తం 92 ఓవర్లు స్పిన్ బౌలింగ్ చేసిన అరుదైన ప్రపంచ రికార్డును కూడా ఈ మ్యాచ్ నెలకొల్పింది. అంతకుముందు 78.2 ఓవర్ల రికార్డు ఉండేది.



# సర్ఫరాజ్ ఖాన్‌పై వేటుపై విమర్శలు!

ఇక భారత్-ఏ జట్టులోనే చోటు దక్కించుకోలేకపోయిన సర్ఫరాజ్ ఖాన్‌కు భారత ప్రధాన జట్టులో కూడా చోటు దక్కే అవకాశం కనిపించడం లేదు. ఫిట్‌నెస్‌పై ఫోకస్ పెట్టి 17 కిలోల బరువు తగ్గినా.. రెడ్ బాల్ క్రికెట్‌లో మెరుగైన ప్రదర్శన చేస్తున్నా పట్టించుకోకపోవడం అందర్నీఆశ్చర్యానికి గురి చేసింది. ఈ క్రమంలోనే కాంగ్రెస్ నేత షామ మొహమ్మద్ చేసిన ట్వీట్ తీవ్ర దుమారానికి కారణమైంది. ఇంటి పేరు కారణంగానే సర్ఫరాజ్ ఖాన్‌కు అవకాశం రావడం లేదా? అని ఆమె చేసిన ట్వీట్ చర్చనీయాంశమైంది.ఇంటి పేరు కారణంగానే సర్ఫరాజ్ ఖాన్ జట్టుకు ఎంపిక కాలేదా? ఊరికే అడుతున్నా అంతే.. ఈ విషయంలో గౌతమ్ గంభీర్ విధానాలు ఎలా ఉంటాయో మనకు తెలిసిందే కదా'అని ట్వీట్ చేసింది. టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ కారణంగానే సర్ఫరాజ్ ఖాన్‌కు అవకాశం దక్కడం లేదని పరోక్షంగా ఆరోపించింది. ఈ



ట్వీట్‌పై క్రికెట్ అభిమానులు, బీజేపీ కార్యకర్తలు ఘాటుగా స్పందిస్తున్నారు. ఆటలో ఇలాంటి రాజకీయాలకు తావు లేదని, ఇలాంటి మాటలతో చిచ్చు పెట్టాలని చూడవద్దని హితవు పలుకుతున్నారు. మరోవైపు ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ కూడా సర్ఫరాజ్ ఖాన్‌ను ఎందుకు ఎంపిక చేయలేదని సోషల్ మీడియా వేదికగా సెలెక్టర్లను నిలదీసాడు.స్ట్ క్లాస్ క్రికెట్‌లో అత్యద్భుతమైన గణాంకాలు ఉన్నప్పటికీ.. అతనికి అవకాశం ఇవ్వకపోవడంపై ఒవైసీ ప్రశ్నలు రాజకీయ వర్గాల్లోనూ చర్చకు దారితీశాయి. ముంబైకి చెందిన ఈ కుడిచేతి వాటం బ్యాటర్‌కు ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో అద్భుతమైన రికార్డు ఉంది. అతను 65 ప్లస్



సగటుతో పరుగులు చేశాడు. అంతర్జాతీయ టెస్ట్ క్రికెట్లో ఇప్పటివరకు 6 టెస్ట్ మ్యాచ్‌లు ఆడి 37 సగటుతో 371 పరుగులు చేశాడు. న్యూజిలాండ్‌పై బెంగళూరు టెస్టులో 150 పరుగులు కూడా చేశాడు. గతంలో ఆస్ట్రేలియా పర్యటనలో భారత జట్టులో ఉన్నప్పటికీ అతనికి తుది జట్టులో అవకాశం దక్కలేదు. ఆ తర్వాత జట్టులో చోటు కోల్పోయాడు. ఫిట్‌నెస్‌పై ఫోకస్ పెట్టి ఏకంగా 17 కిలోల బరువు తగ్గాడు. ఇంగ్లండ్ పర్యటనలో భారత్ ఏ తరఫున 92 పరుగులతో రాణించాడు. అయినా అతనికి భారత జట్టులో అవకాశం దక్కలేదు. మరోవైపు సర్ఫరాజ్ ఖాన్‌ను నిరంతరం నిర్లక్ష్యం చేయడంపై ఆల్ ఇండియా మజ్లిస్ ఎ ఇత్తెహాదుల్ ముస్లిమీన్ అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. సెలక్టర్ల నిర్ణయాన్ని ప్రశ్నిస్తూ ఆయన సోషల్ మీడియాలో (ఎక్స్ హ్యాండిల్లో) ఒక పోస్ట్ చేశారు.ఒవైసీ తన పోస్ట్‌లో "సర్ఫరాజ్ ఖాన్‌ను ఇండియా-ఎ జట్టుకు కూడా ఎందుకు ఎంపిక చేయలేదు?" అని ప్రశ్నించారు. ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో అత్యద్భుతమైన గణాంకాలు ఉన్నప్పటికీ.. అతనికి అవకాశం



ఇవ్వకపోవడంపై ఒవైసీ ప్రశ్నలు రాజకీయ వర్గాల్లోనూ చర్చకు దారితీశాయి. ముంబైకి చెందిన కుడిచేతి వాటం బ్యాటర్ సర్ఫరాజ్ ఖాన్ ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో అద్భుతమైన రికార్డును కలిగి ఉన్నాడు. సర్ఫరాజ్ ఫస్ట్ క్లాస్ సగటు 65 కంటే ఎక్కువగా ఉంది. టెస్ట్ క్రికెట్లో ఇప్పటివరకు 6 టెస్ట్ మ్యాచ్‌లు ఆడి 37 సగటుతో 371 పరుగులు చేశాడు. న్యూజిలాండ్‌పై బెంగళూరు టెస్టులో 150 పరుగులు కూడా చేశాడు. గతంలో ఆస్ట్రేలియా పర్యటనలో భారత జట్టులో ఉన్నప్పటికీ అతనికి తుది జట్టులో అవకాశం దక్కలేదు. ఆ తర్వాత జట్టు నుంచి తప్పించారు. అయితే ఇంగ్లండ్-ఎ జట్టుతో జరిగిన ఒక మ్యాచ్‌లో అతను 92 పరుగులు చేశాడు. గాయం నుంచి కోలుకుని, తన ఫిట్‌నెస్‌ను మెరుగుపర్చుకుని, ఏకంగా 17 కిలోల బరువు కూడా తగ్గించుకున్నాడు.సర్ఫరాజ్ ఖాన్‌ను ఎంపిక చేయకపోవడంపై స్పష్టత లేకపోవడం అభిమానుల్లో, మాజీ క్రికెటర్లలో ఆగ్రహం కలిగిస్తోంది. సర్ఫరాజ్ ఖాన్ కేవలం రెడ్ బాల్ క్రికెట్ మాత్రమే ఆడుతున్నందున, దేశవాళీ క్రికెట్ లేదా ఇండియా-ఎ మ్యాచ్‌లు ఆడటం అతనికి చాలా కీలకం. దేశవాళీలో తిరిగి అడుగుపెట్టి, ఫిట్‌నెస్ నిరూపించుకున్నా కూడా ఇండియా-ఎ జట్టులో చోటు దక్కకపోవడం నిరాశ కలిగించే అంశం. దక్షిణాఫ్రికా-ఎతో జరిగే ఈ రెండు మ్యాచ్‌లకు గాయం నుంచి కోలుకున్న వికెట్ కీపర్, బ్యాటర్ రిషభ్ పంత్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. రెండో మ్యాచ్‌కు కేఎల్ రాహుల్, మహ్మద్ సిరాజ్ వంటి సీనియర్ ఆటగాళ్లు కూడా అందుబాటులో ఉండనున్నారు. సర్ఫరాజ్ ఖాన్ నేడు, అక్టోబర్ 22న తన 28వ పుట్టినరోజును జరుపుకుంటున్నారు. ఈ సందర్భంలోనే అతనికి ఇండియా-ఎ జట్టులో స్థానం దక్కకపోవడం క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశమైంది.

# కోలిండియా స్థాయి పోటీలో రాణించాలి





**అక్షర కలం, మందమర్రి అక్టోబర్ 23:**

సింగరేణి క్రీడాకారులు కోలిండియా స్థాయిలో జరిగే పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరిచి, రాణించి, సింగరేణి సంస్థకు ఏరియాకు మంచి పేరు తీసుకురావాలని ఏరియా జీఎం ఎన్ రాధాకృష్ణ తెలిపారు. ఏరియా వర్క్స్ పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ (డబ్ల్యూపిఎస్ అండ్ జిఏ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 61 వార్షిక క్రీడల్లో భాగంగా పట్టణంలోని స్థానిక సింగరేణి ఉన్నత పాఠశాల మైదానంలో గురువారం నిర్వహించిన అవుట్ డోర్ ఫుట్ బాల్ పోటీలకు ఏరియా జీఎం ఎన్ రాధాకృష్ణ, పర్సనల్ మేనేజర్ ఎస్ శ్యాంసుందర్, సివిల్ ఎస్ఈ రాము, గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ బ్రాంచ్ శైలేంద్ర సత్యనారాయణ, సెంట్రల్ కమిటీ సభ్యుడు సివి రమణ తో కలిసి ముఖ్య అతిథులుగా హాజరై, పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా జీఎం రాధాకృష్ణ మాట్లాడుతూ, సింగరేణి సిఎండి ఎన్ బలరాం ఆదేశాల మేరకు సింగరేణి ఉద్యోగులకు ప్రతి ఏటా క్రీడా పోటీలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు, కళాకారులు కోలిండియా స్థాయిలో ప్రతి సంవత్సరం ఎన్నో బహుమతులు సాధించి, సింగరేణికి పేరు ప్రఖ్యాతలు తీసుకు వస్తున్నారన్నారు. సీనియర్ క్రీడాకారులు సంస్థలో పని చేస్తున్న యువ ఉద్యోగులను, క్రీడలకు ప్రోత్సహించాలని సూచించారు. క్రీడలు మానసిక ఉల్లాసానికే కాక శారీరక దృఢత్వానికి సైతం తోడ్పడతాయని తెలిపారు. ఉద్యోగి ఆరోగ్యంగా ఉన్నప్పుడే సంస్థ అభివృద్ధికి దోహదం చేసిన వారవుతారన్నారు. ఈ సందర్భంగా సీనియర్ కోలిండియా ఫుట్బాల్ ప్లేయర్, ఏరియాలోని కాసిపేట ఒకటి గని పంప్ ఆపరేటర్ మంజీత్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ముఖ్య అతిథులు క్రీడాకారులు ఆయనకి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ పోటీల్లో కాసీపేట 1 గ్రూప్ విజేతలుగా నిలువగా, కేకే గ్రూప్ రన్నర్స్ గా నిలిచారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పిఓ, క్రీడల గౌరవ కార్యదర్శి ఎం కార్తీక్, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ శివకృష్ణ, జనరల్ కెప్టెన్ శాఖ శ్రీనివాస్, క్రీడాకారులు పాల్గొన్నారు.

# రౌడీ షీటర్లపై పోలీస్ నజర్..

**వారి అరాచకాలను అరికట్టడంపై కసరత్తు..**

**రాష్ట్రంలో 6 వేల మందిపై రౌడీ, హిస్టరీ షీట్లు**

**రౌడీ షీటర్ల కార్యకలాపాలపై ప్రత్యేకంగా నిఘా**

**కుటుంబసభ్యుల ముందే కౌన్సెలింగ్**

**కానిస్టేబుల్ ప్రమోద్ హత్యతో డిపార్ట్మెంట్ అలర్ట్**

**పాతబస్తీలో 101 మంది రౌడీ షీటర్లు..**

**11 గ్యాంగులు**

**నగరాల నుంచి పల్లెల దాకా భూ కబ్జాలు, సెటిల్మెంట్లు**

**అక్షర కలం/ ప్రత్యేక ప్రతినిధి:**

రాష్ట్రంలో రౌడీ షీటర్లు అరాచకం సృష్టిస్తున్నారు. హైదరాబాద్ సహా రాష్ట్రంలోని పలుచోట్ల నిత్యం భూ కబ్జాలు, సెటిల్‌మెంట్లు, ఇతర దందాల్లో మునిగితేలుతున్నారు. ఈ క్రమంలో అడ్డొచ్చినవారిపై దాడులు, హత్యలకు తెగబడ్తున్నారు. హైదరాబాద్ లోనైతే ఆధిపత్య పోరుతో నడిరోడ్లపై కత్తులతో పరస్పర దాడులు చేసుకోవడం, గన్ ఫైరింగ్ లకు పాల్పడడం కామన్గా మారింది. ఇటీవలి కాలంలో జరిగిన దాడులు, హత్యల్లో రౌడీ షీటర్లు కీలకపాత్ర పోషించినట్లు పోలీస్రికార్డులు చెప్తున్నాయి. తాజాగా నిజామాబాద్‌లో రౌడీ షీటర్ షేక్ రియాజ్ ఏకంగా కానిస్టేబుల్ ప్రమోద్‌కుమార్ ను హత్య చేయడంతో పోలీస్ శాఖ అప్రమత్తమైంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రౌడీ షీటర్ల లెక్క తీస్తున్న పోలీసులు, వారిని కట్టడి చేసేందుకు ఎలాంటి వ్యూహాలు అమలు చేయాలనేదానిపై కసరత్తు చేస్తున్నారు.

### ల్యాండ్ సెటిల్మెంట్లు, భూకబ్జాలు..

ప్రధానంగా రౌడీ షీటర్లను స్థానిక రాజకీయ నేతలే ప్రోత్సహిస్తున్నారనే ఆరోపణలున్నాయి. కొందరు పోలీస్‌అధికారులు కూడా రౌడీ షీటర్లతో సంబంధాలు పెట్టుకొని అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారనే ఫిర్యాదులూ వస్తున్నాయి. ఇలా కొంతమంది రాజకీయనాయకులు, పోలీస్‌అధికారుల అండదండలతో రౌడీ షీటర్లు రెచ్చిపోతున్నారు. హైదరాబాద్లో సివిల్ వివాదాలు, ముఖ్యంగా ల్యాండ్ సెటిల్మెంట్లు చేస్తూ కోట్లు సంపాదిస్తున్నారు. కొందరు రౌడీ షీటర్లయితే వడ్డీ వ్యాపారం చేస్తూ ఆస్తులు ఆక్రమిస్తున్నారు. ఈ క్రమంలో మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయి. ముఖ్యంగా హైదరాబాద్ పాతబస్తీ సహా అనేక బస్తీల్లో రౌడీ షీటర్లే గల్లీ లీడర్లుగా చెలామణి అవుతున్నారు. సామాన్యుల గొడవలు, ఆర్థిక వ్యవహారాలు, ఆస్తి పంపకాల్లోకీ ఎంటరై బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఈ క్రమంలో దాడులు, హత్యాయత్నాలు, హత్యలకూ తెగబడ్తున్నారు. కొంతమంది రౌడీ షీటర్లు పేకాట స్థావరాలు, వ్యభిచార గృహాలు, గంజాయి, డ్రగ్స్‌పై లాంటి దందాలు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది ఏడు నెలల కాలంలో హైదరాబాద్‌లో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తూ అరెస్టయిన వారిలో ఎక్కువ మంది రౌడీ షీటర్లే ఉన్నారని




పోలీసులు చెప్తున్నారు.

### జిల్లాల్లోనూ వందల్లో రౌడీ షీట్లు..

హైదరాబాద్లాంటి సిటీలోనే కాదు, జిల్లాల్లోనూ రౌడీ షీటర్లు పెరిగిపోతున్నారు. ఉదాహరణకు నిర్మల్ జిల్లాలో దాదాపు 500 మందిపై రౌడీ షీట్లు తెరిచినట్లు పోలీసు వర్గాలు చెబుతున్నాయి. కాగా నిజామాబాద్ లో ప్రమోద్హత్య అనంతరం పోలీస్ శాఖ ఉన్నతాధికారులు అన్ని జిల్లాల ఎస్పీలను అలర్ట్‌చేశారు. ఐజీ స్థాయి అధికారులు, కమిషనర్లు, ఎస్పీ స్థాయి అధికారులతో ప్రత్యేకంగా సమావేశమై రౌడీ షీటర్ల కట్టడికి చర్యలు తీసుకుంటున్నారు. రౌడీ షీటర్ల కదలికలపై నిఘా పెంచాలని నిర్ణయించిన అధికారులు నిర్మల్లాంటి జిల్లాల్లో స్పెషల్ టీంలను ఏర్పాటు చేశారు. ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదైన రౌడీ షీటర్ల కార్యకలాపాలపై నిఘా పెట్టారు. వారు ప్రస్తుతం ఎక్కడ ఉన్నారు? ఏం చేస్తున్నారు? ఏదైనా దందాల్లో, సెటిల్మెంట్లలో ఇన్వాల్వ్ అవుతున్నారా? లాంటి వివరాలు ఆరా తీస్తున్నారు. ఎప్పట్లాగే వివిధ సందర్భాల్లో బైండోవర్చేయడం కాకుండా ఈసారి కొత్తగా కుటుంబసభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ఇవ్వాలని నిర్ణయించారు. వారి వెనుక ఉన్న స్థానిక నాయకులను కూడా పిలిపించి, కౌన్సెలింగ్ఇస్తామని ఓ పోలీస్ అధికారి 'వెలుగు'తో పేర్కొన్నారు. తద్వారా రౌడీ షీటర్ల ఆగడాలకు చాలావరకు అడ్డుకట్ట వేయవచ్చని తాము భావిస్తున్నట్లు తెలిపారు.

### గ్రేటర్‌లో 3 వేల రౌడీ షీట్లు.. 3 వేల హిస్టరీ షీట్లు

హైదరాబాద్‌లోని మూడు పోలీసు కమిషనరేట్ల పరిధిలో దాదాపు 3 వేల మందికి పైగా రౌడీ షీటర్లు పోలీసుల రికార్డులో ఉన్నారు. గణేశ్శోభాయాత్ర సహా భారీ ఉత్సవాలు, ఎలక్షన్లు, వీవీఐపీల పర్యటనల సమయంలో వీరిని పోలీసులు బైండోవర్ చేస్తుంటారు. నిర్ణీత సమయం వరకు స్టేషన్‌కు పిలిపించి సంతకాలు తీసుకుంటారు. ఈ క్రమంలోనే వరుస నేరాలు చేసే వారిపై హిస్టరీ షీట్లు, అనుమానితులపై సస్పెక్ట్ షీట్లు ఓపెన్ చేస్తున్నారు. ఈ మేరకు గతేడాది వరకు రాష్ట్ర వ్యాప్తంగా 3,689 మందిపై హిస్టరీ షీట్లు నమోదు కాగా, 2,758 మందిపై పోలీసులు సస్పెక్ట్ షీట్లు ఓపెన్ చేశారు. వీరికి సంబంధించి నేరాలతో కూడిన పూర్తి వివరాలను పోలీస్ డిజిటల్ రికార్డులో పొందుపరిచారు. తాజా ఘటనల నేపథ్యంలో ఇలాంటి వారిపై పోలీసులు నిఘా ముమ్మరం చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కౌన్సిలింగ్ నిర్వహించి బైండోవర్లు చేసేందుకు చర్యలు చేపట్టారు. రౌడీ షీటర్ వేధింపులతో ఖమ్మం జిల్లా వి.వెంకటాయపాలెం జగ్యా తండాకు చెందిన బోడ సుశీల(28) అనే మహిళ సోమవారం ఆత్మహత్య చేసుకుంది. పొలంలో పని చేసుకుంటున్న సుశీలను అమ్మపాలెం గ్రామానికి చెందిన రౌడీ షీటర్ ధరావత్ వినయ్ తన కోరిక తీర్చాలని అఘాయిత్యం చేయబోయాడు. ఆమె ప్రతిఘటించడంతో దాడికి పాల్పడ్డాడు. దీంతో మనస్తాపం చెందిన బాధితురాలు ఇంటికి వచ్చి ఆత్మహత్య చేసుకుంది. స్థానిక రఘునాథపాలెం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా, వినయ్‌పై నెల రోజు క్రితమే రౌడీ షీట్ ఓపెన్ కావడం గమనార్హం. హైదరాబాద్ పాతబస్తీ ఐఎస్ సదన్‌లో రౌడీ షీటర్ నసీర్ కత్తితో హల్‌చల్ చేశాడు. ఈ నెల 1న జరిగిన ఈ ఘటన తీవ్ర కలకలం రేపింది. కత్తి చేతిలో పట్టుకుని వీధుల్లో తిరిగిన నసీర్.. పలు వాహనాలను ధ్వంసం చేశాడు. అడ్డొచ్చిన వారిపై దాడికి యత్నించాడు. హత్య, హత్యాయత్నం, చోరీ, చైన్ స్నాచింగ్ కేసుల్లో ఇతడు నిందితుడిగా ఉన్నాడు. ఈ మేరకు రౌడీ షీటర్‌గా పోలీస్ రికార్డుల్లోకి ఎక్కాడు. వరంగల్ జిల్లా నర్సంపేట టౌన్‌లో ఓ రౌడీ షీటర్ ఇటీవల వీరంగం సృష్టించాడు. వల్లభ్ నగర్‌కు చెందిన కొంగ మురళి కుటుంబంపై రౌడీ షీటర్ ఓర్సు తిరుపతి తన అనుచరులతో వచ్చి వీరంగం సృష్టించాడు. దాడిలో మురళి కుమారుడు సాయి చేయి విరిగి, తల పగిలి రక్తస్రావం అయ్యింది. అడ్డుకునేందుకు వెళ్లిన మురళి భార్య నాగలక్ష్మి, కూతురు రేష్మ, అల్లుడు రాజు, సాయి భార్య ప్రత్యూషపై దారుణంగా దాడి చేశాడు. తిరుపతిపై ఇప్పటికే పదుల సంఖ్యలో కేసులు నమోదు కాగా, రౌడీ షీటర్‌గా పోలీసుల రికార్డుల్లోకి ఎక్కాడు.

# రైతులను నట్టేట ముంచిన కాంగ్రెస్ ప్రభుత్వం...

**బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడమటి జగన్మోహన్ రెడ్డి.**

**వలిగొండ అక్టోబర్ 23 అక్షరకలం**

:మండలంలోని వరి ధాన్యాన్ని త్వరితగతిన కొనుగోలు చేయాలని,బీజేపి కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడమటి జగన్ మోహన్ రెడ్డి అన్నారు.గురువారం తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి ఆర్ఐ కరుణాకర్ రెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ భారత ప్రభుత్వం దేశ ప్రధాని నరేంద్ర మోడీ దేశంలోని రైతులు యొక్క ఆదాయాన్ని రెట్టింపు చేయాలని,మద్దతు ధర ప్రతి సంవత్సరం పెంచడం జరుగుతుందనీ,కొనుగోలు సెంటర్లకు సంబంధించి పూర్తి నిధులు,అదే విధంగా దానికి సంబంధించిన వసతులు కేంద్ర ప్రభుత్వం సమకూర్చినప్పటికి రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో ఇంత వరకు ఏ ఒక్క సెంటర్లో కూడా ఒక్క కిలో వడ్ల గింజలు కూడా కొనుగోలు చేయలేదన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం గడిచిన రెండు సంవత్సరాల కాలంలో రైతులకు ఇచ్చినటువంటి ఎలాంటి హామీలను నెరవేర్చలేదని,రైతు కల్లాలలో, ఐకెపి సెంటర్లో,అకాల వర్షాలతో తడిసిన వరి ధాన్యం తడిసి ముద్దైందని,పేరుకు ఐకెపి సెంటర్ల వద్ద రిబ్బన్ కటింగ్లు చేయడం జరిగిందన్నారు.ఇంతవరకు కాంటలు ప్రారంభించలేదని వారు ఎద్దేవ చేశారు.అలాగే ఈ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చినటువంటి ఆరుగ్యారంటీలను అమలు చేయలేక చేతులెత్తేసిందని,స్థానిక ఎమ్మెల్యే ప్రత్యేక శ్రద్ధ వహించి జిల్లాలోని అన్ని ఐకెపి సెంటర్లను వెంటనే ప్రారంభించేటట్టు,కలెక్టర్ సంబంధిత అధికారులు చొరవ చూపి రైతులను ఇబ్బంది పెట్టకుండా ధాన్యం కొనుగోలు చేయాలని,ప్రభుత్వం డిమాండ్ చేశారు.అదే విధంగా పత్తి రైతులను కూడా ఈ రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని లేని యెడల కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి



పడమటి జగన్ మోహన్ రెడ్డి,రాష్ట్ర నాయకులు సీఎన్ రెడ్డి,జిల్లా నాయకులు బంధారపు లింగస్వామి,మండల అధ్యక్షుడు బోళ్ల సుదర్శన్,రాచకొండ కృష్ణ,కనతాల అశోక్ రెడ్డి,బందారపు రాములు,కందుల తానేష,బోడిగే ఆనంద్,నాగయ్య, మైసొల్ల రామనర్సు,లోడే లింగస్వామి,గంగాధరి దయాకర్,మందుల నాగరాజు,కొత్త రామచంద్రం,మందడి రంజిత్ రెడ్డి,పిన్నింటి నరేందర్ రెడ్డి,అంబరీష, బుంగమట్ల మహేష్,సందీప్ రెడ్డి,నరేందర్ రెడ్డి,శశికాంత్,కీర్తి వెంకటేశం,శివరంజన్ రెడ్డి,గోవర్ధన్ చారి,సురేష్, సందీప్ గౌడ్,బుంగమట్ల మహేష్,శ్రవణ్,నారి లింగస్వామి,తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీఏ "అవినీతికి" చెక్.!

**ఉమ్మడి నల్గొండ జిల్లాలో చెక్ పోస్టుల ఎత్తివేత**

**ఇకనుండి ఆన్లైన్ లో సేవలు**

**కార్యాలయాల్లోనూ ఏజెంట్లను నిలువరిస్తే మేలు**

**అక్షరకలం నల్గొండ**

రవాణా శాఖలో అక్రమాలకు ప్రభుత్వం చెక్ పెట్టింది. రాష్ట్రంలో రవాణాశాఖ చెక్ పోస్టులు ఎత్తివేయడంతో ఉమ్మడి నల్గొండ జిల్లాలో అంతర్రాష్ట్ర సరిహద్దులో ఉన్న తనిఖీ కేంద్రాలను ఎత్తివేస్తూ బుధవారం సాయంత్రం నుంచే అమలు చేశారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో వాడపల్లి, నాగార్జునసాగర్, కోదాడ లో వున్నా మూడు చెక్ పోస్ట్ లను పూర్తిగా తొలగించారు. మూడు నెలల క్రితమే రవాణా శాఖలో తనిఖీ కేంద్రాలను ఎత్తి వేసి పూర్తిగా ఆన్లైన్ ఆధారిత వాహన పన్నుల వసూళ్లు, జరిమానాలు చెల్లించేలా ఏర్పాట్లు చేశారు. వాస్తవానికి చెక్ పోస్టులను ఎత్తివేస్తూ ఈ ఏడాది ఆగస్టు 28న రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 58 ని జారీ చేసినా అమలు కాలేదు. క్షేత్రస్థాయిలో ఇంకా చెక్ పోస్టులు అనధికారికంగానే కొనసాగుతూ వస్తున్నాయి. ఇటీవల రాష్ట్రంలోని పలు జిల్లాలో ఏసీబీ అధికారులు ఏకకాలంలో దాడులు చేశారు. ఈ తనిఖీల్లో లెక్కకు మించి వున్ననగదు స్వాధీనం చేసుకున్నారు. అనధికారికంగా వసూలు చేసిన సొమ్మును స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశారు. తరచూ దాడులు, తనిఖీలు జరిగినా ఈ కేంద్రాల్లో సాగిన అవినీతిని నిలువరించలేకపోయారు. మరోవైపు ప్రభుత్వానికి పన్నుల లక్ష్యాలు పూర్తి స్థాయిలో చేరడం లేదు. తాజాగా కేంద్రాలను ఎత్తివేయడంతో వాహన యజమానులు, డ్రైవర్ల

**నుంచి అనధికార వసూళ్లు పూర్తిగా తగ్గనుంది.**

వాహనాలను బట్టి మామూల్లు...

వాహనాలకు ఉన్న టైర్లకనుగుణంగా కేటగిరీ లుగా విభజించి మామూళ్లు వసూలు చేసేవారని పలువురు డ్రైవర్లు ఆరోపిస్తున్నారు. పది టైర్ల వాహనానికి రూ.200, 12కు రూ.400, 14కు 500, 16కు రూ.600, 18కు రూ.700, 20కు రూ.2వేలు, పుల్లర్ లోబో(రోడ్లను ఆనుకొని వెళ్లే భారీ




పరికరాలను తరలించేవి) వాహనాలకైతే ఏకంగా రూ.3 వేల వరకు అనధికారికంగా వసూలు చేశారనేది ప్రధాన ఆరోపణ. ఈ లెక్కన రోజుకు లక్షల్లో వసూలు జరిగేవని తెలుస్తుంది.

### కార్యాలయాల్లో ఏజెంట్ల హవా...

ఉమ్మడి జిల్లా నల్గొండ జిల్లా పరిధిలోని జిల్లా రవాణాశాఖ కార్యాలయాల్లోనూ ఏజెంట్లు, మధ్యవర్తుల హవా కొనసాగుతోందనే ఆరోపణలున్నాయి. ఏజెంట్ల పేరుతో వాస్తవ చార్జీల కంటే అధికంగా వసూళ్లు చేస్తున్నారు. ఆర్టీఏ కార్యాలయాల్లో అధికారులు, సిబ్బంది అంతా తెలిసి కూడా ఈ అనధికార వసూళ్లను ప్రోత్సహి స్తున్నారు. కార్యాలయాలకు వచ్చే వాహ నదారులు, వినియోగదారులు లైసెన్స్, రిజిస్ట్రే షన్లు, పర్మిట్లు ఇవ్వడంలో ప్రభుత్వం విధించిన రుసుం, పన్నుల కంటే అధికంగా చెల్లించాల్సిన అవసరం ఏర్పడుతోంది. చాలామందికి రవాణా శాఖ నిబంధనలపై అవగాహన లేమితో విద్యావం తులు సైతం మధ్యవర్తులతోనే కార్యాలయాలకు వెళు తున్నారు. చాలా సేవలు ఆన్లైన్లో చేసుకోవచ్చు. సులువుగా పని పూర్తవుతుందనే కారణంతో ఏజెంట్లను ఆశ్రయిస్తున్న పౌరులపై అదనపు భారం పడుతోంది. ఈ క్రమంలో ప్రభుత్వం వాహన రిజిస్ట్రేషన్లు షోరూంల్లోనే చేసుకునే వెసలిబాటు ఇవ్వాలి. నిరక్షరాస్యులు సైతం కార్యాలయాల్లో సేవలు పొందేలా ఏర్పాట్లు, కార్యాలయాల్లో మధ్య వర్తులను కట్టడి చేస్తే అవినీతి తగ్గే అవకాశం ఉంటుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత ఆధునిక సేవలను వినియోగించి దళారుల వ్యవస్థను తగ్గిస్తామని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ పేర్కొన్న నేపథ్యంలో ఆ దిశగా ఉమ్మడి నల్గొండ జిల్లా కార్యాలయాల్లో పకడ్బందీగా అమలు చేస్తే అక్రమ వసూళ్లు నిలిచే అవకాశం ఉంటుంది.

### ఫైళ్ల తరలింపు...

అధికారులు ఆఘమేఘాలపై చెక్ పోస్ట్ ల వద్ద కార్యకలాపాలు నిలిపివేశారు. బోర్డులు, బారికేడ్లు తొలగించారు. చెక్ పోస్ట్ లను ఎత్తివేసినట్లు బ్యానర్ ఏర్పాటు చేశారు. కంప్యూటర్లు, రశీదులు, ఆర్థిక పరిపరమైన రికార్డులను డిప్యూటీ ట్రాన్స్పోర్ట్ కార్యాలయాని (డీటీసీ)కి తరలించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని మూడు చెక్ పోస్ట్ లలో మొత్తం 13 మంది సిబ్బంది ఇంతకాలం పని చేశారు. వారిలో 3 గురు ఎంవీఐలు, 6గురు ఏఎంవీఐలు, కానిస్టేబులు, హోంగార్డులు కలిపి నలుగురు పని చేస్తున్నారు. వీరు షిఫ్టుల్లో విధులు నిర్వహించేవారు. వీరిని డీటీసీకి రిపోర్టు చేయాలని ఆదేశించారు. ఇక నుంచి వీరికి ఇతర బాధ్యతలు అప్పగించనున్నారు. కాగా రవాణా శాఖ అధికారులు చెప్పిన లెక్కల ప్రకారం అధికారికంగా వాడపల్లి చెక్ పోస్ట్ లో నిత్యం సుమారు 2.4 లక్షల నుండి 2.6 లక్షల వరకు ఆదాయం, అదేవిధంగా నాగార్జునసాగర్ చెక్ పోస్ట్ వద్ద 20 నుంచి 30 వేల ఆదాయం, కోదాడ చెక్ పోస్ట్ వద్ద 1.4 లక్షల నుండి 1.6 లక్షల ఆదాయం నిత్యం వచ్చేది.

### ఆన్లైన్లో సేవలు..

రాష్ట్ర ప్రభుత్వం నుండి పూర్తిస్థాయి మార్గదర్శకాలు రాకుండా చెక్ పోస్ట్ ల ద్వారా అందించిన సేవలను ఇకపై ద్వారా పొందవచ్చు. ఆన్లైన్ సర్వీసెస్ అనే ఆప్షన్ ద్వారా టెంపరరీ పర్మిట్, వాలంటరీ టాక్స్, స్పెషల్ పర్మిట్ వంటి సేవలు లభ్యంకానున్నాయి.

### కమిషనర్ ఆదేశాల మేరకు... వాణి (డిటిసి నల్గొండ)

రాష్ట్ర రవాణా శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని మూడు చెక్ పోస్ట్ లను బుధవారం సాయంత్రం 5 గంటలకు తొలగించాం. ఇకపై ఇక్కడ రవాణా శాఖ సిబ్బంది ఎవరూ పనిచేయరు. ఇంకా పూర్తిస్థాయి మార్గదర్శకాలు రాలేదు. చెక్ పోస్ట్ లను మాత్రమే ఎత్తివేయమని చెప్పారు. ఏ నిర్ణయమైనా ప్రభుత్వ ఆదేశాల మేరకే ఉంటుంది. ఆర్టిఏ కార్యాలయలలో కూడా అవినీతికి తావు లేకుండా సేవలను అందిస్తున్నాం. ఏజెంట్లకు కార్యాలయలలోనికి అనుమతి ఉండదు.

హైదరాబాద్
శుక్రవారం,
24 అక్టోబర్ 2025

అక్షరకలం
తెలుగు దినపత్రిక

సినిమా
CINEMA



## సమంత ఎమోషనల్ కామెంట్స్ ..

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత రూత్ ప్రభు గురించి ప్రత్యేకంగా పరిచయం అవసరం లేదు. తన అందం, నటన, కష్టపడి పనిచేసే ధోరణితో స్టార్ హీరోయిన్లలో అగ్రస్థానంలో నిలిచిన ఈ బ్యూటీ ప్రొఫెషనల్ లైఫ్‌లో ఎంత సక్సెస్ సాధించిందో, పర్సనల్ లైఫ్‌లో మాత్రం అంతగా అదృష్టం కలసిరాలేదు. నాగ చైతన్యతో విడాకులు తీసుకున్న తర్వాత సమంత ప్రస్తుతం ఒంటరిగా జీవిస్తోంది. కొంతకాలం ఆమె మయోసైటిస్ అనే అరుదైన వ్యాధితో బాధపడింది. ఆ సమస్య నుంచి కోలుకున్న సమంత మళ్లీ సినిమాలపై దృష్టి సారిస్తోంది.ఇటీవల ఆమె ఓ ఇంటర్వ్యూలో పాల్గొని తన వ్యక్తిగత జీవితంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. ఆ వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. సమంత మాట్లాడుతూ.. నా కెరీర్‌లో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్నాను. నన్ను ద్వేషించే వాళ్లు నా దుస్థితిని చూసి నవ్వుకున్నారు. నాకు మయోసైటిస్ వచ్చినప్పుడు కూడా కొంతమంది ఎగతాళి చేశారు. ఇంకా నా విడాకుల సమయంలో వారు సంబరాలు చేసుకున్నారు. నా జీవితంపై వ్యాఖ్యానిస్తూ, నా భవిష్యత్తు గురించి నిర్ణయాలు తీసుకున్నట్టుగా మాట్లాడారు. అవన్నీ చూసి చాలా బాధపడ్డాను. కానీ తర్వాత నుంచి ఎవరి గురించి పట్టించుకోవడం మానేశాను అని సమంత ఎమోషనల్‌గా చెప్పింది.ఈ కామెంట్స్ నెట్‌లో వైరల్ అవుతున్నాయి. అభిమానులు ఆమె ధైర్యం, బలమైన మనసుకు ప్రశంసలు కురిపిస్తున్నారు. చాలామంది "సమంత నిజమైన ఫైటర్", "ఆమెను కిందపడేయాలని చూసిన వాళ్లందరికీ ఇదే సమాధానం" అంటూ సపోర్ట్ చేస్తున్నారు.



## అందుకే ఆ సినిమా ఒప్పుకున్నా..

జయాపజయాల సంగతి అటుంచితే.. మంచి నటిగా మాత్రం గుర్తింపు తెచ్చుకుంది శ్రీదేవి ముద్దుల తనయ జాన్వీ కపూర్. ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన అతికొద్ది సమయంలోనే తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపును తెచ్చుకున్నది ఈ భామ. ఈ మధ్యకాలంలో విడుదలైన పరమ్ సుందరి, సన్నీ సంస్కారీ కీ తులసీ కుమారి సినిమాలు అనుకున్నంతగా ఆడకపోయినా.. జాన్వీకి మాత్రం మంచి పేరే తెచ్చిపెట్టాయి. రీసెంట్‌గా కరణ్ జోహార్ నిర్మిస్తున్న ఓ యాక్షన్ డ్రామాలో నటించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసింది జాన్వీ. టైగర్ ష్రాఫ్, లక్ష్య ప్రధాన పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రంలో నటించేందుకు తానెందుకు ఒప్పుకున్నానో తెలుపుతూ 'కేవలం రొమాంటిక్ పాత్రలే కాదు, ఏ జానర్ సినిమాలైనా చేయగలనని నిరూపించుకోడానికే ఈ సినిమాకు సైన్ చేశాను. ఇది యాక్షన్, రివెంజ్, ఇంటెన్స్ డ్రామా. ఇందులో నాది స్ట్రాంగ్ క్యారెక్టర్. ఎనర్జీ, ఎమోషన్, మరింత బలంగా చూపించే అవకాశం ఈ పాత్రలో ఉన్నది' అని జాన్వీ తెలిపింది.




## సూపర్ డూపర్ హిట్ సాంగ్

హీరో రవితేజ 'మాస్ జాతర' చిత్రంతో ఈ నెల 31న ప్రేక్షకుల్ని పలకరించబోతున్నారు. భాను భోగవరపు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మిస్తున్నారు. విడుదల తేదీ దగ్గరపడుతుండటంతో మ్యూజికల్ ప్రమోషన్స్‌లో వేగం పెంచారు. ఇప్పటికే మూడు పాటల్ని విడు దల చేసిన చిత్రబృందం బుధవారం 'సూపర్‌డూపర్' అంటూ సాగే నాలుగో పాటను ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చింది. భీమ్స్ సిసిరోలియో స్వరపరచిన ఈ పాటను సురేష్ గంగుల రచించారు. భీమ్స్‌తో కలిసి రోహిణి సోరట్ ఆలపించారు. మాస్‌ను మెప్పించేలా హుషారెత్తించే బీట్‌తో ఈ పాట సాగింది. నాయకానాయికలు రవితేజ, శ్రీలీల తమదైన డ్యాన్స్ మూమెంట్స్‌తో ఆకట్టుకున్నారు. వినోదప్రధానంగా సాగే మాస్ ఎంటర్‌టైనర్ ఇదని, రవితేజ పాత్ర నవ్వుపంథాలో సాగుతుందని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: భీమ్స్ సిసిరోలియో, మాటలు: నందు సవిరిగాన, నిర్మాణ సంస్థ: సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్, దర్శకత్వం: భాను భోగవరపు.



## సినిమా నేపథ్య పీరియాడికల్ డ్రామా

మలయాళ అగ్రనటుడు దుల్కర్ సల్మాన్ కథానాయకుడిగా రూపొందుతున్న బైలింగ్వల్ పీరియాడికల్ డ్రామా 'కాంత'. 1950ల నాటి మద్రాస్.. సినిమా స్వర్ణయుగం నేపథ్యంలో రూపొందిన ఈ చిత్రానికి సెల్వమణి సెల్వరాజ్ దర్శకుడు. భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. సముద్రఖని కీలక పాత్రధారి. నవంబర్ 14న సినిమా విడుదల కానున్నది.ఈ సందర్భంగా ఈ సినిమా నుంచి 'అమ్మడివే..' అంటూ సాగే ఓ క్లాసిక్ రొమాంటిక్ గీతాన్ని మేకర్స్ విడుదల చేశారు. కృష్ణకాంత్ సాహిత్యం అందించిన ఈ గీతాన్ని ఝాను చందర్ స్వరపరిచగా, ప్రదీప్ కుమార్ ఆలపించారు. నాయకానాయికల కెమిస్ట్రీని, వింటేజ్ లవ్‌స్టోరీని ఈ పాట అద్భుతంగా ప్రజెంట్ చేస్తోందని మేకర్స్ తెలిపారు. దుల్కర్ సల్మాన్, రానా దగ్గుబాటి, ప్రశాంత్ పొట్లూరి, జోమ్ వర్గీస్ కలిసి నిర్మిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: డానీ సాంచెజ్ లోపెజ్, నిర్మాణం: స్పిరిట్ మిడియా ప్రై.లిమిటెడ్, వేఫేరర్ ఫిల్మ్స్ ప్రై.లిమిటెడ్.



## నాన్నలాగే సినిమా కోసం కష్టపడ్డాను

' 'బైసన్' నాకెంతో ప్రత్యేకమైన సినిమా. మా నాన్న విక్రమ్ నేపథ్యం లేకుండా వచ్చి, కష్టపడి ఈ స్థాయికి ఎదిగారు. కానీ నేను అలా కాదు. విక్రమ్ కొడుకుగా నాకు అన్నీ సులభంగా అందాయి. కానీ ఆయనలా అందరి ప్రేమను సంపాదించడం తేలిక్కాదు. ఆ ప్రయత్నంలో భాగమే 'బైసన్'. నాన్నగారి లాగే కష్టపడి వందశాతం ఎఫర్ట్ పెట్టి ఈ సినిమా చేశాను. అర్జున్ అవార్డు గ్రహీత మణతి గణేశన్ కథ ఆధారంగా దర్శకుడు మారి సెల్వరాజ్ తెరకెక్కించిన సినిమా ఇది. తెలుగులో ఈ సినిమాను అందరూ చూడాలని కోరుకుంటున్నా.' అని హీరో ధృవ్ విక్రమ్ అన్నారు. ఆయన హీరోగా రూపొందిన తమిళ చిత్రం 'బైసన్' అదే పేరుతో తెలుగులో విడుదల కానున్నది. అనుపమ పరమేశ్వరన్ కథానాయిక. మారి సెల్వరాజ్ దర్శకుడు. సమీర్ నాయర్, దీపక్ సెగల్, పా.రంజిత్ అదితి ఆనంద్ నిర్మాతలు. జగదంబే ఫిల్మ్స్‌వారు ఈ సినిమాను తెలుగులో విడుదల చేస్తున్నారు. ఈ నెల 24న సినిమా విడుదల కానున్నది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన ప్రెస్‌మీట్‌లో ధృవ్ విక్రమ్ మాట్లాడారు. ధృవ్‌తో నటించడం ఆనందంగా ఉందని, తమిళంలో మంచి విజయం సాధించిన ఈ సినిమా తెలుగు ప్రేక్షకులకు కూడా నచ్చుతుందని నటి అనుపమ మరమేశ్వరన్ చెప్పారు.



# జిల్లా పోలీసు అధికారులతో నేర సమీక్షా సమావేశం

### నేరాల అదుపునకు ప్రత్యేక దృష్టి సారించాలి

### జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ ఐపీఎస్ :

### -పెండింగ్ కేసుల సంఖ్య తగ్గించేలా చర్యలు తీసుకోవాలని సూచన






**నల్లగొండ /అక్షర కలం :**

జిల్లాలో నేరాలపై ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు వాటిని అదుపు చేయడానికి మరింత సమర్ధవంతమైన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పి గారు పోలీసు అధికారులకు సూచించారు.జిల్లా పోలీసు కార్యాలయం పోలీసు అధికారులతో నిర్వహించిన నెల వారి నేర సమీక్షా సమావేశంలో జిల్లాలో నేరాల నియంత్రించడానికి తీసుకుంటున్న చర్యలు, పెండింగులో ఉన్న కేసుల వివరాలు, కేసుల పరిష్కారానికి అధికారులు చూపిస్తున్న చొరవ, నేరాలకు పాల్పడిన నేరస్తులకు కోర్టులో శిక్షలు పడే విధంగా తీసుకుంటున్న ముందస్తు చర్యలను జిల్లా ఎస్పీ గారు అదికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ గారు మాట్లాడుతూ.. ప్రజా అవసరాలకు అనుగుణంగా పోలీసు శాఖ పారదర్శకంగా సేవలందిస్తూ ప్రజా మన్ననలు పొందేలా ముందుకు సాగాలన్నారు. పెరిగిపోతున్న వ్యవస్థీకృత నేరాలపై ప్రత్యేక దృష్టి సారించి వాటి నియంత్రణ కోసం అన్ని రకాల చర్యలు తీసుకుంటూ శాంతి భద్రతల పరిరక్షణలో రాజీ లేకుండా పని చేయాలన్నారు. ముఖ్యంగా నిఘా వ్యవస్థకు ప్రధాన సంపత్తిగా మారిన సిసిటీవీల వల్ల భద్రతా ప్రమాణాలు పెరుగుతున్న క్రమంలో నేను సైతం, కమ్యూనిటీ పోలీసింగ్ లో సిసి కెమెరాల ఏర్పాటును మరింత ప్రోత్సహించే విధంగా అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు. నేరం చేసే వాడికి శిక్ష పడాలి, నేరం చేయని వారికి రక్షణగా ఉంటూ,సమర్ధ సేవలు ప్రజలకు అందాలన్న సంకల్పంతో పోలీస్ శాఖ లక్ష్యంగా పనిచేయాలని అన్నారు. అదే విధంగా మహిళల భద్రతకు మరింత భరోసా కల్పిస్తూ వారి రక్షణ ప్రధాన ధ్యేయంగా నాణ్యమైన, సత్వర సేవలు అందించాన్నారు. అండర్ ఇన్వెస్టిగేషన్ లో పోక్సో, గ్రేవ్, నాన్ గ్రేవ్, %ూజ/ూ% కేసుల్లో విచారణ వేగవంతంగా పూర్తి చేసి కోర్ట్ లో ఛార్జ్ సీట్ దాఖలు చేయాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం అవసరమైన అన్ని రకాల రోడ్డు భద్రత ప్రమాణాలు పాటించడం, అన్ని ప్రాంతాలలో ట్రాఫిక్ సమస్యలను అధిగమించేందుకు సంబంధిత శాఖలు, ప్రజలను సమన్వయం చేస్తూ వాటిని అధిగమించేలా ముందుకు సాగాలన్నారు.జిల్లాలో దొంగతనాలు నివారణకు రాత్రి,పగలు పెట్రోలింగ్ నిర్వహించే సమయంలో అప్రమత్తంగా ఉండాలని అన్నారు.రౌడీ షీట్స్, సస్పెక్ట్స్, పాత నేరస్థుల పై నిఘా ఏర్పాటు చేయాలని తెలిపారు. సైబర్ నేరాల ఆన్ లైన్ బెట్టింగ్, లోన్ యాప్ ల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు.జిల్లాలో అసాంఘిక కార్యక్రమాలు అక్రమ గంజాయి,జూదం,పీడీఎస్ బియ్యం,అక్రమ ఇసుక రవాణా వంటి వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ రమేష్, నల్లగొండ డిఎస్పి, శివరాం రెడ్డి, మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర రాజు, డిసిఆర్బి, డిఎస్పీ రవి, సీఐలు, పాల్గొన్నారు.

# జిల్లా పోలీసు కార్యాలయంలో ఓపెన్ హౌజ్

### రేపు జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించే

### రక్త దాన కార్యక్రమానికి యువత,జిల్లా ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలి జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ ఐపీఎస్





**నల్లగొండ /అక్షర కలం :**

ఈ నెల అక్టోబర్ 21 నుంచి 31 వరకు నిర్వహించే పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో బాగంగా నేడు అమరవీరుల త్యాగాలను, స్మరిస్తూ జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ ఐపీఎస్ గారు ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింది.ఈ కార్యక్రమానికి వివిధ పాఠశాలల విద్యార్దిని, విద్యార్థులకు పోలీస్ సిబ్బంది నిర్వహించే విధులు,విది నిర్వహణలో సంఘవిద్రోహక శక్తులు ఎదురైనప్పుడు ఉపయోగించే ఆయుధాలు, విఐపిల పర్యటన సమయంలో వారి భద్రతా రిత్యా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా బాంబ్ డిటెక్టర్ పరికరాలు, పోలీస్ డాగ్స్ వాటి పనీతీరును, నేరాలు,దొంగతనాలు జరిగినప్పుడు నిందితులను కనిపెట్టే విషయంలో కావలిసిన క్లూస్ ఫింగర్ ప్రింట్, క్లూస్ టీమ్, మహిళ భద్రత పైన షీటీమ్, భరోసా, కమాండ్ కంట్రోల్ రూమ్ సీసీ కెమెరాలు, గంజాయి ఇతర మత్తు పదార్థాలకు సంబంధించిన టెస్టింగ్ కిట్ లతో తదితర స్టాల్స్ ఏర్పాటు చేసి సంబంధిత అధికారులు,సిబ్బంది విద్యార్దిని,విద్యార్థులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులతో జిల్లా ఎస్పి గారు మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో ఎక్కువగా ప్రతి రోజు ఎక్కడో ఒక చోట సైబర్ నేరాల జరుగుతున్నాయని,వాటి వలలో పడకుండా అనవసరమైన యాప్ లను డౌన్లోడ్ చేసుకోవద్దని మరియు ఎవ్వరికీ కూడా ఓ.టి.పిలు చెప్పకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. అలాగే గంజాయి డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాల సేవించడం వల్ల కలిగే ఆరోగ్య సమస్యలు భవిష్యత్తులో జరిగే పరిణామాల పై వివరించారు. సోషల్ మీడియా ఇంస్టాగ్రామ్, ఫేస్బుక్ లలో అవసరమైన వీడియోలు చూస్తూ సమయాన్ని వృధా చేసుకోకుండా, చదువుల మీద శ్రద్ధచూపి అనుకున్న లక్ష్యాలను సాధించాలని అన్నారు.అలాగే రేపు జిల్లా పోలీసు కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేస్తున్న రక్తదాన కార్యక్రమానికి జిల్లా ప్రజలు, యువత, యువజన సంఘాలు, విద్యార్థి సంఘాల వారు అమరవీరుల త్యాగాలను గుర్తు చేసుకుంటూ అధిక సంఖ్యలో పాల్గొనగలరని ఈ సందర్భంగా ఎస్పీ గారు పిలుపునిచ్చారు.. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రమేష్, నల్లగొండ డీఎస్పీ శివరాం రెడ్డి,ఏ.ఆర్ డి.యస్.పి శ్రీనివాస్, సిఐలు రాఘవరావు, రాము, మహా లక్ష్మయ్య, కరుణాకర్, రాజశేఖర్ రెడ్డి,ఆర్.ఐ లు,సంతోష్,శ్రీను,సూరప్ప నాయుడు,ఆర్.యస్.ఐ లు కళ్యాణ్ రాజ్, రాజీవ్,సాయిరాం, సంతోష్, అశోక్,శ్రావణి,మమత,సిబ్బంది, విద్యార్దిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# 152 /16 సర్వే నెంబరు గల భూమి ని కబ్జాచేసిన వారిపై చర్యలు తీసుకోవాలి. కుభం యాదగిరి గౌడ్.



**అక్షర కలం, కొండమల్లేపల్లి.**

కొండమల్లేపల్లి మండలంలోని కోల్మంతల్ పహాడ్ గ్రామపంచాయతీ శివారులో దేవరకొండ రోడ్డు నందు విలేకర్ కాలనీ పక్కన నిర్మించిన వెంచర్ను కొంతమంది వ్యక్తులు దేవరకొండ డివిజన్ స్థాయి నాయకులతో చేతులు కలిపి, అధికారుల అండదండలతో జాతీయ రహదారి 167 ఆనుకొని ఉన్న కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమిని కబ్జా చేసి వెంచర్ చేసిన పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. తహసిల్దార్ కార్యాలయం కు సమీపంలో ఉన్న కొంతమంది వ్యక్తులు కుమ్మక్కై వెంచర్ చేసినప్పటికీ అధికారులకు కనబడటం లేదని గ్రామ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కొండమల్లేపల్లి మండలం ఏర్పడి దాదాపు పది సంవత్సరాలు గడుస్తున్న ప్రభుత్వ కార్యాలయాలు అన్ని అద్దె గదిలోనే నడుస్తున్నాయి. జాతీయ రహదారి ఆనుకుని ఉన్న ఈ ప్రభుత్వ భూమిని అధికారులు పట్టించుకోని ఈ భూమిని స్వాధీనపరచుకుంటే అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు కట్టడానికి అవకాశం ఉంటుంది. అంతేకాకుండా ఈ వెంచర్ చేసేటప్పుడు లోతుగా మట్టి పోయడంతో పక్క కాలనీ మెగాసిటీ మొత్తం గుంత ల మయంగా మారిపోవడంతో వర్షం వచ్చినప్పుడు నీరు బయటికి వెళ్లక అక్కడే నిల్వ ఉండడం వలన ఆ కాలనీవాసులు ఇబ్బందుల ఎదుర్కొంటున్నారు. ఈ విషయంపై కాలనీవాసులు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాటికి మరియు స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేసిన పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ఇటీవల ఇదే విషయంపై కలెక్టర్ స్పందించి తాసిల్దార్ కార్యాలయం ఎమ్మార్వో నరేందర్ కు సర్వే చేసి వివరాలు తెలియజేయాలని చెప్పినప్పటికీ ఎలాంటి చలనం లేదు. కావాలనే రియల్ ఎస్టేట్ వ్యాపారికి అధికారులు వత్తాసు పలుకుతూ నాయకుల అండదండలతో ఆ ప్రభుత్వ భూమిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో అధికారుల నిర్లక్ష్యంపై పలు అనుమానాలకు దారితీస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న ప్రభుత్వ భూమిని స్వాధీన పరుచుకొని ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు అయ్యేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



**ప్రభుత్వ భూమిని స్వాధీనం పరుచుకోవాలి**

**కుంభం యాదగిరి గౌడ్ కొండమల్లేపల్లి**

జాతీయ రహదారి 167 కు ఆనుకొని ఉన్న ప్రభుత్వ భూమిని స్వాధీన పరచుకోవాలి. కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపార వ్యక్తులు ముఠాగా ఏర్పడి కోట్లలో విలువ చేసే భూమిని కాజేసి వెంచర్ చేశారు. దీనిపై అధికారులు స్పందించి ప్రభుత్వ భూమిని స్వాధీన పరచుకోకపోతే గ్రామ ప్రజలం అందరం కలిసి తాసిల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తాం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రభుత్వ భూమిని స్వాధీనపరచుకోవాలని కోరుతున్నాం.

# పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య

**చిట్యాల (అక్టోబర్ 23) అక్షర కలం,వీ ప్రతినిధి**



నల్గొండ జిల్లా చిట్యాల మండలం చిన్నకాపర్తి గ్రామానికి చెందిన రుద్రవరపు చందు అనే యువకుడు పురుగుల మందు తాగి మరణించాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రుద్రవరం చందు (25) వృత్తిరీత్యా చిట్యాలలో ట్రాక్టర్ మెకానిక్ గా పనిచేస్తున్నాడు. ఈ మధ్యకాలంలో తరచూ ఇంటికి రాత్రి సమయంలో ఆలస్యంగా ఇంటికి వస్తున్నాడని , తిండి కూడా తినకుండా ఎందుకు లేటుగా వస్తున్నావని తల్లిదండ్రులు మందలించగా మనస్థాపాని గురైన చందు ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటికి వెళ్లి పురుగుల మందు తాగి పెద్ద కాపర్తి సబ్ స్టేషన్ వద్ద పడి ఉన్నట్లుగా సమాచారం రాగానే వెంటనే చికిత్స నిమిత్తం నార్కట్ పల్లి కామినేని ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. గురువారం రోజున చికిత్స పొందుతూ మధ్యాహ్నం ఒంటిగంటకు చనిపోయాడని మృతిని తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మామిడి రవికుమార్ తెలిపారు.

# పోలీసు అమరవీరుల స్ఫూర్తితో మందమర్రిలో ఓపెన్ హౌస్ నిర్వహణ

**మందమర్రి/ చెన్నూరు అక్టోబర్ 23 అక్షర కలం ప్రతినిధి:-**



పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం (పోలీస్ ఫ్లాగ్ డే) వారోత్సవాలను పురస్కరించుకొని, మందమర్రి పోలీస్ స్టేషన్ ఆవరణలో గురువారం పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు, మందమర్రి ఎస్సై రాజశేఖర్ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ పాఠశాల (ఫిల్టర్ బెడ్ ఏరియా) విద్యార్థినీ, విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరై పోలీసుల విధులను దగ్గర నుంచి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై రాజశేఖర్ మాట్లాడుతూ.. శాంతి భద్రతల పరిరక్షణలో అమరులైన పోలీసుల త్యాగాలు, సేవలు భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని, చట్టాన్ని గౌరవించడం, ట్రాఫిక్ నియమాలు పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని సూచించారు. విద్యార్థులకు ప్రస్తుత సమాజంలో కీలకంగా మారిన పలు అంశాలపై పోలీసులు సమగ్ర అవగాహన సైబర్ నేరాలు, సైబర్ నేరాల తీరు, మోసగాళ్ల వలలో పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అలాగే ఫిర్యాదు చేసేందుకు ఉన్న1930 నంబరు గురించి, గంజాయి, డ్రగ్స్‌పై ఇతర మాదక ద్రవ్యాల వాడకం వల్ల కలిగే అనర్థాలు, భయంకరమైన పరిణామాలపై హెచ్చరించి, వాటికి దూరంగా ఉండాలని సూచించారు. మహిళా రక్షణ బాలికల రక్షణ కోసం ఏర్పాటు చేసిన భరోసా కేంద్రం సేవలు, షీ టీమ్ పనితీరు పోలీసు విభాగాలు, పోలీసు విధులు, ప్రజల రక్షణలో పోలీసుల సేవలు, యాంటీ నార్కోటిక్ డ్రగ్స్ వంటి విభాగాల బాధ్యతలను క్లుప్తంగా తెలిపారు.

**సాంకేతిక పరికరాల ప్రదర్శన**

ఓపెన్‌హౌస్‌లో భాగంగా, విద్యార్థులకు పోలీసు వ్యవస్థ పనితీరును ప్రత్యక్షంగా పరిచయం చేశారు. స్టేషన్‌లో పనిచేసే సిబ్బంది విధులు, బాధితులు ఫిర్యాదు ఇచ్చే విధానం, దానిపై విచారణ జరిగే పద్ధతిని, పోలీసులు వినియోగించే సాంకేతిక పరికరాలైన సీసీ కెమెరాల ప్రాధాన్యం, ఫింగర్ ప్రింట్ డివైస్, ట్రాఫిక్ ఎక్విప్‌మెంట్, ముఖ్యంగా డయల్ 100 విధానం గురించి క్లుప్తంగా వివరించి, కాల్ చేసిన వెంటనే పోలీసులు ఎలా స్పందిస్తారో తెలిపారు. అనంతరం ఆయుధాల వినియోగాన్ని ప్రదర్శించి, విద్యార్థుల ప్రశ్నలకు అధికారులు సమాధానాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై మాజీద్ ఖాన్, మిలింద్ కుమార్, ఇతర పోలీస్ సిబ్బంది, పాఠశాల అధ్యాపక బృందం పాల్గొన్నారు.

# నిరుద్యోగ యువతకు వరం మెగా జాబ్ మేళా

**జాబ్ మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలి**

**ఏరియా జిఎం ఎన్ రాధాకృష్ణ**

**బెల్లంపల్లి మెగా జాబ్ మేళా పోస్టర్ విడుదల**

**అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 23:**



నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్న ప్రభుత్వ నిర్ణయానికి అనుగుణంగా జిల్లాలోని బెల్లంపల్లి పట్టణంలో సుమారు 80కి పైగా ప్రైవేట్ కంపెనీలతో మెగా జాబ్ మేళాను అక్టోబర్ 26న ఆదివారం నిర్వహిస్తున్నామని దీనిని స్థానిక నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని సింగరేణి మందమర్రి ఏరియా జిఎం ఎన్ రాధాకృష్ణ తెలిపారు. జిల్లాలోని బెల్లంపల్లి పట్టణంలో గల ఏఎంసీ మైదానంలో గురువారం జాబ్ మేళా ప్రచార పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా జిఎం రాధాకృష్ణ మాట్లాడుతూ, బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్, సింగరేణి యాజమాన్యం, నోబెల్ ఎంపవర్మెంట్ వారిచే సంయుక్తంగా అక్టోబర్ 26న జిల్లాలోని బెల్లంపల్లి ఏఎంసీ మైదానంలో మెగా జాబ్ మేళాను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. జాబ్ మేళాలో పాల్గొనదలచిన నిరుద్యోగ యువత పోస్టర్ లో ఉన్న క్యూఆర్ కోడ్ ని స్కాన్ చేసి, పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ మెగా జాబ్ మేళాలో నిరుద్యోగులు వారికి గల విద్యార్హతలకు సంబంధించిన ఉద్యోగాలు ఎంచుకునే అవకాశం కల్పిస్తున్నామని, దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఎస్ఓటు జిఎం విజయ్ ప్రసాద్, గుర్తింపు కార్మిక సంఘం ఏఐటియుసి బెల్లంపల్లి బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేష్, ఏరియా పర్సనల్ మేనేజర్ ఎస్ శ్యాంసుందర్, సీఎంఓఏఐ ఏరియా అధ్యక్షుడు రమేష్, సివిల్ ఎస్ఈ రాము, జివిటిసి మేనేజర్ శంకర్, ఏఐటీయూసీ సీనియర్ నాయకులు చిప్ప నరసయ్య, ఏఐటీయూసీ మందమర్రి బ్రాంచ్ కార్యదర్శి శైలేంద్ర సత్యనారాయణ, నోబెల్ ఎంపవర్మెంట్ స్టేట్ మేనేజర్ గోగర్ల శోభన్ బాబు, సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

# అమరవీరుల త్యాగాలు స్ఫూర్తిదాయకం:

**- మరికల్ సీఐ రాజేందర్ రెడ్డి**

**- జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఆదేశాల మేరకు.**

అక్షర కలం / నారాయణపేట జిల్లా ప్రతినిధి : అక్టోబర్ – 23.

పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా మరికల్/ ధన్వాడ పోలీస్ స్టేషన్లో విద్యార్థులకు ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా పోలీస్ స్టేషన్ల లో విద్యార్థులకు ఓపెన్ హౌస్ కార్యక్రమంను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పాఠశాల విద్యార్థులకు సిఐ రాజేందర్ రెడ్డి, మరికల్ ఎస్సై రాములు, ధన్వాడలో ధన్వాడ పోలీసులు విద్యార్థులకు పోలీస్ స్టేషన్‌లోని విభాగాలు, పోలీసుల విధులు, పోలీసుల పనితీరు, నేరాల పరిశోధన విధానం, ఆయుధాలు, కమ్యూనికేషన్ పరికరాల గురించి, లాకప్, సీసీ కెమెరాలు, అత్యవసర సమయంలో డయల్ 100 సేవల గురించి ప్రత్యక్షంగా వివరించారు. ఈ సందర్భంగా సిఐ రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ ు "పోలీసు అమరవీరులు దేశ భద్రత కోసం ప్రాణత్యాగం చేసిన వీరుల త్యాగాలను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి కర్తవ్యమని" పేర్కొన్నారు. విద్యార్థులు భవిష్యత్తులో చట్టం, క్రమశిక్షణను పాటించే పౌరులుగా ఎదగాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది విద్యార్థులకు ట్రాఫిక్ రూల్స్, సైబర్ సేఫ్టీ, మహిళా భద్రతపై అవగాహన కల్పించారు. విద్యార్థులు పోలీస్ డిపార్ట్‌మెంట్ కార్యకలాపాలపై ఆసక్తి చూపుతూ ప్రశ్నలు అడిగారు ఈ కార్యక్రమంలో పోలీసులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# మత్స్యకారులను క్షేమంగా తీసుకువస్తాం

**బాధిత కుటుంబాలకు పూర్తి భరోసా**

**కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు**

**విజయనగరం,**

బంగ్లాదేశ్ నేవీ సిబ్బందికి పట్టుబడిన ఎనిమిది మంది జిల్లా మత్స్యకారుల ఘటనపై కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు గురువారం ప్రకటన విడుదల చేశారు. బాధిత కుటుంబాలకు పూర్తి భరోసా కల్పిస్తున్నామని పేర్కొన్నారు. జిల్లాకు చెందిన మత్స్యకారులను క్షేమంగా తీసుకువస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే విదేశాంగ శాఖ మంత్రితో సంప్రదింపులు జరిపామని పేర్కొన్నారు. బంగ్లాదేశ్ ఎంబసీతో నిరంతర సంప్రదింపులు, నిశిత పరిశీలన చేస్తున్నామని తెలిపారు. సముద్ర భద్రత, చట్టం, రక్షణ వ్యవహారాలు చూసే కోస్ట్ గార్డ్ వ్యవస్థతో ఈ సమస్యపై మాట్లాడామని రామ్మోహన్ నాయుడు లేఖలో వివరించారు. బంగ్లాదేశ్ కోస్టు గార్డుల చెరలో విజయనగరం జిల్లాకు చెందిన 8 మంది మత్స్యకారులు చిక్కుకున్నారు. పూసపాటిరేగ మండలం తిప్పలవలస, భోగాపురం మండలంలోని కొండ్రాజుపాలెం గ్రామాలకు చెందిన వీరు బ్రతుకుదెరువు కోసం వైజాగ్ కు వలస వెళ్లారు. సముద్రంలో చేపల వేట కొనసాగిస్తూ అక్కడే జీవనం సాగిస్తున్నారు. ఈ నెల 13న విశాఖ చేపలరేవు నుంచి మరబోటుపై సముద్రంలోకి వేటకు వెళ్లారు. ఈ నెల 14న అర్ధరాత్రి 2 గంటల సమయంలో వారు దారితప్పి బంగ్లాదేశ్ కోస్టు గార్డ్ పరిధిలోకి ప్రవేశించారు.

# కల్చరల్ సెక్రెటరీగా సాల్మన్ రాజ్ ఏకగ్రీవ ఎన్నిక...



**మెదక్, అక్టోబర్ 23( అక్షర కలం ):-**

మాక్లూర్ డిచ్పల్లి మండలంలోని సీఎంసీలో 38వ గోదావరి డిస్ట్రిక్ చర్చి కౌన్సిల్ ఎన్నికలు ఈనెల అక్టోబర్ 21 తేదీన జరిగాయి. ఇందులో మండలంలోని గద్వా ల్ క్యాంప్ చర్చి, నిజా మాబాద్ రూరల్ మండలంలోని పాల్టా సీఎస్ ఐ వెస్లీ చర్చి పాస్టర్ గా వి ధులు నిర్వహిస్తున్న సాల్మన్ రాజ్ కల్చరల్ సెక్రెటరీగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యా రు. సాల్మన్ రాజ్ గతంలో మెదక్ జిల్లా కొల్చారం మండలం కోనాపూర్ గ్రామం సిఎస్ఐ చర్చిలో గత కొన్ని సంవత్సరాలు పనిచేశారు. తన మూడేళ్ల పదవీకా లంలో సేవ కార్యక్రమాలను వేగవంతం చేస్తానని సాల్మన్ రాజ్ తెలిపారు.

# పత్తి రైతులకు అవగాహన కల్పించిన.. వ్యవసాయ అధికారి రోజా..



**కొల్చారం, అక్టోబర్ 23 (అక్షర కలం ):-**

కొల్చారం మండలం పైతర గ్రామంలో గురువారం పత్తి రైతులకు కిసాన్ కాపాస్ అప్ గురించి అవగాహన కల్పించడం జరిగింది.పత్తి పండించిన రైతులు తమ యొక్క పత్తిని సీసీఐ కు మద్దతు ధరకు అమ్మాలంటే ముందుగా ప్రతి రైతు వ్యక్తిగతంగా "కపాస్ కిసాన్" అనే మొబైల్ యాప్ ను ప్లే స్టోర్ నుండి డౌన్లోడ్ చేసుకుని తమ యొక్క మొబైల్ నెంబర్ తో లాగిన్ అయ్యి, స్లాట్ బుక్ చేసుకుని, స్లాట్ బుక్ అయిన తేదీకి మరియు మిల్లుకు పత్తిని తీసుకుని వెళ్లగలరు. స్లాట్ బుక్ చేసుకోకుండా వెళ్తే పత్తి కొనుగోలు చేయుటకు అవకాశం లేదు. పత్తి వేసిన రైతుల ఫోన్ నెంబర్ యాక్టివేషన్ లేనివారు ఫోన్ నెంబర్ అప్డేట్ చేసుకోవడం కోసం మీ సంబంధిత క్లస్టర్ వ్యవసాయ విస్తీర్ణ అధికారుల దగ్గరికి వెళ్లి చేయించుకోగలరు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారిణి రోజా పాల్గొన్నారు.

# బాధితులకు పరిహారం చెక్కు అందజేత

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 23:**

జిల్లాలోని మంచిర్యాల పట్టణ పరిధిలో గల జాఫర్ నగర్ లో విద్యుత్ ప్రమాదంలో ఇంటిని కోల్పోయిన బాధితులకు పరిహారం చెక్కు అందజేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. గురువారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్ లో విద్యుత్ ప్రమాదంలో ఇంటిని కోల్పోయిన బాధితులు చిట్టోజు శరణ్య కు 36 వేల రూపాయల పరిహారం చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, మంచిర్యాల పట్టణంలోని జాఫర్ నగర్ ప్రాంతానికి చెందిన చిట్టోజు శరణ్య విద్యుత్ ప్రమాదంలో తన ఇంటిని కోల్పోయినందున, రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి సిఫారసు మేరకు ముఖ్యమంత్రి సహాయ నిధి క్రింద బాధితులకు 36 వేల రూపాయల చెక్కును అందజేయడం జరిగిందని తెలిపారు. ప్రమాదం జరిగిన సమయంలో తక్షణ ఆర్థిక సహాయం క్రింద 7 వేల రూపాయలు అందించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అక్టోబర్ 25న మినీ జాబ్ మేళా


### జిల్లా ఉపాధి కల్పన అధికారి రవికృష్ణ

**అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 23:**

జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని టాస్క్ ట్రైనింగ్ సెంటర్ లో అక్టోబర్ 25వ తేదీ ఉదయం 10.30 గంటలకు మినీ జాబ్ మేళా నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఉపాధి కల్పన అధికారి రవికృష్ణ ప్రకటనలో తెలిపారు. జెవిజి మేనేజ్మెంట్ కన్సల్టింగ్ ప్రైవేట్ లిమిటెడ్ - హైదరాబాద్ సంస్థలో హైదరాబాద్ ప్రాంతంలో పని చేసేందుకు 100 టెక్నీషియన్స్ (ఫ్రెషర్స్) పోస్టుల భర్తీకి ఐటిఐ (ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, టర్నర్, మిషనిస్ట్, వెల్డర్) అర్హత కలిగి 18-22 వయసు కలిగిన పురుషులు, మహిళ అభ్యర్థులు, 100 ట్రైనీ టెక్నీషియన్స్ (ఫ్రెషర్స్) భర్తీకి ఎస్ఎస్సి, ఇంటర్, ఏదేని డిగ్రీ అర్హత కలిగి 18- 23 వయసు అర్హత కలిగిన పురుషులు, మహిళ అభ్యర్థులకు అవకాశం కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఇతర వివరాలకు 9010584000, 8333059029, 9963452486 నెంబర్లలో సంప్రదించవచ్చని, ఆసక్తి అర్హత కలిగిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

# ఎంపీ వద్దిరాజు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అధ్యక్షతన ఎర్రవల్లిలో జరుగుతున్న పార్టీ సమావేశంలో

**అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:**



జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గానికి జరుగుతున్న ఉప ఎన్నిక నేపథ్యంలో భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) అధ్యక్షులు గురువారం మధ్యాహ్నం ప్రచార కార్యక్రమంలో నిమగ్నమైన పార్టీ ముఖ్య నేతలతో ఎర్రవెల్లిలో సమావేశమయ్యారు.బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర,వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు తన్నీరు హరీష్ రావు, గంగుల కమలాకర్,గుంటకండ్ల జగదీష్ రెడ్డి,వేముల ప్రశాంత్ రెడ్డి,తలసాని శ్రీనివాస్ దాసోజు శ్రవణ్ కుమార్ తదితర ముఖ్య నాయకులతో కలిసి ఈ సమావేశానికి హాజరయ్యారు.

# విద్యారంగ బలోపేతం దిశగా ప్రభుత్వం కృషి

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 23:**



ప్రభుత్వ విద్యా సంస్థలను బలోపేతం చేస్తూ విద్యార్థులకు సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్యను అందిస్తూ విద్యారంగ బలోపేతం దిశగా ప్రభుత్వం కృషి చేస్తుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. గురువారం జిల్లాలోని భీమారం మండల కేంద్రంలో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి తరగతి గదులు, వంటశాల, మధ్యాహ్న భోజనం నాణ్యత, రిజిస్టర్లు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేస్తూ అన్ని ప్రభుత్వ పాఠశాలలలో త్రాగునీరు, విద్యుత్, మూతశాలలు, ప్రహరీ గోడ ఇతర మౌలిక సదుపాయాలు కల్పించి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తుందని తెలిపారు. ఈ క్రమంలో విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలు కలిగిన ఆహారం, శుద్ధమైన త్రాగునీటిని అందించాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. నిష్ణాతులైన ఉపాధ్యాయులను నియమించి గుణాత్మక విద్యను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని, ఈ నేపథ్యంలో విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత విద్యను అభ్యసించాలని తెలిపారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా ఉపాధ్యాయులు పర్యవేక్షించాలని, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయడంతో పాటు తరగతిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. పాఠశాలలో చేపట్టిన అదనపు గదుల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని తెలిపారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వార్డులు, మందుల నిల్వలు, ల్యాబ్, పరిసరాలను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. వైద్యులు సిబ్బంది విధుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలని, ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ ప్రజలకు వైద్య సేవలు అందించాలని తెలిపారు. ఆసుపత్రిలోని వార్డులు, పరిసరాలలో పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. ప్రభుత్వ గిరిజన ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టిక ఆహారం అందించడంతోపాటు నాణ్యమైన విద్యా బోధన చేయాలని తెలిపారు. పాఠశాలలో చేపట్టిన మరమ్మత్తు పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం మండలంలోని దాంపూర్ గ్రామంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించారు. నిరుపేదల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకంలో లబ్ధిదారులు నిర్దేశిత విస్తీర్ణంలో ఇల్లు నిర్మించుకునే విధంగా అధికారులు అవగాహన కల్పించాలని తెలిపారు. నిబంధనల ప్రకారం ఇల్లు నిర్మించుకున్నట్లయితే సకాలంలో నిర్మాణ దశల వారీగా బిల్లులు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి మధుసూదన్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# కొనుగోలు కేంద్రాలలో వరి ధాన్యం విక్రయించి రైతులు మద్దతు ధర పొందాలి

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 23:**



రైతు సంక్షేమంలో భాగంగా 2025 - 26 వానాకాలం సంబంధిత వరి ధాన్యం కొరకు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధరతో రైతుల వద్ద నుండి ధాన్యం సేకరిస్తుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. గురువారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి చంద్రయ్య, జిల్లా పౌరసరఫరాల అధికారి బ్రహ్మారావు, జిల్లా మేనేజర్ శ్రీకళ లతో కలిసి వరి ధాన్యం కొనుగోలు సంబంధిత గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి 2025 - 26 వానాకాలం సంబంధిత వరి ధాన్యాన్ని రైతుల వద్ద నుండి మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. గ్రేడ్ ఏ రకానికి క్వింటాలుకు 2 వేల 389 రూపాయలు, సాధారణ రకానికి క్వింటాలుకు 2 వేల 369 రూపాయలుగా మద్దతు ధర నిర్ణయించడం జరిగిందని, సన్న రకం వడ్లకు మద్దతు ధరతో పాటు అదనంగా క్వింటాలుకు 500 రూపాయలు చెల్లించడం జరుగుతుందని తెలిపారు. రైతులు నిబంధనలను పాటిస్తూ తేమశాతం, తప్ప, తాలు లేకుండా నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని తెలిపారు. జిల్లాలో 4 ఏజెన్సీల ద్వారా 31 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని, జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ పరిధిలో 147, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పరిధిలో 91, మెప్మా పరిధిలో 7, డిసిఎంఎస్ పరిధిలో 56 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల వద్ద నుండి ధాన్యం సేకరించడం జరుగుతుందని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా త్రాగునీరు, నీడ ఇతర మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు గన్నీ సంచులు, టార్పాలిన్ కవర్లు, ఎలక్ట్రానిక్ తూకం యంత్రాలు, ప్యాడి క్లీనర్లు ఇతర సౌకర్యాలు సమకూర్చడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో దాదాపు 2 లక్షల 32 వేల మెట్రిక్ టన్నుల అంచనా ధాన్యం రావడం జరుగుతుందని, నవంబర్ మొదటి వారంలో వరి ధాన్యం కోతలు మొదలవుతాయని తెలిపారు. ఇందుకు అనుగుణంగా జిల్లాలోని అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలలో అవసరమైన ఏర్పాట్లతో ధాన్యం సేకరణకు సిద్ధంగా ఉండాలని తెలిపారు. రైతులు దళారులను నమ్మి మోసపోకుండా ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో వరి ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలో సకల సదుపాయాలతో విద్యార్థులకు నాణ్యమైన విద్య

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 23:**

ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలు, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలలో విద్యార్థులకు సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్య అందించే దిశగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్



కుమార్ దీపక్ తెలిపారు. గురువారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో ఆశ్రమ పాఠశాలలు, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాల ప్రత్యేక అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం విద్యా సంస్థలను బలోపేతం చేస్తూ ప్రతి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన త్రాగునీరు, విద్యుత్, మూత్రశాలలు, ప్రహరీ గోడ ఇతర సదుపాయాలు కల్పించడంతో పాటు విద్యార్థుల ఆరోగ్య దృష్ట్యా మెనూ ప్రకారం సకాలంలో పౌష్టిక ఆహారం అందించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తరగతి గదులు, వసతి, మూత్రశాలలు సరిపడా ఉండాలని, ఫ్లోరింగ్, రూఫ్, ఫర్నిచర్ తో కూడిన భోజనశాలల ఏర్పాటు కొరకు ప్రతిపాదనలు సిద్ధం చేసి సమర్పించాలని తెలిపారు. ప్రత్యేక అధికారులు తమ పరిధిలోని పాఠశాలలను నిత్యం సందర్శిస్తూ ఆయా పాఠశాలలలో నెలకొన్న సమస్యల పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన మెనూ ప్రకారం విద్యార్థులకు సకాలంలో పౌష్టిక ఆహారం అందించేందుకు అవసరమైన ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని తెలిపారు. పాఠశాలలలో విద్యార్థులకు సౌకర్యాలు కల్పించేందుకు అవసరమైన నిర్మాణ పనులకు సంబంధించిన ప్రతిపాదనలను సిద్ధం చేయాలని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన తెలంగాణ రైసింగ్ విజన్ 2047 సిటిజన్ సర్వేలో ప్రతి ఒక్కరు పాల్గొనేలా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సినీ హీరో ప్రభాస్ పుట్టినరోజు అభిమానుల రక్తదానం

### సేవా గుణం చాటుకున్న యువత

**అక్షర కలం/ భద్రాచలం**

?భద్రాచలం గురువారం రోజున?సినీ హీరో ప్రభాస్ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని భద్రాచలంలోని యువ అభిమానులు తమ అభిమానాన్ని కేవలం థియేటర్లకే పరిమితం చేయకుండా, సామాజిక సేవ వైపు మళ్లించి ఆదర్శంగా నిలిచారు. స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో మదర్ థెరిసా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం రక్తదాన శిబిరం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పది మంది అభిమానులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు.?ఈ సేవా కార్యక్రమానికి పట్టణ ట్రాఫిక్ ఎస్.ఐ. తిరుపతిరావు, పట్టణ ఎస్.ఐ. సతీష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, హీరోల అభిమానులు కేవలం వినోదానికే కాకుండా, ఇలా స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయడం ద్వారా




యువతకు స్ఫూర్తిగా నిలిచరని అన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాగే మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలనిఅన్నారు ?రక్తదానం చేసిన అభిమానులు మాట్లాడుతూ, గతంలోనూ అనేకసార్లు ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి రక్తదానం చేసి వారిని కాపాడామని, ఇలా రక్తదానం చేయడం తమకు ఎంతో సంతృప్తినిచ్చిందని తెలిపారు. తమలాగే ప్రతి ఒక్క హీరో అభిమాని రక్తదానాలు చేసి 'ప్రాణదాతలు' కావాలని కోరారు.?మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కొప్పుల మురళి మాట్లాడుతూ, ప్రభాస్ జన్మదినం సందర్భంగా రక్తదానం చేయడానికి ముందుకు వచ్చిన అభిమానులను అభినందించారు. అత్యవసర పరిస్థితుల్లో ఉన్న ప్రతి ఒక్కరికీ రక్తదానం చేసి ప్రాణాలను కాపాడాలని పిలుపునిచ్చారు. ప్రతి హీరో అభిమానులు తమ అభిమాన నటుల జన్మదినం సందర్భంగా ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన కోరారు.?ఈ రక్తదాన శిబిరంలో కరుకు శివకుమార్, ఉడతా సందీప్ రెడ్డి, ప్రభు కుమార్, లోకి, హృదయ్, వినయ్, వెంకీ సహా పలువురు ప్రభాస్ అభిమానులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# పోలీస్ అమరవీరుల కుటుంబ సభ్యులతో పోలీస్ కమిషనర్ బేటి



అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:

పోలీసు అమరవీరుల కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అన్నారు. గురువారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో పోలీస్ అమరవీరుల కుటుంబ సభ్యులతో పోలీస్ కమిషనర్ గారు బేటి అయ్యారు . ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు వారి సమస్యలను వివరించారు. ప్రధానంగా ప్రభుత్వ కేటీయించిన ఇంటి స్థలం సంబంధించి సమస్యలపై విజ్ఞప్తి చేశారు. సానుకూలంగా స్పందించిన పోలీస్ కమిషనర్ ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పక్రీయ మొదలుపెట్టారని, త్వరలోనే సమస్యకు పరిష్కరం లభిస్తుందని తెలిపారు.

# సరిహద్దులను నిర్ధారించి మ్యాప్ తో సహా పంపండి

### జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



అక్షరకలం నల్గొండ

యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల భవన నిర్మాణానికి గుర్తించిన స్థలంలో సరిహద్దులు నిర్ధారించి ప్రతిపాదనలు సమర్పించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మిర్యాలగూడ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. గురువారం ఆమె మిర్యాలగూడ మండలం, జప్తి వీరప్ప గూడెం వద్ద ఉన్న సర్వే నంబర్ 214 లో ఉన్న ప్రభుత్వ భూమిని పరిశీలించారు. ఈ భూమిలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల భవన నిర్మాణానికి ప్రతిపాదించగా, మొత్తం 25 ఎకరాల స్థలంలో పాఠశాల భవనాల నిర్మాణం చేపట్టేందుకు గాను సరిహద్దులను నిర్ధారించి మ్యాప్ తో సహా పంపించాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల భవనాల నిర్మాణంలో భాగంగా తరగతి గదులు, హాస్టల్, డార్మెటరీ, లైబ్రరీ, ల్యాబ్ లు, ఆట స్థలం, ఆడిటోరిమ్, అధునాతన సౌకర్యాలతో నిర్మిస్తున్న విషయం తెలిసిందే. జిల్లా కలెక్టర్ వెంట మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ పవన్, మిర్యాలగూడ తహసిల్దార్ సురేష్, తదితరులు ఉన్నారు.

# అండగా నిలిచి... ఆదుకొని

### అనాథ చిన్నారిని హక్కున చేర్చుకున్న కలెక్టర్

### ఐదు లక్షల చెక్కు అందజేత

అక్షరకలం నల్గొండ

తల్లి, తండ్రి, సోదరుడిని కోల్పోయి అనాథగా మిగిలిపోయిన మాడుగుల పల్లి మండలం, ఆగమోత్కూరుకు చెందిన బాలిక నిత్యకు అండగా ఉంటామని, ధైర్యంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి చెప్పారు. గురువారం ఆమె నల్గొండ జిల్లా, వేములపల్లి మండల కార్యాలయంలో చేపట్టిన ఆధునికీకరణ పనుల పరిశీలన నిమిత్తం వేముల పల్లికి వచ్చారు. కాగా మాడుగుల పల్లి మండలం ఆగమోత్కూరుకు చెందిన తండ్రి, కొడుకులు పున్న సాంబయ్య, శివమణిలు గణేష్ నిమజ్జనం సందర్భంగా వేములపల్లి వద్ద ఉన్న కాలువలోకి దిగి ప్రమాదవశాత్తు కాలువలో పడి



గల్లంతు కాగా , ఇదివరకే తల్లిని కోల్పోయిన చిన్నారి నిత్య తండ్రి, సోదరున్ని కూడా కోల్పోవడంతో అనాథగా మిగిలిపోయింది. విషయం తెలిసిన జిల్లా కలెక్టర్ చిన్నారి నిత్యకు అండగా నిలిచే క్రమంలో భాగంగా వేములపల్లి తహసిల్దార్ కార్యాలయంలో నిత్యకు 5 లక్షల రూపాయల చెక్కును అందించి ధైర్యం చెప్పారు. ధైర్యంగా ఉండాలని, బాగా చదువుకోవాలని అన్నారు. మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, వేములపల్లి, మాడుగుల పల్లి తహసిల్దార్లు హేమలత, సరోజ పావని, డిప్యూటీ తహసిల్దార్ తదితరులు ఉన్నారు.



# 2026 ఖరీఫ్ నాటికి సారునీరు అందేలా సీతారామ పాలేరు కెనాల్ పనులు పూర్తి చేయాలి.....

### జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

### పెండింగ్ భూసేకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

### సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు 16వ ప్యాకేజీ పాలేరు లింకు కెనాల్ టన్నెల్ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా కలెక్టర్

అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:

2026 ఖరీఫ్ సీజన్ నాటికి సారునీరు అందించే విధంగా ప్రణాళికతో సీతారామ పాలేరు కెనాల్ టన్నెల్ పనులు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. జిల్లా కలెక్టర్, తిరుమలాయపాలెం మండలంలోని బీరోలు, దమ్మాయిగూడెం లలో జరుగుతున్న సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు 16వ ప్యాకేజీ లోని పాలేరు లింకు కెనాల్ టన్నెల్





పనులను గురువారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ 2026 ఖరీఫ్ నాటికి గోదావరి, మున్నేరు జలాలను మన ప్రాంత రైతులు వినియోగించుకునే విధంగా చేపట్టిన ప్రాజెక్ట్ పనులు పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. నిర్మాణంలో ఎదురవుతున్న ఇబ్బందులను ఎప్పటి కప్పుడు పరిష్కరిస్తూ పనులు వేగవంతంగా అయ్యేలా చూడాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. 8.2 కిలోమీటర్ల సొరంగం తవ్వకం పనులకు గాను ప్రతిరోజు 24 మీటర్ల మేర పనులు చేపట్టి ఇప్పటి వరకు నాలుగు కిలోమీటర్ల పనులు పూర్తి చేయడం జరిగిందని, మిగిలిన టన్నెల్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని, సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టులో భాగంగా పోచారం వద్ద పెండింగ్ ఉన్న భూ సేకరణ పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట ఇరిగేషన్ ఎస్ఇ యం. వెంకటేశ్వర్లు, డిఇ రమేష్ రెడ్డి, తిరుమలాయపాలెం మండల తహసీల్దారు విల్సన్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# డిప్యూటేషన్లకు కేంద్ర బిందువుగా నల్లగొండ జిల్లా

### ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ సభ్యులు ఖమ్మంపాటి శంకర్

### సినియర్ అసిస్టెంట్డీ డిప్యూటేషన్ ను రద్దుచేసి సూర్యాపేటకు జిల్లా కు పంపపా

### డిటిడిఓ కు వినతి

అక్షరకలం నల్గొండ

నల్లగొండ జిల్లాలోని కొన్ని ప్రభుత్వ కార్యాలయాలలో అక్రమ డిప్యూటేషన్లు జోరుగా జరుగుతున్నాయని, నల్లగొండ జిల్లా డిప్యూటేషన్లకు కేంద్ర బిందువుగా మారిందని ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ సభ్యులు ఖమ్మంపాటి శంకర్, జిల్లా అధ్యక్షులు ఆకారపు నరేష్ ఆరోపించారు. నల్లగొండ జిల్లా గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయం లో సీనియర్ అసిస్టెంట్ డీప్యూటేషన్ ను వేంటనే రద్దుచేసి సూర్యాపేటకు జిల్లా కు పంపపాలని డిమాండ్ చేశారు. గురువారం ఎస్ఎఫ్ఐ నల్గొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో డిటిడిఓ ఛత్రు నాయక్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బదిలీ నిబంధనలకు విరుద్ధంగా ఒక వ్యక్తికి లాభం చేకూర్చే విధంగా నల్గొండ జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారులు ప్రభుత్వ నిబంధనలను పక్కకు పెట్టి ఓ సీనియర్ అసిస్టెంట్ కు వత్తాసు పలుకుతున్నారని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం బదిలీలపై నిషేధం విధించినప్పటికీ షిఫ్టింగ్ పేరిట వేరే ఇతర జిల్లాకి బదిలీ చేసినట్లుగా చూపిస్తూ మరల నల్గొండ జిల్లా



కార్యాలయానికి తీసుకువచ్చారని అన్నారు. దీని వెనకాల ఉన్న మతాల ఏంటని ప్రశ్నించారు. అవినీతి ఆరోపణలు ఉన్నా కానీ నల్గొండ జిల్లా కు తీసుకువచ్చి ఉద్యోగుల సర్వీస్ వ్యవహారాలలో కీలకమైన ఎస్టాబ్లిష్మెంట్ సెక్షన్ ను తిరిగి అతనికే అప్పజెప్పడం వెనుక జరిగిన లావాదేవీల వ్యవహారం ఏంటని అధికారులను ప్రశ్నించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం సీనియర్ అసిస్టెంట్ ను సూర్యాపేట జిల్లాకు పంపించినా అక్కడ కనీసం రెండు మూడు రోజులు కూడా విధులు నిర్వహించకుండా నల్లగొండ, సూర్యపేట జిల్లా కలెక్టర్లను సైతం మోసం చేస్తూ తిరిగి నల్గొండ జిల్లా గిరిజన సంక్షేమ కార్యాలయంనికి అక్రమ డిప్యూటేషన్ ద్వారా రావడం జరిగిందని వివరించారు. తక్షణమే డిప్యుటేషన్ ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వాస్తవానికినల్గొండ జిల్లా గిరిజన సంక్షేమ శాఖలో రెగ్యులర్ సీనియర్ అసిస్టెంట్ పోస్టు ఖాళీగా లేనప్పటికీ, మాడ విభాగం సీనియర్ అసిస్టెంట్ పోస్టు శాంక్షన్ అయి ఉన్నప్పటికీ ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి అక్రమ పద్ధతిలో 2018 లో యాదాద్రి భువనగిరి నుంచి నల్గొండ జిల్లా కు సీనియర్ అసిస్టెంట్ గా అప్పటి అధికారుల అండదండలతో వచ్చారని ఆరోపించారు.రెగ్యులర్ సీనియర్ అసిస్టెంట్ పోస్టు లేనప్పటికీ, మాడా సీనియర్ అసిస్టెంట్ పోస్టుల్లో విధులు నిర్వహిస్తూ, ప్రభుత్వం నుంచి రెగ్యులర్ ఎంప్లాయ్ 010 పద్దు కింద జీతం లేనప్పటికీ, ఉన్నతాధికారుల అండదండలతో యదేచ్ఛగా ప్రభుత్వాన్ని మోసం చేస్తూ రెగ్యులర్ ఎంప్లాయ్ సాంక్షన్ పోస్ట్ లేని స్థానంలో 8 సంవత్సరాల నుంచి జీతం తీసుకోవడం అనేది ప్రభుత్వ నియమ నిబంధనలకు విరుద్ధమని తెలిపారు. సాంక్షన్ పోస్ట్ లేనప్పటికీ, మాడ విభాగంలో 010 పద్దు క్రింద జీతం ఇవ్వడంలో ప్రభుత్వం నుంచి ఏమైనా అనుమతి తీసుకున్నారా అని ప్రశ్నించారు.సీనియర్ అసిస్టెంట్ పై వచ్చిన ఆరోపణలు వాస్తవమని నిజ నిరూపణ అయిందని ఆరోపించారు. అయినా సదరు సీనియర్ అసిస్టెంట్ కు ఉన్నతాధికారులు ఎలాంటి నోటీసులు జారీ చేయకుండా, క్రమశిక్షణ చర్యలు తీసుకోకుండా బదిలీలు నిషేధం ఉన్నప్పటికీ హుటాహుటిన ప్లేసు షిఫ్టింగ్ పేరిట వేరే జిల్లాకు బదిలీ చేసి మళ్లీ హడావిడిగా అదే నోట్ ఫైల్ పై నల్గొండ జిల్లాకు డిప్యూటేషన్ గా తీసుకురావడం సరైనది కాదని అన్నారు. 2018 వ సంవత్సరం నుండి ఇప్పటివరకు దాదాపు ఏడు సంవత్సరాలుగా ప్రభుత్వాన్ని తప్పుదారి పట్టించి, ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేసిన గిరిజన సంక్షేమ శాఖ సీనియర్ అసిస్టెంట్ పై వచ్చిన అవినీతి ఆరోపణల పై సమగ్ర విచారణ జరిపి, తక్షణమే అతని ఎస్టాబ్లిష్మెంట్ సెక్షన్ ను నల్గొండ జిల్లాలో తొలగించి, ఇప్పటివరకు 010 వేతనం కింద పొందిన రెగ్యులర్ శాలరీని రికవరీ చేసి, అతని పూర్వ స్థానానికి పంపాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఎస్ఎఫ్ఐ నల్లగొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆందోళనలకు పిలుపు నివ్వడం జరుగుతుందని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి మారుపాక కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

# బ్రహ్మోత్సవాల పోస్టర్లు ఆవిష్కరణ

వలిగొండ అక్టోబర్ 23 అక్షరకలం

:మండల పరిధిలోని వెంకటపురంలో గల శ్రీమత్స్యగిరి లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ఈ నెల 31 నుండి నవంబర్ 5 వరకు జరిగే శ్రీ మత్స్యగిరి లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయ ఈవో మోహన్ బాబు,చైర్మన్ నరేష్ రెడ్డి,లు గురువారం భువనగిరి శాసన



సభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డిని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి బ్రహ్మోత్సవాల పోస్టర్లను, కరపత్రాలు,గోడపత్రికలను ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డికి,ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కొమ్మారెడ్డి నరేష్ కుమార్ రెడ్డి,ధర్మకర్తలు కొడితాల కరుణాకర్,అర్రూర్ వెంకటేష్,రేఖల ప్రభాకర్,అంజయ్య,బండి రవికుమార్,గుండు జగన్మోహన్ రెడ్డి,ఈతాప రాములు,జక్కల కేతమ్మ,మైసోళ్ళ వెంకటేశం,బాలేశ్వర్,కందుల శ్రీను,ఆలయ అర్చకులు,సిబ్బంది పాల్గొన్నారు.

# అక్రమంగా నిల్వ చేసిన పిడిఎస్ బియ్యం పై టాస్క్ ఫోర్స్ పోలీసుల దాడి...

మెదక్, అక్టోబర్ 23 (అక్షర కలం):-

గురువారం మెదక్ మండలంలోని రాజ్‌పల్లి గ్రామానికి సరిహద్దులోని మాల్బారీ ఫార్మ్ హౌస్ లో అక్రమంగా నిల్వ చేయబడిన 22 పిడిఎస్ బియ్యం సంచులను టాస్క్ ఫోర్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న బియ్యం సంచులను మెదక్ రూరల్ పోలీస్ స్టేషన్ కు తరలించి, తదుపరి చర్యల కోసం కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా మెదక్ టాస్క్ ఫోర్స్ సీఐ కృష్ణమూర్తి మాట్లాడుతూ జిల్లాలో పిడిఎస్ బియ్యం అక్రమ నిల్వ, రవాణా లేదా విక్రయాలపై ఎవరైనా పాల్పడితే, వారిపై కఠిన చర్యలు తప్పవని తెలిపారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు ఎవరూ పాల్పడరాదని, ఇలాంటి ఘటనల గురించి ప్రజలు వెంటనే పోలీసులకు సమాచారం అందించి సహకరించాలని సూచించారు.



# వీధి కుక్కల నియంత్రణకు చర్యలేవి?

## – వీధి కుక్కలకు వింతరోగా లు...పట్టించుకోని అధికారులు...

కొల్చారం, అక్టోబర్ 23 (అక్షర కలం):-

కొల్చారం మండలంలోని అన్ని గ్రామాల్లో వింత రోగంతో సంచరిస్తున్నాయి. కుక్కల గురించి పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోని వైనం.. పగలు, రాత్రి గుంపులు గుంపులుగా తిరుగుతూ కుక్కలు,పిల్లలు ,వృద్దులు, పశువుల పైన దాడులు భయాందోళనలో మండల ప్రజలు. మండలంలోని పలు గ్రామాల్లో వీధి కుక్కల సంఖ్య రోజుకి విపరీతంగా పెరిగి స్థాని కులకు భయాందోళనకు గురి చేస్తుంది అని ప్రజలు వాపోతు న్నారు ఈ క్రమంలో వీధి కుక్క ల నియంత్రణకు చర్యలు ఏవి అని గ్రామస్తులు అధికారులు ప్రశ్నిస్తున్నారు పగలు రాత్రి అనే తేడా లేకుండా వీధిలో ఇండ్ల ముందు,పాఠశాలలు, అంగన్వాడి భవనాల ముందు గుంపులు గుంపులుగా తిరు గుతూ ఆందోళనకు గురిచేస్తు న్నాయని స్థానికులు వాపో తున్నారు గ్రామంలో సంచ రించే అన్ని కుక్కలకు వింత రోగం సోకినట్లు గ్రామస్తులు తెలిపారు గతంలో వింత రోగా నికి గురైన కుక్కలు చాలా మంది పైన దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటనలు ఇదివరకే చూసామన్నారు పిల్లలు వృద్దులు, పాదా చారులపై కూడా దాడి చేసి గాయపరిచాయని అన్నారు మనుషుల పైన కాకుండా పశువులు,కోళ్ళు, మూగజీ వులను సైతం గాయపరి చాయని మండల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.



### – పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల వద్ద కుక్కల స్వైర విహారం...

పాఠశాలలో అంగన్వాడీ కేంద్రాల వద్ద కుక్కలు తిరుగుతుండడం తల్లిదం డ్రుల్లో ఆందోళన కలిగిస్తుంది మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు వీధి కుక్కలకు సోకిన వ్యాధిని నియంత్రిం చేందుకు పశువైద్య, పంచా యితీ అధికారులు, కార్య దర్శిలు సంయుక్త చర్యలు తీసుకోవాలి అని డిమాండ్ చేశారు అవసరమైతే కుక్కల నిర్బంధ టీకాల కార్యక్రమాలు నిర్వహించాలని కోరుతు న్నారు ఒకవేళ సమస్య తక్షణమే పరిష్కరించక పోతే పెద్ద ప్రమాదాలు జరగవచ్చని అన్నారు కావున వీధి కుక్క లకు వింత రోగాలు నియంత్రిం చేందుకు తక్షణమే తగు చర్య లు చేపట్టాలని మండల ప్రజ లు అధికారులను డిమాండ్ చేస్తున్నారు.

# వెంటనే సిసిఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

## మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



చిట్యాల : (అక్టోబర్ 23 ) అక్షర కలం, ప్రతినిధి

పత్తి సీజన్ వచ్చిన తెలంగాణ రాష్ట్రంలో సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఇంకా ఎందుకు ప్రారంభించడం కావడం లేదని , పత్తి కొనుగోడు పై ప్రభుత్వం సమాధానం చెప్పాలి అని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు గురువారం రోజున చిట్యాల మండలంలోని పెద్దకాపర్తి గ్రామంలో పత్తి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన స్వయంగా పత్తి చేలలో ఉన్న రైతులను అడిగి తెలుసుకున్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాల కారణంగా పత్తిని స్టాక్ పెట్టుకోలేక తెలంగాణ రైతులు సతమతం అవుతున్నారని, దళారుల చేతుల్లోకి రైతులను నెట్టేందుకే రాష్ట్ర ప్రభుత్వం సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదని అన్నారు.రైతులు తీవ్రంగా నష్టపోతున్నా ప్రభుత్వం మాత్రం దళారులకు ప్రోత్సహిస్తుందని, కేసీఆర్ హయాంలో రైతులకు లాభం కలిగే విధంగా పంటలకు సరైన మద్దతు ధర ఇచ్చి సమయానుకూలంగా కొనుగోలు చర్యలు చేపట్టామని అన్నారు. రైతు సంక్షేమం జాడలేదని%అ%, పండిన పంటను కొనుగోలు చేసే దిక్కే లేదని, ఒక్క రోజైనా తెలంగాణ రైతుల ప్రయోజనాల కోసం ముఖ్యమంత్రి చొరవ తీసుకోలేదని తీవ్రంగా విమర్శించారు. ఇప్పటికైనా రైతులను ఇబ్బందులు పెట్టకుండా ఆంక్షలు లేకుండా పత్తి కొనుగోలు చేసి మద్దతు ధర ఇవ్వాలని బీఆర్ఎస్ పార్టీ తరుపున డిమాండ్ చేస్తున్నాం.

# చేనేత ఎక్స్ లెన్స్ సెంటర్ నిర్మాణ పనులు పూర్తి చేయాలి

## జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్.

అక్షర కలం / నారాయణపేట జిల్లా ప్రతినిధి:అక్టోబర్ 23.

నవంబర్ నెలాఖరు నాటికి చేనేత ఎక్స్ లెన్స్ సెంటర్ నిర్మాణ పనులను పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. జిల్లా కేంద్రానికి సమీపంలోని సింగారం మలుపు దారి వద్ద గల వృత్తి నైపుణ్య అభివృద్ధి కేంద్రం పక్కన కొనసాగుతున్న చేనేత ఎక్స్ లెన్స్ సెంటర్ నిర్మాణ పనులను గురువారం ఆమె స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వర్ తో కలిసి పరిశీలించారు. డోర్స్, లైటింగ్, టాయిలెట్ బ్లాక్, సెంటర్ చుట్టూ ప్రహరీ పనులను చూసి మిగిలిన పనులను వేగంగా పూర్తి చేయాలని సూచించారు. సెంటర్ నమూనా మ్యాప్ ను చూశారు. నవంబర్ నెల చివరి వరకు నిర్మాణ పనులు పూర్తి చేయాలన్నారు. టెస్కో ఓ ఎస్ డీ హైదరాబాద్ రతన్ కుమార్,, మహబూబ్ నగర్ చేనేత జౌళి శాఖ ఏడి తో సెంటర్ పురోగతి పై చర్చించారు. ఎట్టి పరిస్థితుల్లో వచ్చే నెలాఖరునాటికి భవన నిర్మాణ పనులు పూర్తి కావాలని ఆమె తేల్చి చెప్పారు. కార్యక్రమంలో టి జి ఎం ఎస్ ఐ డి సి ఈఈ రవీందర్,ఏ ఈ సాయి మురారి, నారాయణ పేట చేనేత జౌళి శాఖ ఏడి బాబు, ఆర్కిటెక్చర్ ఇస్మాయిల్ పాల్గొన్నారు.



# పత్తి రైతులకు అమ్మకాలు సులభతరం కావాలి

## జిల్లా కలెక్టర్ సిక్త పట్నాయక్.

అక్షర కలం/నారాయణపేట జిల్లా ప్రతినిధి: అక్టోబర్ 23.





పత్తి కొనుగోలు కేంద్రాలకు రైతులు నాణ్యమైన పత్తిని తీసుకుని వచ్చి సరైన మద్దతు ధర పొందాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. గురువారం నారాయణపేట జిల్లా ఊట్కూరు మండలం నిడుగుర్తి రైతు వేదిక లో పత్తి రైతులకు కపాస్ కిసాన్ యాప్ పై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సదస్సుకు జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... రైతులు పత్తిని ఎండబెట్టి తేమ 8 నుండి 12 శాతం మధ్యలో ఉన్న పత్తిని తీసుకొని వెళ్ళాలన్నారు. అత్యధికంగా 8 శాతం తేమ ఉంటే రూ.8110 కు అంతకుమించి పెరిగే ఒక్కొక్క శాతానికి 81 రూపాయలు ధర తగ్గుతుందన్నారు. అలాగే ఏఈఓ లాగిన్ లో మొబైల్ నెంబరు అప్డేట్ చేసుకోవాలని తెలిపారు. రైతుబంధు లాగిన్ లో రైతు మొబైల్ నెంబరు ఒకటే డైరెక్ట్ గా స్లాట్ బుకింగ్ చేసుకోవచ్చునీ, రైతులకు అమ్మకాలు సులభతరం అయ్యేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆమె చెప్పారు.ఈ అవకాశాన్ని రైతులందరూ వినియోగించుకోవాలని కలెక్టర్ కోరారు. సదస్సులో వరి కొనుగోలు గురించి కూడా అవగాహన కల్పించారు జరిగింది. ఈ సదస్సులో జిల్లా వ్యవసాయ అధికారి జాన్ సుధాకర్, మండల తహాసిల్దార్ చింత రవి, , మండల వ్యవసాయ అధికారి గణేష్ రెడ్డి , ఎంపీడీవో, వ్యవసాయ విస్తరణ అధికారి ప్రశాంతి, రైతులు పాల్గొన్నారు.

# చిట్యాల గురుద్వారాలో ఘనంగా గురు గద్ది సంబురాలు



చిట్యాల (అక్టోబర్ 23) అక్షర కలం, ప్రతినిధి

నల్గొండ జిల్లా చిట్యాల పట్టణంలో ఉన్న గురుద్వారాలో వాహెగురు సాహెబ్ లో శ్రీ గురు గ్రంథ్ సాహెబ్ జీ.317వ గురుబితాబిగద్ది దినోత్సవం స్థానిక శిక్కులు ఘనంగా నిర్వహించారు. శబద్ బాణీ కీర్తనలు పాడి , సామూహిక ప్రార్ధనలు చేసారు. ఈ సందర్భంగా గురుధర్మ ప్రచార పీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు బహదూర్ సింగ్ మాట్లాడుతూ శిక్కుమత చివరి పదవ మత గురువుయైన శ్రీ గురు గోబింద్ సింగ్ మహారాష్ట్రలోని నాందేడ్ పట్టణంలో 1708 సంవత్సరంలో ఇదే రోజున శిక్కుమత పీఠాధిపతి గురువుగా శ్రీ గురు గ్రంథ్ సాహెబ్ జీ అని ప్రకటించారని అప్పటి నుండి శిక్కు మతస్థులు అందరూ మత గురువుగా పూజిస్తూ ఆరాధిస్తూ వస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంత్ సింగ్. ప్రేమ్ సింగ్.దీపక్ సింగ్. ఖాల్సా దాభా పాల్గొన్నారు.

గాలి కుంటు వ్యాధి రహిత రాష్ట్రం దిశగా కృషి చేస్తాం

# పిట్టంపల్లి పశు వైద్యశాలను సందర్శించిన పశువైద్య పశుసంవర్ధక శాఖ రాష్ట్ర సంచాలకులు డా.బి.గోపి



చిట్యాల : (అక్టోబర్ 23) అక్షర కలం, ప్రతినిధి

గాలి కుంటు వ్యాధి ఆవులు,గేదెలకు సోకే ఒక వైరల్ వ్యాధి అని,చికిత్స కన్నా టీకా ద్వారా నివారణే పరిష్కారం అవుతుందని పశువైద్య పశుసంవర్ధక శాఖ రాష్ట్ర సంచాలకులు డా.బి.గోపి %×ూూ% అన్నారు. గురువారం రోజున పిట్టంపల్లి గ్రామంలో ఉన్న పశు వైద్యశాలను ఆయన సందర్శించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా రెండు సార్లు గాలికుంటు ఉచిత నివారణ టీకాలు పశువైద్య పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ప్రతి గ్రామంలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని,ఏడవ విడతగా ఈనెల 15 నుండి వచ్చే నెల 14 వరకు కార్యక్రమం జరుగుతుందని , పాడి రైతులు మరియు పశుపోషకులు సద్వినియోగం చేసుకొని క్రమం తప్పకుండా తమ పశువులకు టీకాలు వేయించాలని అన్నారు. గాలికుంటు వ్యాధి రహిత రాష్ట్రం గా మార్చేందుకు ప్రతి రైతు సహకారం అందించాలని అన్నారు. ఒక్కసారి గాలికుంటు వ్యాధి నిర్మూలన జరిగి తదనుగుణంగా మన దేశానికి గుర్తింపు వస్తే మన పాడి మరియు పశు ఉత్పత్తులకు అంతర్జాతీయ గిరాకి పెరుగుతుందని,ఎగుమతులు పెరిగి తద్వారా మన రైతుల ఆర్థిక వ్యవస్థ మెరుగు పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారి డా.జి.వి. రమేశ్, చిట్యాల పశువైద్యాధికారి డా.వి. అభినవ్, డా. జె.అమరేందర్, రాష్ట్ర, జిల్లా అసోసియేషన్ సభ్యులు,పారా సిబ్బంది పి.శ్రీను,సైదులు,శ్రీనివాస్, మల్లారెడ్డి,వెంకన్న,సునీత, సతీష్ గోపాలమిత్రులు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# దివిస్ లాబరేటరీ ఆధ్వర్యంలో నోటు పుస్తకాల పంపిణీ

## నోటు పుస్తకాలను పంపిణీ చేసిన ఎన్ఈవో సైదా నాయక్



చిట్యాల : (అక్టోబర్ 23) అక్షర కలం, ప్రతినిధి


చిట్యాల మండలంలో గుండ్రం పల్లి ఏపూర్, పిట్టంపల్లి గ్రామాలలో ఉన్న ప్రాథమిక, ప్రాథమికోన్నత 5 పాఠశాలలలో దివిస్ లాబరేటరీ లిమిటెడ్ వారు ఏడు లక్షల 17వేల రూపాయల విలువ గల నోట్ పుస్తకాలు, బ్యాగులను చిట్యాల మండల విద్యాధికారి సైదా నాయక్ పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు బ్యాగులు, నోటు పుస్తకాలు అందజేయడం ఎంతో గర్వకారణం అని అన్నారు. విద్యార్థినీ విద్యార్థులు ఇటువంటి అవకాశాలను సద్వినియోగం చేసుకొని బాగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దివిస్ ప్రతినిధులు సాయి కృష్ణ ,వంశీకృష్ణ , పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమాదేవి, ఉపాధ్యాయులు హేమలత, మోహన్ రెడ్డి,, పాండు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు కష్టపడి చదివితేనే భవిష్యత్ బాగుంటుందని

## జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

అక్షర కలం /సూర్యాపేట

గురువారం ఆయన మునగాల మండలం మాధవరం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల, అంగన్వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. 7 వ తరగతి విద్యార్థులతో తెలుగు పాఠాలు చదివించగా, వారు సరిగ్గా చదవకపోవటంతో పాటు, హోమ్ వర్క్, నోట్ బుక్స్ సరిగ్గా లేకపోవటంతో ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఎం ఈ ఓ పాఠశాలను సందర్శించి విద్యార్థుల ఫలితాలు, ఉపాధ్యాయుల పనితీరుపై నివేదిక ఇవ్వాలని చరవాణి ద్వారా డి ఈ ఓ అశోక్ ని ఆదేశించారు. విద్యార్థులకు మాతృ భాషైనా తెలుగులో రాయటం, చదవటంలో సామర్థ్యాలు పెంపోదించేందుకు ఉపాధ్యా యులు కృషి చేయాలని సూచించారు. విద్యార్థులు ప్రతి రోజు తెలుగు, ఇంగ్లీష్ ఒక పేజీ రాయాలని, రెండు పేజీలు చదవాలని మరలా రెండు నెలల తర్వాత ఈ పాఠశాలకు వస్తానని, అప్పటిలోగా ప్రతి ఒక్కరు తెలుగు, ఇంగ్లీష్ సబ్జెక్ట్ లలో పట్టు సాధించాలని అన్నారు. ఒకటవ తరగతి విద్యార్థులతో తెలుగు, ఇంగ్లీష్, అంకెలు చదివించారు. పేరు, తల్లిదండ్రుల పేరు,ఊరు, మండలం పేర్లు అడిగి తెలుసుకొని పిల్లలు చాలా హుషారుగా ఉన్నారని కితాబునిచ్చారు.ప్రతి రోజు ఇంటి వద్ద రెండు గంటలు పాటు చదువుకోవాలని పిల్లలకు సూచించారు. అంగన్వాడీ పిల్లలతో ముచ్చటించారు అలాగే మంచిగా పాటలు పాడటంతో సంతోషం వ్యక్తం చేశారు. భాలింతలు, గర్భిణీ లు,హై రిస్క్ కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రధాన ఉపాధ్యాయులు సత్యనారాయణ, ఉపాధ్యాయులు మురళి కృష్ణ, మణెమ్మ, అంగన్వాడీ టీచర్లు అనిత, సదాలక్ష్మి కలెక్టం ఉన్నారు.





అక్షర కలం APTELRNI No. 2009/27246

## పాఠశాల విద్యార్థులకు షూస్ పంపిణీ.- జి హెచ్ ఎం నాగరత్నమ్మ.



అక్షర కలం/ నారాయణపేట జిల్లా ప్రతినిధి: అక్టోబర్ 23.

నారాయణపేట జిల్లా మరికల్ మండల కేంద్రంలోని (పిఎంశ్రీ) జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 400 మంది విద్యార్థిని విద్యార్థులకు, పాఠశాల రిటైర్డ్ జిహెచ్ఎం సుందరయ్య, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు శెట్టి వీర బసంతయ్య ల సహకారంతో షూ పంపిణీ కార్యక్రమం గురువారం పాఠశాల ఆవరణలో జిహెచ్ఎం నాగరత్నమ్మ, ఉపాధ్యాయుల సమక్షంలో, మరికల్ మండల అఖిలపక్ష నాయకుల ఆధ్వర్యంలో విద్యార్థులకు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఈ కార్యక్రమంలో పాల్గొన్న అఖిల పక్ష నాయకులు మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని, అన్ని రంగాలలో ముందుండి పాఠశాల పేరుతో పాటు మరికల్ మండలం పేరు జిల్లా, రాష్ట్రస్థాయిలో ఉండే విధంగా చూడాలని సూచించారు. విద్యార్థులు చక్కగా చదివి భవిష్యత్తులో ఇంకా ఏవైనా అవసరాలు ఉంటే వారికి అందించడానికి అఖిలపక్ష నాయకులు సిద్ధంగా ఉన్నారని సూచించారు. అదేవిధంగా విద్యార్థులకు షూస్ పంపిణీ దాతలు విశ్రాంత ఉపాధ్యాయులు( జి హెచ్ ఎం) సుందరయ్య, బిఆర్ఎస్ నాయకులు వీర బసంతయ్య లకు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు (జిహెచ్ఎం) నాగరత్నమ్మ, ఉపాధ్యాయ బృందం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు, బెలగుంది వీరన్న, శెట్టి వీరభసంత్, హన్మిరెడ్డి, లంబడి తిరుపతయ్య, కానుగంటి నారాయణ, సురిటి చంద్రశేఖర్,గొల్ల రాజేష్, యువక మండలి అధ్యక్షులు, శ్రీకాంత్ రెడ్డి,పోలమోని రమేష్, వెంకటేష్ గౌడ్, సురేష్, గేసుదరాజ్ , విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా ఫుడ్ ఫెస్టివల్.

**– జిల్లా పరిషత్ బాలుర పాఠశాల, జిహెచ్ఎం నాగరత్నమ్మ.**



అక్షర కలం/నారాయణపేట జిల్లా ప్రతినిధి : అక్టోబర్ 23.

నారాయణపేట జిల్లా మరికల్ మండల కేంద్రంలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలురలో గురువారం ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా పాఠశాల జిహెచ్ఎం విశ్రాంత ప్రధానోపాధ్యాయులు సుందరయ్య చేతుల మీదుగా కార్యక్రమాన్ని ప్రారంభించారు.విద్యార్థులు ఇంటిదగ్గర అమ్మ నాన్నల సహకారంతో రుచికరమైన రకరకాల వంటకాలు చేసి ప్రదర్శించారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న గ్రామ అఖిలపక్ష నాయకులు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు విద్యార్థులు తయారు చేసినటువంటి పదార్థాలను తిని రుచి చూసి వారిని అభినందించారు. విద్యార్థులు నిజంగా చాలా అద్భుతంగా వంటకాలు చేసి అందరి మన్ననలను పొందారు. ఈ కార్యక్రమంలో పాఠశాల జిహెచ్ఎం నాగరత్నమ్మ, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు ,అఖిలపక్ష నాయకులు, బెలగుంది వీరన్న, శెట్టి వీర బసంతయ్య,హన్మిరెడ్డి, లంబడి తిరుపతయ్య, కానుగంటి నారాయణ, సురిటి చంద్రశేఖర్,గొల్ల రాజేష్, యువక మండలి అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి,పోలమోని రమేష్, వెంకటేష్ గౌడ్, సురేష్, గేసుదరాజ్ , తదితరులు పాల్గొన్నారు.

## పురాతన వీరభద్ర ఆలయాన్ని దర్శించుకున్న డి సి ఎస్ ఓ....



కొల్చారం అక్టోబర్ 22( అక్షర కలం):-

కార్తీక మాసం మొదటి రోజు సందర్భంగా జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి నిత్యానందం బుధవారం మెదక్ జిల్లా మండల కేంద్రమైన కొల్చారం లోని పురాతన వీరభద్ర ఆలయాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వయంగా ఆకాశ దీపాన్ని వెలిగించి జ్యోతి దర్శనం చేసుకున్నారు. కార్తీక మాసం నెలరోజుల పాటూ ఆలయ ప్రాంగణంలో ఆకాశ దీపాన్ని వెలిగించాలని పూజారిని కోరారు. ఈ నెల రోజులపాటు జ్యోతి ప్రజ్వలనకు కావలసిన నూనె తదితర సామాగ్రిని తానే స్వయంగా అందిస్తానని తెలిపారు. అనంతరం మాట్లాడుతూ పురాతన ఆలయాన్ని దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు. వీలు చిక్కినప్పుడు మళ్లీ వీరభద్రుడి దర్శనం చేసుకుంటానన్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు అధికారుల్ని శాలువాతో సత్కరించారు. అనంతరం మాట్లాడుతూ జిల్లా స్థాయి అధికారి తమ గ్రామంలోని పురాతన ఆలయాన్ని గుర్తించి దర్శించుకోవడం సంతోషకరమని, ఇది తమ గ్రామానికి వచ్చిన ప్రత్యేక గుర్తింపుగా భావిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు ర్యాగల్ల ఆనంద్, శ్రీధర్ గౌడ్, చౌరి గారి భాస్కర్, ర్యాగల్ల శ్రీనివాస్, నితిన్ ఉన్నారు.

## పత్తి రైతుల చరవాణి

# నెంబర్లు అప్డేట్ చేయండి

**రాష్ట్ర వ్యవసాయ, పశు సంవర్ధక శాఖ డైరెక్టర్ గోపి**

**జిన్నింగ్ మిల్లులు డాష్ బోర్డు నిర్వహించాలి**

**మిల్లులకు వచ్చే పత్తి రైతుల వివరాలన్నిటిని నమోదు చేయాలి**

**వ్యవసాయ అధికారులు అందుబాటులో ఉండాలని ఆదేశం**



అక్షరకలం నల్గొండ

పత్తి రైతుల చరవాణి నంబర్లు అప్డేట్ చేయాలని రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ బి. గోపి చెప్పారు. గురువారం ఆయన నల్గొండ జిల్లా, నార్కెట్ పల్లి మండలం, చౌడంపల్లి వద్ద ఉన్న వరమహాలక్ష్మి జిన్నింగ్ మిల్లును జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠీతో కలిసి సందర్శించారు. నల్గొండ జిల్లాలో ఈ వానాకాలం పత్తి ఉత్పత్తి, జిన్నింగ్ మిల్లులు, అమ్మకాలు, తదితర విషయాలను ముందుగా వ్యవసాయ శాఖ జిల్లా అధికారులతో అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 23 లక్షల పత్తి రైతులు ఉన్నారని, నల్గొండ జిల్లాలో 2.77 లక్షల మంది పత్తి రైతులున్నట్లు సమాచారం ఉందని డైరెక్టర్ తెలిపారు. అయితే పత్తి అమ్మకాలకు ఆన్లైన్లో స్లాట్ బుకింగ్ చేసుకోవాల్సి ఉన్నందున తప్పనిసరిగా పత్తి రైతుల చరవాణి నంబర్లు అప్డేట్ చేయాల్సి ఉందని అన్నారు. జిల్లాలోని పత్తి రైతుల మొబైల్ నెంబర్లను ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలని చెప్పారు. అలాగే జిన్నింగ్ మిల్లులు డాష్ బోర్డు నిర్వహించాలని, రోజు వారిగా ఎంతమంది రైతులు పత్తిని మిల్లులకు తీసుకొస్తున్న వివరాలు, అలాగే రాబోయే వారం రోజుల్లో మిల్లులకు వచ్చే పత్తి రైతుల వివరాలన్నిటిని నమోదు చేయాలన్నారు. చరవాణి అప్డేట్ చేసిన రైతు ఆధార్ వివరాలు, బ్యాంకు ఖాతా వివరాలన్నింటిని ఆటోమేటిక్ గా సాఫ్ట్ వేర్ లో అప్డేట్ అయ్యే విధంగా సీసీఐ సాఫ్ట్ వేర్ ను రూపొందించడం జరిగిందని, అందువల్ల పత్తి రైతుల వివరాలన్నీ అప్డేట్ చేయాలని చెప్పారు. అలాగే వ్యవసాయ శాఖ తరఫున ఒక వ్యవసాయ అధికారిని అన్ని జిన్నింగ్ మిల్లుల వద్ద నియమించాలని, ఏదైనా కారణం చేత మిల్లుకు పత్తి వచ్చిన రోజు కొనుగోలు చేయనట్లయితే మరుసటి రోజు లేదా రెండవ రోజు రైతు అక్కడే ఉండి అమ్ముకునేందుకు వీలుగా వ్యవసాయ అధికారులు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన వరమహాలక్ష్మి కాటన్ మిల్లుకు పత్తి తీసుకువచ్చిన రైతులతో ముఖాముఖి మాట్లాడారు. తేమ, నాణ్యత పరిశీలించారు. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా నిబంధనల ప్రకారం రైతులు నాణ్యత ప్రమాణాలతో పత్తిని మిల్లులకు తీసుకురావాలని, నాణ్యత ప్రమాణాల విషయమై సిసిఐ లేదా వ్యవసాయ అధికారులను సంప్రదించాలని ఆయన సూచించారు. మిర్యాలగూడ సబ్ కలెక్టర్, స్థానిక సంస్థల ఇంచార్జ్ ఆదనపు కలెక్టర్ నారాయణ అమిత్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, నల్గొండ ఆర్డిఓ వై. అశోక్ రెడ్డి, మార్కెటింగ్ ఎడి ఛాయాదేవి, డిఆర్డిఓ శేఖర్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

## కొనుగోలు నిర్వహకులు లారీలను

# సిద్ధంగా ఉంచుకోవాలి

### జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాటి

అక్షరకలం నల్గొండ

ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహకులు ధాన్యాన్ని తరలించేందుకు లారీలను సిద్ధంగా ఉంచుకోవాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాటి సూచించారు. గురువారం ఆమె నార్కెట్ పల్లి మండలం, చౌడంపల్లి, నెమ్మాని శివారులలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం, ఐ కె పి ల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ రెండు కేంద్రాలలో ఇప్పటివరకు వచ్చిన ధాన్యం, అమ్మిన ధాన్యం, లారీలు, సామాగ్రి, సౌకర్యాల వివరాలను నిర్వాహకుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు ఎంత దాన్యం



వచ్చిందని కనుక్కోగా వర్షం కారణంగా ప్రతిరోజు మిల్లులకు ధాన్యం పంపలేకపోతున్నామని నిర్వాహకులు జిల్లా కలెక్టర్ కు తెలిపారు. ఇందుకు కలెక్టర్ స్పందిస్తూ లారీలను సిద్ధంగా ఉంచుకోవాలని, వర్షం తగ్గినప్పుడు సరైన తేమ శాతంతో ఉన్న ధాన్యాన్ని తక్షణమే మిల్లులకు పంపించేందుకు లారీ కాంట్రాక్టర్లతో సమన్వయం చేసుకోవాలని, నాణ్యత ప్రమాణాలతో సిద్ధంగా ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేసి వెంటనే పంపించాలని, అదేవిధంగా మరుసటి రోజు, రాబోయే వారం రోజుల్లో మిల్లులకు పంపే ధాన్యాన్ని అంచనా వేసి లారీలను ఏర్పాటు చేసుకోవాలని ఆమె తెలిపారు. వర్షానికి ధాన్యం తడవకుండా టార్పాలిన్లు కప్పి ఉంచాలని చెప్పారు. స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ నారాయణ అమిత్, రెవెన్యూ ఆదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, ఆర్డిఓ వై అశోక్ రెడ్డి, డిఆర్డిఓ శేఖర్ రెడ్డి, డిసిఓ పత్యా నాయక్, మార్కెటింగ్ ఎడి ఛాయాదేవి, జిల్లా పౌర సరఫరాల అధికారి వెంకటేష్,పౌర సరఫరాల డిఎం గోపికృష్ణ, తహసిల్దార్ వెంకటేశ్వర్లు, తదితరులు జిల్లా కలెక్టర్ వెంట ఉన్నారు.

# జాబ్ మేళాకు యుద్ధప్రాతిపదికన ఏర్పాట్లు



### జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

అక్షర కలం / సూర్యాపేట

ఈ నెల 25 (శనివారం ) హుజూర్నగర్ పట్టణం లోని పెర్ల్ ఇన్ఫినిటీ ఇంటర్ నేషనల్ స్కూల్ లో నిర్వహించే జాబ్ మేళా ఏర్పాట్లను గురువారం జిల్లా ఎస్పి కే .నరసింహ తో కలిసి ఆయన పర్యవేక్షించారు. కంపెనీల వారీగా స్టాల్స్ కేటాయింపుల వివరాలను అందజేయాలనీ సింగరేణి ప్రతినిధి చందర్ ను కలెక్టర్ ఆదేశించారు. రిజిస్ట్రేషన్ కౌంటర్ల వద్ద అభ్యర్థులు ఎక్కువగా నిలబడకుండా రంగాల వారీగా ఎక్కువ కౌంటర్లు ఏర్పాటు చేయాలని, డిగ్రీ కళాశాల, మార్కెట్ యార్డ్ , స్వర్ణ వేదిక పంక్షన్ హాల్ ప్రక్కన ఉన్న వెంచర్ లను పరిశీలించి పార్కింగ్ ఏర్పాటు చేసి కుర్చీలు ఏర్పాటు చేయాలని, రిజిస్ట్రేషన్ కౌంటర్ల వద్ద, భోజనాల వద్ద ఎవరికీ అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చూసుకోవాలని కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణకు సూచించారు.జాబ్ మేళా ప్రాంగణానికి అప్రోచ్ రోడ్లను వేయాలని, మొబైల్ టాయిలెట్స్, అభ్యర్థుల సౌక్యార్థం జిరాక్స్ సెంటర్ ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్ ని, వర్షం కురిసిన వాటర్ ప్రూఫ్ టెంట్ లను జాబ్ మేళా ప్రాంగణం,స్వర్ణ వేదిక పంక్షన్ హాల్ ప్రాంగణం, పార్కింగ్ ప్రదేశాలలో ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అదనపు ఎస్పి రవీందర్ రెడ్డి , ఆర్డీఓలు శ్రీనివాసులు, సూర్యనారాయణ,డి ఎస్ పి ప్రసన్న కుమార్,సింగరేణి ప్రతినిధి చందర్,జిల్లా ఉపాధి కల్పనాధికారి శంకర్, జి ఎం ఇండస్ట్రీస్ సీతారాం నాయక్, ఎస్ సి కార్పొరేషన్ ఈడి శ్రీనివాస్ నాయక్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి,సరోత్తం రెడ్డి, కొప్పుల వేణారెడ్డి, చింతల లక్ష్మి నారాయణ రెడ్డి దొంగరి వెంకటేశ్వర్లు,గెల్లి రవి,తన్నీరు మల్లిఖార్జున్, పోతు భాస్కర్,కలెక్టర్ వెంట ఉన్నారు.



Printed, Published and Owned by Pittala Ramakrishna, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana) Printed at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada,Nalgonda - 508 001. (Telangana) Published at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana)Editor: PITTALA RAMAKRISHNA, Cell: 9396218955